
మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 349 | బుధవారం | 20-11-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



కుల గణనపై కేంద్రం ద్వంద్వ వైఖరి

స్థానిక ఎన్నికల్లో బిసి వర్గీకరణ సాధ్యం కాదు

లోపలి పేజీల్లో




“ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని మా ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఆడ బిడ్డలు మనసునిండుగా నన్ను ఆశీర్వదించడం వల్లే ఇవాళ ఈ స్థానంలో ఉన్నా.. మహిళలు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. టాటా, బిర్లాలను తలదన్నేలా రాష్ట్రంలో ఆడబిడ్డలను వ్యాపారులుగా మా ప్రభుత్వం తీర్చిదిద్దబోతోంది.
– సిఎం రేవంత్‌రెడ్డి



# అభివృద్ధిని అడ్డుకుంటే ఊచలు లెక్కించాల్సిందే

ప్రతిపక్షంలో ఉంటే ఫామ్‌హౌస్‌లో పడుకోవడమా?
కెసిఆర్.. అసెంబ్లీకి రా.. అభివృద్ధిపై చర్చ పెడదాం
కిషన్‌రెడ్డి.. గుజరాత్‌కు వెళ్లిపో
హనుమకొండ ఇందిరా మహిళాశక్తి విజయోత్సవ సభలో సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్
మహిళల ఎదుగుదలకు ఎంత ఖర్చైనా చేస్తాం :భట్టి

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

అభివృద్ధిని అడ్డుకుంటే ఊచలు లెక్కించాల్సిందేనని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కొందరు ఇటీవల పదేళ్లలో ప్రజలు ఏం కోల్పోయారో ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని, కెసిఆర్ కుటుంబంలో నలుగురు ఉద్యోగాలు పీకేస్తే యువకులకు 50 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలుసుకున్నారని అన్నారు. అధికారంలో ఉంటే దోచుకోవడం, ప్రతిపక్షంలో ఉంటే ఫామ్‌హౌస్‌లో పడుకోవడం మాత్రమే కెసిఆర్‌కు తెలుసన్నారు. 'దమ్ముంటే అసెంబ్లీకి రా.. అభివృద్ధిపై చర్చ పెడదాం' అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన 'ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ' సభలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కెసిఆర్ తరువాయి 12లో





## ఓరుగల్లులో అద్భుతం ఆవిష్కృతం

03

ప్రజాకవి కాళోజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన సిఎం

## కోర్టులో లొంగిపోయిన లగచర్ల సూత్రధారి 'సురేశ్'

దాడి ఘటనలో మరో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాపక్షం / కొడంగల్


వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడికి సూత్రధారి అయిన బోగమోని సురేశ్ మంగళవారం కొడంగల్ కోర్టులో లొంగిపోయాడు. ఆయనకు కోర్టు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఈ మేరకు పోలీసులు ఆయనను సంగారెడ్డి జిల్లా జైలుకు తరలించారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్‌లో భూసేకరణ గురించి కలెక్టర్ సమక్షంలో రైతుల అభిప్రాయాలను సేకరించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కానీ రైతులు ఆ సమావేశానికి ఎవ్వరూ రాకపోవడంతో సురేశ్‌రాజ్ అనే యువకుడు కలెక్టర్‌ను లగచర్ల గ్రామానికి రప్పించాడు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ లగచర్లకు చేరుకున్న వెంటనే సురేశ్‌రాజ్ తన వర్గీయులతో అధికారులపై దమనకాండకు పూనుకోవడంతో ఒక్కసారిగా అల్లర్లు చెలరేగాయి. రైతులను ముందుకు నెట్టి తరువాయి 2లో




## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జిఒ రద్దు

ఇప్పటికే రెగ్యులరైజ్‌చేసిన ఉద్యోగులను తొలగించొద్దు :హైకోర్టు

**హైదరాబాద్ :** కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి తీసుకొచ్చిన సెక్షన్ 10ఎ ను హైకోర్టు కొట్టేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న చట్టానికి సవరణ తెస్తూ గత ప్రభుత్వం సెక్షన్ 10ఎ తీసుకొచ్చింది. దీని ఆధారంగా కాంట్రాక్టు ఉద్యోగులను, క్రమబద్ధీకరిస్తూ తీసుకువచ్చిన జిఒ 16 చట్ట విరుద్ధమని హైకోర్టు దానిని కొట్టివేసింది. అయితే ఈ జిఒ ద్వారా ఇప్పటికే క్రమబద్ధీకరించిన ఉద్యోగులను మాత్రం తొలగించొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి భర్తీ చేసే ప్రభుత్వ ఉద్యోగాలన్నీ చట్ట ప్రకారం చేపట్టాలని.. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా కాదని హైకోర్టు పేర్కొంది. గత ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన సెక్షన్ 10ఎ సవరణ ద్వారా పలు తరువాయి 2లో





## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

గత రెండు రోజులుగా చలి ఉధృతి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గత రెండు రోజులుగా చలి ప్రభావం పెరిగింది. తెల్లవారుజామున రోడ్లపై ఏమీ కనిపించలేనంతగా మంచు కమ్మేస్తోంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టాయన్నారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో తరువాయి 12లో

## బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి



ప్రధాని మౌనం వీడాలి
సిపిఐ మణిపూర్ రాష్ట్ర సమితి డిమాండ్


**ఇంఫాల్ :** మణిపూర్ ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని, నిరంకుశ సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (అఫ్స్పా)ను ఉపసంహరించుకోవాలని మణిపూర్ సిపిఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. సంక్షోభ అత్యవసర స్థితి కేంద్ర ప్రభుత్వ తక్షణ జోక్యాన్ని సూచిస్తున్నదని, తక్షణ సవాళ్ళ పరిష్కారంతో పాటు, రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు మణిపూర్‌లో న్యాయం, శాంతి, గౌరవం పరిఢవిల్లే విధంగా నిబద్ధతలో కృషి చేయాలని కోరింది. అందరిని కలుపుకొని పోయే విధంగా సమ్మిళిత చర్చలు, సానుభూతితో కూడిన పాలన, జవాబుదారీతనం ద్వారానే మణిపూర్ ప్రజల్లో ఉజ్వల ఆకాంక్ష, సామరస్యంతో కూడిన భవిష్యత్తుపై విశ్వాసం కల్పిస్తుందని స్పష్టం చేసింది. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం ఐరావత్ భవన్‌లో గత శుక్రవారం నాడు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లబ్ సేన్ గుప్తా హాజరయ్యారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి తరువాయి 2లో

### అఫ్స్పాను తొలగించాలని ధర్నా

ఇటీవల ఆరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అమలు చేస్తున్న అఫ్స్పాను ఉపసంహరించుకోవాలని, మణిపూర్‌లో కొనసాగుతున్న హింసకు త్వరిత పరిష్కారం కావాలని కోరుతూ మణిపూర్ సిపిఐ రాష్ట్ర సమితి ధర్నా నిర్వహించింది. ఐరావత్ భవన్ ఎదుట మంగళవారం జరిగిన ధర్నాను ఉద్దేశించి సిపిఐ మణిపూర్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎల్.సోంతికుమార్ మాట్లాడుతూ తమ స్వరాష్ట్రంలోనే మణిపూర్ ప్రజలు శరణార్థులుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ, విదేశాలలో పర్యటించేందుకు ప్రధాని మోదీకి సమయం లభిస్తుందని, కానీ, కనీసం మణిపూర్ మహిళలు, చిన్నారుల హత్యలపై మాట్లాడేందుకు సమయం లేదని విమర్శించారు.

## మణిపూర్ పరిస్థితులపై తక్షణం జోక్యం చేసుకోండి

ప్రజలు శాంతియుత జీవనానికి చర్యలు తీసుకోండి
రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మల్లిఖార్జున ఖర్గే లేఖ
ప్రధాని, సిఎంలపై మణిపురిలు విశ్వాసం కోల్పోయారు



**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో క్షీణిస్తున్న పరిస్థితులపై తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్ర ప్రజలు తమ స్వంత ఇళ్ళలో శాంతియుత, గౌరవప్రద జీవనాన్ని సాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్రపతికి ఖర్గే మంగళవారం రెండు పేజీల లేఖ రాశారు. గడిచిన 18 నెలల్లో మణిపూర్ లో శాంతిభద్రతలను, ప్రజల భద్రతను పరిరక్షించడంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ఆ రాష్ట్రంలో హింస బారిన పడి ఇప్పటికే మహిళలు, పిల్లలు, చిన్నారులు సహా 300 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, అంతర్గతంగా లక్షలాది మంది నిరాశ్రయులుగా మారి, వివిధ పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల కష్టాలు అప్రతిహతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గణతంత్ర భారతదేశ అధ్యక్షులుగా, రాజ్యాంగ పరిరక్షకులుగా రాజ్యాంగ అధిపతిగా తక్షణమే జోక్యం చేసుకొని మన పౌరులైన తరువాయి 2లో

## నేడు మహారాష్ట్రలో అసెంబ్లీ దంగల్

288 స్థానాల్లో పోలింగ్
జార్ఖండ్‌లో రెండవ విడతగా 38 నియోజకవర్గాలలోనూ....

**ముంబయి/రాంచి :** మహారాష్ట్రలో మొత్తం ఒకే విడతగా 288 స్థానాల్లో, జార్ఖండ్‌లో రెండవ విడతగా 38 స్థానాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడగా, మైకులు మూగబోగా పార్టీలు తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్‌కు ఏర్పాట్లను పూర్తి చేసింది. మహారాష్ట్రలో పోలింగ్ ఉదయం 6 గంటల తరువాయి 2లో

## విజయ్ మాల్యా, నీరవ్‌లను అప్పగించండి

బ్రిటన్ ప్రధానితో మోదీ

**రియో డి జెనిరో:** బ్రెజిల్ వేదికగా జరుగుతున్న జి20 సదస్సులో భాగంగా వివిధ దేశాల అధినేతలతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఆర్థిక నేరగాళ్లు విజయ్ మాల్యా, నీరవ్ మోదీలను భారత్‌కు అప్పగించాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తో జరిగిన సమావేశంలో మోదీ కోరారు. వారితో పాటు పన్ను ఎగవేత, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మధ్యవర్తి సంజయ్ భండారీని కూడా రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. తప్పుడు ఎల్‌వోయూలతో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను నీరవ్ మోదీ మోసగించిన వైనం 2018లో వెలుగుచూసింది. ఈ కేసును సిబిఐ, ఇడి విచారిస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా నీరవ్ ఆస్తుల్ని ఇడి స్వాధీనం చేసుకుంది. 2018 డిసెంబర్‌లో నీరవ్ తమ దేశంలోనే నివసిస్తున్నాడని బ్రిటన్ ప్రభుత్వం భారత్‌కు తెలియజేసింది. దీంతో అతడిని అప్పగించాలని భారత్ విజ్ఞప్తి చేసింది. ఈ క్రమంలో 2019 మార్చిలో నీరవ్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. అతన్ని భారత్‌కు అప్పగించేందుకు ఈ ఏడాది బ్రిటన్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తనను భారత్‌కు అప్పగించే విషయాన్ని సవాలు చేస్తూ నీరవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అక్కడి కోర్టు కొట్టివేసింది. మరోవైపు విజయ్ మాల్యా భారత్‌లో రూ.9వేల కోట్ల తరువాయి 2లో



## బిలియనీర్లపై అంతర్జాతీయ పన్ను

గాజాకు మరింత సాయం
జి-20 సదస్సు డిక్లరేషన్

**రియో డి జెనిరో:** బిలియనీర్లపై భవిష్యత్తులో గ్లోబల్ టాక్స్ విధించాలని, ఐక్యరాజ్య సమితి శాశ్వత సభ్యత్వాన్ని ఐదు దేశాల నుంచి మరింత విస్తరించాలని జి–20 సదస్సు పిలుపునిచ్చింది. ఈ మేరకు జి–20 సభ్య దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. ఆకలిపై పోరుకు అంతర్జాతీయ ఒప్పందం చేసుకోవాలని, గాజాకు మరింత సాయం అందించాలని, ఉక్రేన్ యుద్ధాన్ని ఆపివేయాలని పిలుపునిచ్చాయి. సంయుక్త ప్రకటనను జి 20 సభ్యులు దాదాపు అంగీకరించినప్పటికీ, పూర్తిగా ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. అర్జెంటీనా దేశం తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. బ్రెజిల్‌లోని రియో డి జెనిరో నగరంలోబుధవారం ముగియనున్న మూడు రోజుల జి–20 సదస్సులో ఏదైనా ఒప్పందం కోసం ఇతర దేశాలను సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా ఏ మేరకు ఒప్పించగలరని నిపుణులు సందేహాలు వ్యక్తం చేశారు. ఒకవైపు తాజా యుఎస్ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక, పశ్చిమాసియాలో, ఉక్రేన్‌లో పెరిగిన అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణంగా భావించారు. అయినప్పటికీ నిర్దిష్టంగా కాకుండా, వివిధ అంశాలపై సాధారణ ప్రకటనలు జి–20 దేశాలు చేశాయి. ప్రాథమిక ముసాయిదాలో భాషపై అర్జెంటీనా కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఆ దేశం సంయుక్త ప్రకటనను ఆమోదించలేదు. అసలు తరువాయి 2లో



# సామూహిక దాడిచేస్తే అణు విధ్వంసమే!

## బైడెన్ చర్యకు రష్యా ప్రతిస్పందన
## అణ్వాయుధ నిబంధనలు సడలించిన పుతిన్



**మాస్కో :** పెనువిధ్వంసం సృష్టించే దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాభూభాగాలపై ప్రయోగించేందుకు ఉక్రేన్‌కు అనుమతి ఇచ్చిన అమెరికా చర్యపై రష్యా తీవ్రంగా ప్రతిస్పందించింది. అణుశక్తి సామర్థ్యంలేని ఒకదేశం, అణ్వాయుధాలుగల మరోదేశం సహాయంతో దాడిచేస్తే అలాంటి దాడిని ఉమ్మడి–సంయుక్తదాడిగా రష్యాదేశం పరిగణిస్తుందని పుతిన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకూ రష్యా అనుసరిస్తున్న అణుసిద్ధాంత వైఖరిలో ఈ మేరకు మార్పులు చేస్తూ ఒక ఫైలుపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ మంగళవారంనాడు సంతకాలు చేశారు. అలాంటి సంయుక్తదాడులు అణ్వాయుధాలతో ప్రతిస్పందనకు దారితీయవచ్చునని హెచ్చరించారు. అదేసమయంలో,ఈ విధమైన ప్రతిస్పందన ఖచ్చితంగా అణ్వాయుధాలతో జరిపే ప్రతిఘటనేనా? కాదా? అనే సుస్పష్టమైన షరతులను మాత్రం తాజాగా మరింత సడలించిన రష్యా అణ్వస్త్రవైఖరి పత్రాలలో ప్రకటించలేదు. అణ్వస్త్రాలు ప్రయోగించే అవకాశమున్న ప్రదేశం, సమయం, దాడుల తీవ్రత వంటివి ఇందులో కీలక సూత్రాలుగా ఉంటాయని పేర్కొంది. ఐతే తీవ్రస్థాయిలో సామూహిక గగనతలదాడులు చేసినప్పుడు గతంకంటే భిన్నంగా ఖండాంతర క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లు, ఎయిర్‌క్రాఫ్టులు, ఫ్లయింగ్ ఆయుధాలతో అణ్వాయుధాలను ప్రయోగించడానికి గల అవకాశాలుంటాయని పేర్కొంది. రష్యాపై ఉక్రేన్ దీర్ఘశ్రేణి క్షిపణులు ప్రయోగిస్తే దీనిని పశ్చిమదేశాల ప్రత్యక్షజోక్యంగా, ఉమ్మడి దాడిగా పరిణిస్తామని పుతిన్ అన్నారు. ఉక్రేన్–రష్యామధ్య యుద్ధం ప్రారంభమై నవంబరు 19వ తేదీనాటికి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కొత్త అణు నిరోధక విధానాన్ని పుతిన్ ఆమోదించారు. రష్యా సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రమాదం వాటిల్లితే, రష్యా, దాని మిత్రదేశం బెలారస్ వంటివాటికి దాడులద్వారా ముప్పు వాటిల్లితే రష్యా దానిని సవాలుగా తీసుకుని అణ్వస్త్రదాడులకు పాల్పడుతుందని పుతిన్ ప్రకటనపై విశ్లేషకులు స్పందించారు. రష్యాను రక్షించుకునేందుకు అణ్వాయుధాలు ప్రయోగించేందుకు వెనుకాడబోమని ఇప్పటికే ప్రకటించిన పుతిన్, ఆ మేరకు రష్యా అణ్వస్త్రవైఖరిని సడలించారు. తాజాగా ఇప్పుడు ఈ వైఖరిలో మరిన్ని మార్పులు చేశారు. తాజాగా బైడెన్ రెచ్చగొట్టే ప్రకటనతో అణుప్రయోగానికి అడ్డంకులు తొలగించే కీలకపత్రాలపై సంతకాలుగానే దీనిని భావిస్తున్నారు. ఈ ఫైలుపై సంతకాలు చేయడంవల్ల, ఏ దేశమైనాగానీ అణ్వాయుధ సంపత్తిగల ఇతర దేశాల మద్దతుతో రష్యన్ ఫెడరేషన్‌పై సామూహికంగా గగనతల దాడులకు పాల్పడితే అది తమను అణ్వాయుధ ప్రయోగానికి పురిగొల్పినట్టేకాగలదని పుతిన్ స్పష్టం చేశారు. ఐతే రష్యా ప్రకటన అమెరికా,ఉక్రేన్, పశ్చిమదేశాలను ఉద్దేశించినదే ఐనప్పటికీ, ఎవరి మద్దతుతో ఎవరు రష్యాపై దాడి చేస్తారు? అనే విషయాలను మాత్రం ప్రత్యక్షంగా ప్రకటించలేదు. అమెరికా సరఫరా చేసే దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగించేందుకు ఉక్రేన్‌కు అనుమతి ఇస్తూ జో బైడెన్ (ఔట్‌గోయింగ్) నిర్ణయం తీసుకున్న వెంటనే రష్యా దీటుగా స్పందించింది. దీర్ఘశ్రేణి క్షిపణులను సరఫరా చేయాలని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అనేకసార్లు అడిగినప్పటికీ అనుమతించబోనని ఇప్పటివరకూ చెప్పిన జో బైడెన్, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి అనంతరం పదవీకాలం చివరిరోజుల్లో అంగీకారం తెలియజేశారు. ఉక్రేన్–రష్యామధ్య యుద్ధానికి ఆజ్యంపోశారు. 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఉక్రేన్‌పై పుతిన్ యుద్ధం ప్రారంభించారు. రష్యాను అణచివేసేందుకు తమ దేశ సరిహద్దుల్లో అమెరికా, పశ్చిమదేశాలు క్షిపణులు మోహరించి పాగా వేసేందుకే ఉక్రేన్‌ను రెచ్చగొడుతున్నాయని పుతిన్ పలుసార్లు చెప్పారు. ఉక్రేన్‌ను ఆసరాగా చేసుకుని అగ్రదేశాల మధ్య ఈ పరోక్షయుద్ధం జరుగుతోందని కూడా ఉక్రేన్ యుద్ధ ఆరంభంలో పరిశీలకులు చేసిన విశ్లేషణలు ఈ సందర్భంగా గమనార్హం.




# యుద్ధంలో భారీ మార్పులొస్తాయి : జెలెన్‌స్కీ

## వెయ్యిరోజులకు చేరిన ఉక్రేన్ యుద్ధం



**కీవ్ :** ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధానికి (నవంబరు 19నాటికి) 1,000 రోజులు పూర్తయింది. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించింది. ఐతే తాజాగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రేన్‌కు దీర్ఘకాలి క్షిపణులు ప్రయోగించేందుకు అనుమతి ఇవ్వడంపట్ల ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల ఇక యు ద్ధంలో చాలా మార్పులు వస్తాయన్నారు. యు ద్ధంలో ఇకమీదట రష్యా భూభాగాలపై దాడు లు చేసేందుకు తమకు పూర్తిస్వేచ్ఛ లభించిందని, తమ దాడుల తీవ్రతవల్ల రష్యాకు చాలా వి షయాలు తెలిసివస్తాయని, ఇది యుద్ధం ము గింపునకు దోహదపడుతుందని జెలెన్‌స్కీ అన్నా రు. కాగా మంగళవారంనాడు ఉక్రేన్ లాంగ్ రేంజ్ మిస్సైల్స్‌ను తమ భూభాగంలోకి ప్రయోగించిందని రష్యా ప్రకటించింది. బ్రయాన్స్క్ రీజియన్‌లోకి ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్‌ను ఉక్రేన్ ప్రయోగించిందని రష్యా సైన్యం పేర్కొం ది. వీటిల్లో ఐదు క్షిపణులను కూల్చివేశామని ప్రకటించింది. ఉక్రేన్‌లో యుద్ధం మొదలయ్యా క మొదటిసారి ఆ దేశం రష్యా భూభాగంలోకి దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించింది. ఇదిలా ఉండగా ఉక్రేన్‌లో యుద్ధం తీవ్రత, ఆ అనుభవాలను పలువురు పౌరులు, సైనికుల కుటుంబాలు తమ అనుభవాలను జ్ఞప్తికి తెచ్చుకున్నా యి. రెండు బాంబు దాడులతో ఆరోజు ప్రారంభమైందని జపోరిఝియాలో ఒక మహిళ తను అనుభవాలు వివరించారు. ఉక్రేన్‌కు చెందిన ఐదువంతుభాగం ఇప్పుడు రష్యా అధీనంలో ఉంది. భౌగోళికంగా ఆనాడున్న సరిహద్దులు ఈనాడు చెరిగిపోయాయి. రెండుదేశాల సరిహద్దుల్లో ఉన్న నో మ్యాన్ జోన్ అంతా బూడిగా మారింది. చెట్లు మంటల్లో కాలిపోయాయి. అ క్కడ జీవం లేదు. డ్రోన్ల దాడులు తరచు జరుగుతున్నాయి. యుద్ధానికి ముందే చాలామంది దంపతులు, కుటుంబాలు ఇళ్ళు వదలి దేశం వలిలి కూడా వెళ్ళిపోయారని కొందరు తమ అనుభవాలు పంచుకున్నారు. యుద్ధం మొదలైనప్పుడు గంటకు 60 మంది చొప్పున ఆసుపత్రుల్లో చేరానని, విరామం లేకుండా సర్జరీలు జరిగాయని డాక్టర్ వ్లడిస్లావా చెప్పారు.

# పేద దేశాలకోసం ప్రపంచబ్యాంకుకు 4 బిలియన్ డాలర్లు : బైడెన్



**రియోడి జనైరో :** పేదదేశాలకోసం ప్రపంచబ్యాంకు నిధికి నాలుగు బిలియన్ డాలర్లు ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. రియోడీ జెనేరియోలో జి–20 శిఖరాగ్రసభ ముగింపులో బైడెన్ మాట్లాడుతూ, ప్రపంచబ్యాంకు అంతర్జాతీయ అభివృద్ధి నిధికి పేద దేశాలకు ఖర్చు చేసేందుకు ఈ మొత్తం ప్రకటించినట్లు చెప్పారు. ఐతే కొత్తగా బాధ్యతలు చేపట్టబోయే దేశాధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు బైడెన్ చేసిన వాగ్దానానికి కట్టుబడతారా? లేదా? అనే సందేహాలు కూడా ఉన్నాయి. దేశంలో వృథాఖర్చు తగ్గించేందుకు ప్రత్యేకశాఖ ఏర్పాటు చేసిఎలాన్‌మస్క్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఐతే ప్రపంచబ్యాంకు ఐడిఏ ఫండ్ కింద పేద దేశాలకు అనేక కార్యక్రమాల నిమిత్తం ఈ నిధులను పంచి ఇస్తూ ఉంటుంది. పేద దేశాలలో సంక్షోభం పెరుగుతోందనీ, వాటి నుండి అనేక సమస్యల పరిష్కారానికి నిధులు కావాలనే డిమాండ్ పెరుగుతోందనీ ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా అన్నారు. 2021లో చేసిన నిధుల ప్రకటనకంటే ఈసారి బైడెన్ ప్రపంచబ్యాంకుకు 14.3 శాతం ఎక్కువ ప్రకటించారు.

# న్యూజిలాండ్ పార్లమెంటు ఎదుట ర్యాలీ



**వెల్లింగ్టన్ :** న్యూజిలాండ్ పార్లమెంటు వెలుపల మంగళవారంనాడు వేలాదిమంది గుమిగూడి హక్కులకోసం నిరసన ప్రదర్శన జరిపారు. మాయోరి ప్రజల హక్కులకు తీవ్ర భంగం కలిగించే ఒక బిల్లును పార్లమెంటులో ఆమోదించవద్దని కోరుతూ వేలాదిమంది పార్లమెంటు ఎదుట ర్యాలీ చేశారు. లిబరిటేరియన్ యాక్ట్ న్యూజిలాండ్ పార్టీ ఈనెలారంభంలో ప్రవేశపెట్టిన ట్రీటీ ప్రిన్సిపల్స్ బిల్లును తిరస్కరించాలని న్యూజిలాండ్ పార్లమెంటు సభ్యులకు నిరసన ప్రదర్శకులు విజ్ఞప్తి చేశారు. ఐతే మధ్యేవాద కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చిన్న పార్టీ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు సభలో అంతగా మద్దతు లభించే అవకాశం లేదని చెబుతున్నారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ మాయోరి భాషకు చెందిన ప్రజలు తొమ్మిదిరోజులక్రితం రాజధాని వెల్లింగ్టన్‌కు పాదయాత్రగా ప్రారంభమయ్యారు. పార్లమెంటుకు వచ్చేసరికి మంగళవారంనాడు సుమారు 50 వేలమంది ఈ ర్యాలీలో చేరారు.

# బైడెన్‌పై నేతన్యాహూ విమర్శలు



**టెల్అవీవ్ :** ఇజ్రాయెల్ అధ్యక్షుడు నేతన్యాహూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు చేశారు. గాజాలో, ఇతర ప్రాంతాలలో దాడులు చేయకూడదని తమపై ఆంక్షలు విధించారని, అలాచేస్తే ఒంటరి అవుతారని హెచ్చరించారని అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ఆయన ఈ విషయాలు చెప్పారు. అదేవిధంగా అమెరికాలో కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇరాన్ స్థావరాలపై దాడులు చేసే విషయాలపై ఆలోచిస్తామన్నారు. ఇరాన్ అణుస్థావరాలపై తాము దాడులు చేశామని ఆయన అంగీకరించారు. అమెరికా ఎన్నికల తర్వాత మొదటిసారి ఆయన ఈ విధంగా మాట్లాడారు. ఖాన్ యూనిస్‌లోకి వెళ్ళొద్దని, ఆయుధాలు ఇవ్వబోమని బైడెన్ అన్నారన్నారు. అలాచేస్తే ఆయుధాలు ఇవ్వబోమన్నారన్నారు. అక్టోబరులో ఇరాన్‌పై దాడులుచేసి కొన్ని అణుస్థావరాలను దెబ్బతీశామని ఐతే ఇదేమీ పెద్ద నష్టం కాదనీ అన్నారు.ఇదిలాఉండగా ఇజ్రాయెల్‌పై హిజ్బొల్లా దాడులు చేసింది. ఈ దాడుల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. బీరూట్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఇద్దరు మరణించారు. మౌలికసదుపాయాలు ధ్వంసమయ్యాయి.

# ఎనిమిదో వింత సృష్టించిన ఘనత టిఆర్ఎస్, బిజెపిల దే : చామల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''ప్రపంచంలో ఉన్నటువంటి ఏడు వింతల తర్వాత ఎనిమిదో వింత సృష్టించిన ఘనత టిఆర్ఎస్, కేవలం బిజెపి, బిఆర్ఎస్ నిస్సిగ్గుగా పెనవేసుకుని ఫ్రెండ్ షిప్ చేస్తే తప్ప... ఈ ఎనిమిదో వింత సాధ్యం కాదు'' అని ట్విట్టర్ వేదికగా ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మంగళవారం ట్విట్ చేశారు. కొండగల్ ఫార్మా సెజ్ లేదా..ఇండస్ట్రీయల్ హబ్..పేరు ఏదనా ఇంత వరకు భూ సేకరణ పూర్తి కాలేదని పేర్కొన్నారు.రైతులు ఇవ్వని భూముల పై కేసులు పెట్టారనడం, ఎమన్నా అర్థం పరమార్థం ఉందా అని బిఆర్ఎస్, బిజెపి నేతలను ఆయన ప్రశ్నించారు.

# లగచర్ల సూత్రధారి 'సురేశ్'

(మొదటి పేజీ తరువాయి)

దాడికి పాల్పడిన వారు పరారీ అయ్యారు. రైతులను పోలీసులు పట్టుకుని దీనికి ప్రేరేపించిన వారిని ఎవ్వరికి వదలకుండా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం నుంచి దాడి జరిగిన సమయం వరకూ సురేష్‌రాజ్ అనే వ్యక్తి మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్‌రెడ్డితో దాదాపుగా 40 సార్లు ఫోన్‌లో సంభాషించినట్లు పోలీసులు గుర్తించి రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఘటనలో పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి చర్లపల్లి జైలుకు పంపించారు. గత వారం రోజులుగా పరారీలో ఉన్న సురేష్ రాజ్ కోసం పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అడిషినల్ ఐజి సత్యనారాయణ మీడియాకు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదుల సమక్షంలో నేరుగా మంగళవారం కొడంగల్ కోర్టులో ప్రత్యక్షం అయ్యాడు. కోర్టులో లొంగిపోయిన సురేశ్‌రాజ్ ను కొడంగల్ న్యాయమూర్తి దాదాపు 3 గంటల పాటు విచారించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో వైద్య చికిత్సలు నిర్వహించి సంగారెడ్డి జైలుకు తరలించారు. వీరితో పాటు పోలీసులు లగచర్ల గ్రామానికి చెందిన నీరటి సురేశ్, హన్మంతులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి సంగారెడ్డి జైలుకు తరలించారు.

# బిలియనీర్లపై అంతర్జాతీయ పన్ను

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త ప్రకటనే ఉండదని ఒకానొక సందర్భంలో భావించారని, అనేక అభ్యంతరాలు ఉన్నప్పటికీ లులా మంచి ఫలితాన్ని సాధించారని, ఇది బ్రెజిల్‌కు సానుకూల ఆశ్చర్యకర పరిణామమని బ్రెజిల్ మాజీ మంత్రి థామస్ ట్రౌమాన్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ బిలియనీర్‌లపై పన్ను వేసే అవకాశంపై సదస్సు పిలుపునిచ్చింది. దీనికి లులా మద్దతునిచ్చారు. ఈ పన్ను ప్రపంచ వ్యాప్తంగా 3వేల మంది శతకోటీశ్వరులపై ప్రభావం చూపుతుంది. ఇందులో 100 మంది లాటిన్ అమెరికాలోనే ఉంటారు. అర్జెంటీనా అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఈ అంశాన్ని డిక్లరేషన్‌లో చేర్చారు. యుద్ధాలను ఖండిస్తూ, శాంతికి పిలుపునిచ్చినప్పటికీ ఎవరినీ తప్పుబట్టలేదు. నేరుగా కాకుండా గాజాలో భారీ మానవ విపత్తు పరిస్థితి, లెబనాన్‌లో పెరుగుతున్న ఉద్రిక్తతలు అని జి–20 డిక్లరేషన్‌లో ప్రస్తావిస్తూ, మానవత్వ సహాయాన్ని విస్తరించాలని, పౌరులను రక్షించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. పాలస్తీనా స్వీయ నిర్ణయాధికారాన్ని బలపరుస్తూ, ఇజ్రాయెల్, పాలస్తీనా శాంతియుతంగా పక్కపక్కనే జీవించేలా ద్వి దేశ పరిష్కారానికి స్థిరమైన మద్దతును పునరుద్ఘాటిస్తున్నామని పేర్కొంది. డిక్లరేషన్‌లో ఇజ్రాయెల్ బాధలు లేదా హమస్ వద్ద వందకు పైగా బంధీలు ఉన్న అంశాన్ని ప్రస్తావించలేదు. జి–20లో ఇజ్రాయెల్ సభ్యురాలు కాదు. సదస్సు హాజరైన అమెరికా అధ్యక్షుడు బైడెన్ బహిరంగంగానే హమాస్‌కు వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేస్తూ, కాల్పుల విరమణకు దానిపై ఒత్తిడి పెంచాలని ఇతర దేశాధినేతలకు పిలుపునిచ్చారు. అయినప్పటికీ ఆ అంశం జి–20 డిక్లరేషన్‌లో పేర్కొనలేదు. సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ హాజరుకాలేదు. ఆయనకు బదులుగా ఆ దేశ విదేశాంగ మంత్రి సెరీ లావ్రొవ్‌ను పంపారు. జి–20 డిక్లరేషన్‌లో రష్యా పేరు ప్రస్తావన లేకుండానే ఉక్రేన్‌లో శాంతికి పిలుపునిచ్చింది.

# రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులంతా పాల్గొని రాష్ట్రంలో తాజా పరిస్థితులపై చర్చించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర సమితి నిర్ణయాలను పల్లభ్‌సేన్‌గుప్తా వెల్లడించారు. మణిపూర్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు బహుముఖ విధానం అవసరమని, అందులో భాగంగా చర్చలు, న్యాయం, దీర్ఘకాలిక శాంతి నిర్మాణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, జాతుల నాయకులు, పౌర సమాజ సంస్థలను భాగస్వాములు చేస్తూ ప్రభుత్వం సమ్మిళిత చర్చలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఘర్షణ మూల కారణాలను పరిష్కరించాలని, అన్ని జాతుల హక్కులు, ఆకాంక్షలను గౌరవించే విధంగా అందుకు సుస్థిర పరిష్కారాలను కనుగొనాలని ఆయన సూచించారు. మణిపూర్‌లో ఆఫ్స్పా ఉపసంహరించడం ద్వారా మరింత మానవత్వం, ప్రజాస్వామ్యంతో కూడిన పాలనకు కట్టుబడి ఉన్నట్లు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. తద్వారా రాష్ట్రం, పౌరుల మధ్య విశ్వాసాన్ని పునర్నిర్మించేందుకు ఉపకరిస్తుందని, సంధికి సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమైన మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చర్చలను నిర్వహించడంలో, భద్రత కల్పిండచంలో, జాతుల మధ్య విశ్వాసాన్ని పునర్నిర్మించటంలో ఆయన అసమర్థత రాష్ట్రాన్ని అనిశ్చితిలోకి నెట్టివేసిందన్నారు. ముఖ్యమంత్రి రాజీనామా ద్వారా మరింత సమ్మిళిత , సమర్థ నాయకత్వం సంక్షోభాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రధానమంత్రి మౌనం వీడాలని, సంక్షోభ పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అందులో భాగంగా మణిపూర్‌లో ప్రధాని పర్యటించాలని, ప్రభావిత జాతులతో సమావేశమయ్యాలని, శాంతి చర్యల అమలును పరిశీలించాలన్నారు. తక్షణమే మున్సిపాలిటీలు, పంచాయతీల వంటి స్థానిక సంస్థలను బలోపేతం చేసి,వాటికి వనరులను సమకూర్చి, ఆర్థిక , సామాజిక అంతరాలను అధిగమనించేలా చర్యలు తీసుకుంటే సమ్మిళిత అభివృద్ధికి ఉపకరిస్తుందన్నారు. సరిహద్దు సమగ్రతను సవాలు చేస్తూ క్రిస్టియన్ రాజ్యం కోసం కలలు గంటున్న సంస్థలకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని పల్లభ్ సేన్ గుప్తా డిమాండ్ చేశారు. మణిపూర్ పరిస్థితి తీవ్ర నిర్లక్ష్యం, పరిపాలన లోపానికి సంకేతమని అన్నారు.

# మాల్యా, నీరవ్‌లను అప్పగించండి (మొదటి పేజీ తరువాయి)

మేరకు బ్యాంకు రుణం ఎగవేశాడు. ఈ కేసులో సిబిఐ ముంబయి లోని కోర్టులో దాఖలు చేసిన ఛార్జిషీట్ ప్రకారం లిక్కర్ కింగ్ విదేశాల్లో భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. ఆ తర్వాత భారత్‌ను వీడి అతడు పారిపోయినట్లు తెలిపింది. ఈ ఆర్థిక నేరగాళ్ల అప్పగింత విషయంలో బ్రిటన్ ప్రభుత్వం తొలినుంచి సానుకూల వ్యాఖ్యలే చేస్తోంది. వారిని అప్పగించేందుకు అక్కడి ప్రభుత్వం ఆదేశించినప్పటికీ.. కొన్ని న్యాయపరమైన అంశాల వల్ల ఈ ప్రక్రియ 'క్లిష్టతరం'గా మారుతోంది. నేరారోపణలు ఎదుర్కొంటున్నవారు భారత్‌లో విచారణ ఎదుర్కోవాలని తామూ కోరుకుంటున్నామని బ్రిటన్ మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ గతంలోనే స్పష్టం చేశారు. భారత్ నుంచి ప్రతిభ గల వ్యక్తులు రావడానికి తామెప్పుడూ ఆహ్వానం పలుకుతామని, అదే సమయంలో తమ న్యాయ వ్యవస్థను ఉపయోగించుకొని భారతీయ చట్టాల నుంచి తప్పించుకోవాలనుకునే వారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ స్వాగతించబోమని వ్యాఖ్యానించారు.

**రియోలో దేశాధినేతలతో మోదీ భేటీ**

**రియో డి జెనిరో :** బ్రెజిల్ దేశంలోని రియో డి జెనిరోలో జరుగుతున్న జి–20 సదస్సు సందర్భంగా అనేకే దేశాల అధినేతలో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఆయన కలిసిన వారిలో ఇటలీ, ఇండోనేషియా, నార్వే, పోర్చుగల్, ఈజిప్ట్, దక్షిణ కొరియా నేతలు ఉన్నారు. వారితో చర్చల సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం,మెరుగదల గురించి మోదీ మాటాల్డారు. అలాగే ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్, యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడు ఉర్సులా ఒన్ డెర్ లెయెన్‌తో కూడా ఆయన భేటీ అయ్యారు. నైజీరియా దేశంలో తన రెండు రోజుల పర్యటన ముగించుకొని ఆదివారం నాడు మోదీ బ్రెజిల్‌కు చేరుకున్నారు. సోమవారం నాడు ఇటలీ ప్రధాన మంత్రి జియార్జియా మెలోనీతో సమావేశమై ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాలలో సంబంధాల బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు.

# నేడు మహారాష్ట్రలో అసెంబ్లీ దంగల్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రాత్రి 7 గంటల వరకు కొనసాగనుంది. జార్ఖండ్‌లో 14,218 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయం త్రం 5 గంటల వరకు కొనసాగనుండగా, మరో 31 బూత్‌లలో సాయంత్రం 4 గంటలకే ముగియనుంది. మహారాష్ట్రలో 288 స్థానాలకుగాను మొత్తం 4,136 మంది అదృష్టం పోటీ చేస్తున్నారు. వీరిలో 2,086 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. రాష్ట్రంలో 9,70,25,119 మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. అందుకే 1,00,186 పోలింగ్ బూత్‌లను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. దాదాపు 6 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్లు ఇసి తెలిపింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు నిర్వహించి తనిఖీల్లో రూ. 252.42 కోట్ల విలువగల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికార, విపక్ష కూటములు ఈసారి హోరాహోరీగా తలపడుతున్నాయి. అధికార కూటమి మహాయుతిలో భాగమైన బిజెపి 149 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 81 మందిని బరిలోకి దింపింది. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆధ్వర్యంలోని ఎన్‌సిపి 59 మంది అభ్యర్థులను పోటీకి నెలబెట్టింది. విపక్ష కూటమి మహావికాస్ అఘాడీ (ఎంవిఎ)లో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే శివసేన, శరద్ పవార్‌కు చెందిన ఎన్‌సిపి ఉన్నాయి. కాంగ్రెస్ 101 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. శివసేన యుబిటి 95 మందిని, ఎన్‌సిపి శరద్ పవార్ పార్టీ 86 మందిని పోటీకి దించింది. సీట్ల సర్దుబాటులో ఏకాభిప్రాయం కుదరని కొన్ని స్థానాల్లో కూటమి పక్షాలు స్నేహపూర్వక పోటీ చేస్తున్నాయి. బిఎస్‌పి 237 మంది అభ్యర్థులను నిలపగా, ఎంఐఎం కూడా తమకు పట్టుందని భావిస్తున్న 17 చోట్ల అభ్యర్థులను పోటీకి దింపింది. ఇదిలా ఉండగా, జార్ఖండ్‌లో 38 నియోజకవర్గాల్లో 522 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం చురుగ్గా ఏర్పాట్లు చేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా భారీగా బలగాలను మోహరిస్తోంది. జార్ఖండ్‌లో మొత్తం 81 శాసనసభ స్థానాలు ఉన్నాయి. వాటిలో తొలి విడతలో ఈనెల 13న 43 స్థానాలకు పోలింగ్ జరిగింది. 43 స్థానాలకు 683 మంది అభ్యర్థులు పోటీపడగా 66.18 శాతం పోలింగ్ నమోదైంది. జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడి, సిపిఐ కలిసి మహాఘట్‌బంధన్‌గా పోటీ చేస్తుండగా, బిజెపి, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్, జెడియు, లోక్‌జన్ శక్తి రామ్ విలాస్ పార్టీ కలిసి ఎన్‌డిఎ కూటమిగా పోటీ చేస్తున్నాయి.

**15 అసెంబ్లీ సీట్లలో ఉప ఎన్నికలు**

మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉత్తరప్రదేశ్, పంజాబ్, కేరళ, ఉత్తరాఖండ్‌లోని 15 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికల పోలింగ్ జరగనుంది.

# కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జిఓ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని పిటీషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు సైతం ఇదే విషయాలను వెల్లడిస్తున్నాయని వాదించారు. ఎంతో మంది విద్యార్థులు పిహెచ్‌డిలు చేసి నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారని.. కానీ గత 20ఏళ్లుగా లెక్చరర్ల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడలేదని తెలిపారు. కానీ ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 26న జిఓ16 ద్వారా తీసుకొచ్చిన సెక్షన్ 10ఎ ద్వారా పలు విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిందని వాదించారు. కాంట్రాక్టు ఉద్యోగులను సైతం నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారని.. ప్రతిభ ఉన్న వాళ్లకు కాకుండా పైరవీల ద్వారా వచ్చిన వాళ్లు కాంట్రాక్టు ఉద్యోగులుగా చేరారన్నారు. అలాంటి వారిని ఇప్పుడు జిఓల ద్వారా క్రమబద్ధీకరించడం వల్ల ప్రతిభ ఉన్న వాళ్లకు అవకాశం దక్కడం లేదన్నారు. క్రమబద్ధీకరణను కొట్టివేసి.. నోటిఫికేషన్ల ద్వారా నియామకాలు చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోర్టును కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయొద్దని సుప్రీంకోర్టు 2006లోనే తీర్పు వెలువరించిందని.. అయినా ప్రభుత్వం సెక్షన్ 10ఎను తీసుకురావడం ఆర్టికల్ 14,16, 21 ప్రకారం విరుద్ధమని పిటీషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 101 ప్రకారం పాలనలో సౌలభ్యాల కోసం సవరణ తీసుకొచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందని అడ్వకేట్ జనరల్ వాదించారు. గతేడాది ఏప్రిల్ 30న 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను వయసు, తదితర నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించినట్లు కోర్టుకు తెలిపారు. 2009 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వాళ్ల పనితీరు, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని క్రమబద్ధీకరించారని తెలిపారు. ఈ దశలో వాళ్లను ఉద్యోగం నుంచి తొలగిస్తే ఎన్నో ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని క్రమబద్ధీకరణ అయిన ఉద్యోగుల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు క్రమబద్ధీకరణ అయిన ఉద్యోగులు 2009 నుంచి విధులు నిర్వహిస్తున్నారంది. దాదాపు 15ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాళ్లను ఇప్పుడు విధుల నుంచి తొలగించడం సరికాదంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ తీర్పును ఇస్తున్నట్లు పేర్కొంది.

# తక్షణం జోక్యం చేసుకోండి (మొదటి పేజీ తరువాయి)

మణిపూర్ వాసుల జీవితాలను రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా పరిరక్షించాల్సిన రాజ్యాంగ విధి మీపై ఉన్నదని రాష్ట్రపతికి సూచించారు. రాష్ట్రపతి జోక్యం ద్వారా మణిపూర్ ప్రజలు తిరిగి తమ ఇళ్ళలో శాంతియుత జీవితాన్ని, గౌరవప్రదంగా కొనసాగిస్తారనే విశ్వాసం తనకు ఉన్నదన్నారు. అంతకుముందు మంగళవారం ఉదయం మల్లిఖార్జున ఖర్గేను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ , మణిపూర్ పిసిసి అధ్యక్షులు కె.మేఘచంద్ర సింగ్, రాష్ట్ర ఎఐసిసి ఇన్‌ఛార్జ్ గిరీశ్ చదోంకర్, ఇన్నర్ మణిపూర్ ఎంపి ఎ.బిమల్ అకోజామ్, అరుణాచల్ ప్రదేశ్ మాజీముఖ్యమంత్రి నబం టూకి కలిసారు. హింసాయుత పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర పరిస్థితులను ఆయనకు వివరించారు. శాంతిని పునరుద్ధరించే చర్యల గురించి కాంగ్రెస్ అధ్యక్షుడితో వారు చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశ్యపూర్వకంగా 'పని చేయడం, చేయకపోవడం', 'జాడ్యంతో కూడిన నిష్క్రియాపర్వం' కొనసాగించే విధానాన్ని అవలంభించడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని ఖర్గే విమర్శించారు. రోజులు గడుస్తున్న కొద్ది మణిపూర్ ప్రజలు తమ స్వంత భూమిలోనే అభద్రతకు గురవుతున్నారని, తమ స్వంత నేలపైనే చిన్నారులు, చిన్న పిల్లలు, మహిళలు నిర్దాక్షిణ్యంగా హత్యలకు గురవడాన్ని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్వాంతన కలగకపోవడంతో 540 రోజులుగా మణిపురిలు ఒంటరి, నిస్సహాయులుగా మారిపోతున్నారని తెలిపారు. వాస్తవానికి వారు భారత ప్రధానమంత్రి, మణిపూర్ ముఖ్యమంత్రిపై విశ్వాసం కోల్పోయారని రాష్ట్రపతికి రాసిన లేఖలో ఖర్గే పేర్కొన్నారు. 2023 మే మాసం నుంచి మణిపూర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రధాన మంత్రి ఆ రాష్ట్రంలో పర్యటించడం లేదని, అదే సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత మణిపూర్‌లో గడచిన 18నెలల్లో మూడు సార్లు పర్యటించారని, తాను కూడా పర్యటించినట్లు తెలిపారు. మణిపూర్‌లో పర్యటించేందుకు ప్రధాని ఎందుకు తిరస్కరిస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరిస్తున్న తీరుతో పూర్తిగా చట్ట రహిత పరిస్థితి నెలకొందని, అక్కడ చట్టాలు పని చేయడం లేదని, మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని, జాతీయ భద్రత విషయంలో రాజీ పడుతున్నారని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులు అణిచివేతకు గురవుతున్నాయని వివరించారు. ఇదంతా రాజ్యాంగంలోని 19వ అధికరణలో పేర్కొన్న గౌరవంతో కూడిన జీవించే హక్కును ధ్వంసానికి దారి తీస్తోందని రాష్ట్రపతి ముర్ముకు రాసిన లేఖలో మల్లిఖార్జున ఖర్గే తెలిపారు.



## అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి

### నిధుల విషయంలో ప్రభుత్వంతో రాజీలేదు : ఎంఎల్ఎ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించేందుకు పెద్దఎత్తున కృషి చేస్తామని, ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని, ఇందుకు కావాల్సిన నిధులను రాబడుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని డిఎంఎఫ్ నిధులతో 2వ వార్డులో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎన్‌పవర్మెంట్ కేంద్రాన్ని, 24వ వార్డులో రూ.50 లక్షలతో నిర్మించనున్న సిసి, డ్రైన్ నిర్మాణానికి. 25వ వార్డులో రూ.30 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడేదిలేదని, అందుకు కావాల్సిన నిధుల విషయంలో ప్రభుత్వాన్ని మెప్పించి ఒప్పించి రాబడతామని అన్నారు. ఏ నియోజకవర్గంలోని లేనివిధంగా కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, కొత్తగూడెం జిల్లా కేంద్రానికి విమానాశ్రయం సాధించాలనే ఎన్నో ఏళ్ల కల త్వరలో సాకారం కాబోతోందని, కొత్తగూడెం అభివృద్ధితో పాటు నియోజకవర్గంలోని ప్రతి మారుమూల ప్రాంతం సైతం అభివృద్ధి ఫలాలకు నోటుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల బలోపేతం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, కనీస మౌళిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో త్వరగా పూర్తయ్యేలా చూడాలని, ఇందుకోసం అధికారులు, ప్రజలు పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, కమీషనర్ శేషాంజన స్వామి, ఇంచార్జ్ తహశీల్దార్, డిఇ, కౌన్సిలర్లు వేల్పుల దామోదర్, సత్యభామ, సహీరభేగం, బోయిన విజయ్ కుమార్, పి.సత్యనారాయణచారి, నాయకులు మూసుఫ్, మాచర్ల శ్రీనివాస్, అజీజ్, అబ్దుల్ రెహమాన్, రోహిణినాథ్, తదితరులు పాల్గొన్నారు.



# ఓరుగల్లులో అద్భుతం ఆవిష్కృతం

సిఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

ప్రజాకవి నిలువెత్తు కాంస్య విగ్రహం ఆవిష్కరణ

4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** కాకతీయుల చారిత్రక నగరం ఓరుగల్లులో అద్భుతం ఆవిష్కృతమైంది. కళలు కళాకారులకు పుట్టినిల్లుగా పేరుగాంచిన ఓరుగల్లు కళామతల్లి శిఖలో మరో మణిహారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా రాష్ట్ర మంత్రులతో కలిసి ప్రారంభించారు. జిల్లా ప్రజలు కళాకారులు కళాభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాళోజి కళాక్షేత్రంను సిఎం ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అంతకుముందు సిఎం పోలీసు గౌరవ వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు. ముఖ్యమంత్రి హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుండి హనుమకొండ కూడా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 2.30 కి చేరుకున్నారు. అక్కడ నుండి నేరుగా కాళోజీ కళాక్షేత్రానికి చేరుకొని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కతో కలిసి ముందుగా ప్రముఖ కవి కాళోజి నారాయణరావు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం హనుమకొండ వరంగల్ జిల్లాలకు సంబంధించిన 4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపలు, ప్రారంభోత్సవాలు ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా చేశారు. అనంతరం కలాక్షేత్ర భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అక్కడ నుండి నేరుగా కాళోజీ కళాక్షేత్ర భవన క్రింది అంతస్తులో కాళోజి నారాయణరావు వ్యక్తిగత జీవితంలోని ప్రత్యేక క్షణాలను ప్రతిబింబించే ఫోటోలు, పురస్కారాలు, వ్యక్తిగత వస్తువులు ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా కాళోజి ఫౌండేషన్ ప్రతినిధులు విఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్ రావులు ముఖ్యమంత్రికి కాళోజి జీవితం అక్కడి వస్తువుల గురించి వివరించగా ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆడిటోరియంలో కాళోజి జీవిత విశేషాలతో నిర్మించిన లఘు చిత్రాన్ని కాళోజి ట్రస్ట్ ఫౌండేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి వీక్షించారు.

ఈ సందర్భంగా ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ ట్రస్ట్ సభ్యులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆడిటోరియం బయట ఇందిరా ఫెలోషిప్ సభ్యులు, స్థానిక పార్టీ ప్రజా ప్రతినిధులను ముఖ్యమంత్రి కలిశారు. అక్కడ నుండి నేరుగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మధ్యాహ్నం 3.35కి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ రాజకీయ సలహాదారు కె. కేశవరావు, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, మధుసూధనాచారి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎంఏ యుడి ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానా కిషోర్, రోడ్ల భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సమాచార శాఖ కమిషనర్ డాక్టర్ హరీష్, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, వరంగల్, హన్మకొండ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ప్రావీణ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జిడబ్ల్యూ ఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడేలు, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు:**

సిఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా రూ. 4700 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వాటిలో కాళోజి కళాక్షేత్రం ప్రారంభం 90కోట్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ శంఖుస్థాపన 4170కోట్లు, నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ప్రారంభం 12 లక్షలు, నయీమ్ నగర్ బ్రిడ్జి ప్రారంభం 8.30 కోట్లు వరంగల్ తూర్పు అభివృద్ధి పనుల శంకుస్థాపన 3 కోట్లు, పాలిటెక్నిక్ కళాశాల శంఖుస్థాపన 28 కోట్లు, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ఆర్, ఆర్ లేఔట్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు శంఖుస్థాపన863 ప్లాట్లు, 5లక్షల @ 43.15కోట్లు, ఫ్లడ్ డ్రైనేజీ సిస్టం శంఖుస్థాపన160.3 కోట్లు, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ టౌన్షిప్ ఆవరణలో పిహెచ్‌సి, ప్రైమరీ స్కూల్, పశు వైద్యశాల శంకుస్థాపన 13కోటు,వరంగల్ పట్టణం రహదారుల అభివృద్ధి శంకుస్థాపన 49.50 కోట్లు, పరకాల నుండి ఎర్రగట్టు గుట్ట రోడ్డు 4 లైన్ల విస్తరణ 65.0 కోట్లు, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ లో మౌలిక సాధుపాయల కల్పనకు శంకుస్థాపన– 11.6కోట్లు, వరంగల్ ఎల్‌బినగర్‌లో ఉర్దు భవనంశంకుస్థాపన–1.50కోట్లుతదితరపనులు ఉన్నా యి.

# కుల గణనపై కేంద్రం ద్వంద్వ వైఖరి

### మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** బిసి కులగణనతో వెనుకబడిన వర్గాల్లో సామాజిక మార్పు రానున్నద ని, అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం హన్మకొండ కాకతీయ విశ్వవిద్యాలయంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, జర్నలిజం విభాగ అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ ఆధ్వర్యంలో కుల గణనసామాజి క న్యాయం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బ్రిటిష్ పరిపాలన కాలంలోనే దేశంలో కులగణన జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. రాజకీయం లేకుండా ప్రజాస్వామ్యం లేదని మంచి చెడు ఆలోచించి ప్రజల మనోభావాలు కనుగుణంగా ప్రభుత్వాలు పని చేయాలన్నారు. మత, కులరహిత సమాజాన్ని ఆశించేవాన్ని నేనని, కానీ నేడు వాటి ఆధిపత్యమే కొనసాగుతున్నదన్నారు. సమాజ మార్పు కోసం రాజ్యాంగంలో ఇంకా మార్పులు రావాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోరారని గుర్తు చేశారు. ఉన్న రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాలనే ధోరణి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజల్లో వచ్చిన మార్పు కనుగుణంగా సర్వే చేస్తున్నదన్నారు. కులగణన సమాచారం అనేది ఒక టార్చ్ లైట్‌గా పనిచేస్తుందని, ఏ వర్గం జనాభా ఎంతో చెప్పటానికి శాస్త్రీయంగా ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కుల గణన పై కేంద్ర ప్రభుత్వం ద్వంద వైఖరి అవలంబిస్తున్నదని, కొన్ని రాష్ట్రాల్లో ఒప్పుకొని ఇతర రాష్ట్రా ల్లో వద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు స్వాగతించాలన్నారు. కేంద్రం ఏం చేస్తుందో..రాష్ట్ర పరిధి ఏంటి అనే విషయాలను తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కుల గణన అమలు చేయడం కోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. సర్వే అనంతరం దానిని ఆచరణలో పెట్టి అమలు చేస్తే ఫలితాలు వస్తాయన్నారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కులగణన మూలంగా రాష్ట్రం లో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఒసి వర్గాల జనాభా, వారి ఆర్థిక పరిస్థితి, ఆదాయ వనరులు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు బహిర్గతం అవుతాయని అన్నారు. రాష్ట్రంలో ఉన్న జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ,ఆర్థిక రంగాల్లో అత్యధిక జనాభా ఉన్న తమ హక్కులను పొందాలనే ఉద్దేశంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ సమగ్ర కులగణన నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంకా రాజకీయ ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాలు ఉన్నత వర్గాల చెప్పు చేతుల్లోనే ఉందని వెల్లడించారని ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు గుర్తు చేశారు.దేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలైనా ఒక్క దళిత ఎడిటర్ కూడా లేరని సిద్ధార్థ వరదరాజన్ వెల్లడించారని ఆయన చెప్పారు.ఇటీవల ఎస్‌సి వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు మాదిగ, మాలల జనాభా వివరాలు అడిగిందన్నారు. ఈ దేశం ప్రజాస్వామిక దేశం అయిన ఇంకా వ్యాపార వర్గాల చెప్పు చేతల్లోనే పాలకులు కీలుబొమ్మలుగా ఉన్నారని అన్నారు.మీడియా రాజకీయ, వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య రంగాల్లో ఇంకా ఉన్నత కులాల ఆధిపత్యం కొనసాగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కోతులు, పులులు, ఏనుగుల గణన చేపడుతున్నప్పుడు సిఎం రేవంత్ రెడ్డి సమగ్ర కులగణన చేపట్టడంతో తప్పేమీఉందని, రాద్ధాంతం చేస్తున్న విపక్షాల విమర్శలను ఆయన తోసిపుచ్చారు.సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర కులగణనను స్వాగతిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ దేశంలో 20 ఆధిపత్య ఉన్నత కులాలు,136 బిసి కులాలు, 34 ఎస్‌సి కులాలు, 26 ఎస్‌టి కులాలు ఉన్నాయని, మొత్తం దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంటే, రెండు వేల రాజకీయ పార్టీలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక ఉద్యమకారులు డాక్టర్ కంకటి రాజా రామ్ మాట్లాడుతూ సమగ్ర కులగణన సర్వే పూర్తయితే బిసిలకు నిజమైన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 50శాతం ఉన్న బిసిలలో ఒక్కరికి ఉపముఖ్యమంత్రి పదవి దక్కలేదని రాజారాం ఆవేదన వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో పాస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ నాయకులు డాక్టర్ డి శ్రీకాంత్ యాద వ్, డాక్టర్ వంగాల సుధాకర్, కంజర్ల నరసింహా రాములు, పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి, ఈర్ల సురేందర్, పాస్, వివిధ బిసి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిసి వర్గీకరణ సాధ్యం కాదు

### బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వెనకబడిన తరగతులకు సంబంధించి ఎ,బి,సి,డి,ఈ వర్గీకరణ తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న కొన్ని కులాల కోరిక ఈ దఫాకు సాధ్యం కాదని తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. ఇప్పటికే స్థానిక ఎన్నికలు వాయిదా పడడం వల్ల రావాల్సిన నిధులు రావడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక ఎన్నికల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆయన తెలిపారు. మంగళవారం తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో వెనకబడిన తరగతుల జీవన స్థితిగతులకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మంజిల్లా బహిరంగ విచారణ చేపట్టారు. అనంతరం నిరంజన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిసి కమిషన్‌కు అనేక దరఖాస్తులు వచ్చాయని వాటన్నింటిలో ప్రధానంగా బిసిలలో కూడా కొన్ని ఆధిపత్య కులాలకే పెత్తనం లభిస్తుందని కొన్ని కులాలు ఇంత వరకు చట్టసభలలో కాని, మరె ఇతర పదవులకు సంబంధించి కానీ ప్రాతినిత్యం పొందలేదని వినతులు సమర్పించారని ఆయన తెలిపారు. సర్వే అనేది ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి అధికార యంత్రాంగానికి సహకరించాలని డిసెంబర్ తొమ్మిదిన సర్వే నివేదికను గౌరవ హైకోర్టుకు సమర్పిస్తామని నిరంజన్ తెలిపారు. సర్వే అనేది ఒక యజ్ఞమని ఆ యజ్ఞానికి విఘ్నం కలిగించవద్దని ఆయన తెలిపారు. సంచార జాతులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని బిసి కమిషన్‌ను కోరారని అలాగే చాకలి కులస్తులను ఎస్సిలో చేర్చడంతో పాటు దోబీఘాట్ నిర్వహణ ఆ కులస్తులకే అప్పగించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారన్నారు. దూదేకుల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ఆ కులం ప్రతినిధులు కోరగా మేదరకులాన్ని ఎస్టిలో చేర్చి ప్రభుత్వమే ముడి సరుకు అందించాలని వినతి సమర్పించారని నిరంజన్ తెలిపారు. ఏజెన్సీలోని గౌడ కులస్తులను ఎస్టిలో చేర్చాలని గంగపుత్రులకు సంబంధించి తప్పుడు ధృవీకరణ పత్రా లు ఇస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారని ఆయన సమావేశంలో వెల్లడించారు. బిసిలలో పలుకుబడి కలిగిన వారే ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందుతున్నారని కురమలకు కుల ధృవీకరణ ఇవ్వడం లేదన్న విష యం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఖమ్మంలో సమీకృత మాంస మార్కెట్ గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తామని నిరంజన్ తెలిపారు. ఎక్కువ మంది బిసి అట్రాసిటీ చట్టాన్ని తయారు చేయాలని సూచించారని ఖమ్మం జిల్లాలో అత్యధిక బిసిలు ఉన్నప్పటికీ చట్టసభలలో అందుకు తగిన రీతిలో ప్రాతినిథ్యం లభించడం లేదని తెలిపారు. మైనార్టీలకు సంబంధించి ఉర్దూ బోధనలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, మైనార్టీ కార్పోరేషన్ కంపెనీ యాక్ట్ క్రింద ఏర్పాటు చేశారని మిగిలిన కార్పోరేషన్లను సొసైటీ యాక్ట్ క్రింద అమలు చేయడం వల్ల మైనార్టీలకు నష్టం జరుగుతుందని మైనార్టీ సోదరులు తెలిపారని నిరంజన్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, జిల్లా బిసి సంక్షేమ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.




## సచివాలయ ఉద్యోగులకు ‘ఫేషియల్ రికగ్నైజేషన్’ అటెండెన్స్

### 22 నుంచి రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగులకు ‘ఫేషియల్ రికగ్నైజేషన్’ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయంలో పనిచేసే ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్, గౌరవ వేతనాన్ని పొందుతున్న వారందరూ కూడా ‘ఫేషియల్ రికగ్నైజేషన్’ అటెండెన్స్‌ను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి మంగళవారం సర్క్యులర్‌ను జారీ చేశారు.

ఈ నెల 22 నుంచి ఉద్యోగులు ‘ఫేషియల్ రికగ్నైజేషన్’లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకోసం స్లాట్‌ను బుక్ చేసుకోవాలని సాధారణ పరిపాలన శాఖ ఆదేశించింది. రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో రెగ్యూలర్ ఉద్యోగులు తమ వెంట గుర్తింపు కార్డుతో పాటు గత నెల పే స్లిప్ ను తీసుకుని రావాలని, అలాగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ వెంట గుర్తింపు కార్డుతో పాటు సంబంధిత అధికారి ధృవీకరణ పత్రాన్ని తీసుకురావాలని సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వుల్లో సూచించింది.

‘ఫేషియల్ రికగ్నైజేషన్’ అటెండెన్స్‌ను పరికరాన్ని ప్రవేశ, బయటికి వెళ్లే పాయింట్స్ వద్ద ఏర్పాటు చేస్తారు. అలాగే సచివాలయ భవనంలోని ప్రతి అంతస్తులోని లిఫ్ట్ సమీపంలో ఏర్పాటు చేయనున్నారు.

కాగా దీనికి సంబంధించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌ను (ఎస్ఒపి) ఐటిఇ,సి డిపార్ట్‌మెంట్ అందించనుంది.

# రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

* ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72 వేల కోట్లు
* ఇందిరాగాంధీ వ్యవసాయ ప్రతిభా పురస్కారాల అవార్డుల ప్రదానోత్సవంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం / హైదరాబాద్:** పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలకులు రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరదల బీభత్సం వల్ల జరిగిన పంట నష్టాన్ని అధికారులతో అంచనా వేయించి పరిహారం ఇస్తున్నామని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. వ్యవసాయ రంగాన్ని అస్థిరపరిచిన ధరణిని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రక్షాళన చేపట్టిందన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా టిపిసిసి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇందిరా గాంధీ వ్యవసాయ ప్రతిభా పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఆదర్శ రైతులకు, శాస్త్రవేత్తలకు ఈ సందర్భంగా అవార్డులను ప్రధానం చేశారు. ‘ఇండియా గుండె చప్పుడు ఇందిర’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభలో రైతులను ఉద్దేశించి డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేని విధంగా బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంట బీమా పథకాన్ని అమలు చేయలేదన్నారు. ప్రజా ప్రభుత్వం రైతులు చెల్లించాల్సిన బీమా డబ్బులను ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించి పంట బీమా పథకాన్ని అమలు చేస్తున్నదని వెల్లడించారు. రైతులపై భారం మోపకుండా ప్రీమియం డబ్బులను ప్రభుత్వమే బీమా కంపెనీలకు చెల్లించి రైతు బీమాను కూడా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను రైతులకు అందించడానికి రాష్ట్రానికి సంబంధించిన వాటా డబ్బులను ప్రజా ప్రభుత్వం చెల్లిస్తూ రైతులకు అండగా ఉంటుందన్నారు. గత బిఆర్ఎస్ పాలకులు విస్మరించిన వ్యవసాయ యాంత్రీకర ణ, పాలీహౌస్, సబ్సిడీ విత్తనాల పంపిణీ తదితర పథకాలను పునరుద్దరణ చేసి రైతులను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని వివరించారు. రైతుల కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా కాంగ్రెస్ శ్రేణులు రైతుల వద్దకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరంతో సంబంధం లేకుండా ఈ సంవత్సరం తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి కావడానికి దూర దృష్టితో ఆనాటి కాంగ్రెస్ పాలకులు నిర్మాణం చేసిన బహుళార్థక సాధక ప్రాజెక్టుల వల్లనే సాధ్యమైందని డిప్యూటీ సిఎం అన్నారు. కాళేశ్వరం వల్లే తెలంగాణలో వరి సాగు పెరిగిందన్న బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని, ప్రతిపక్షంలో ఉన్నపుడు కాంగ్రెస్ చెప్పిన విషయం నేడు వాస్తవమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగి నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోయినా ఎన్డీఎస్ఎ సూచన మేరకు అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయకపోయినా ఈ సంవత్సరం వరి ఉత్పత్తి పెరగడానికి ఆనాటి కాంగ్రెస్ పాలకులు కృష్ణా నదిపై నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, నెట్టెంపాడు, కోయిల, కల్వకుర్తి ఎత్తిపోతల, గోదావరి నదిపై ఎస్సారెస్పీ, దేవాదుల, శ్రీపాద ఎల్లంపల్లి తదితర బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిర్మాణం చేసి రైతులకు సాగునీరు అందించిన ఫలితమే అన్నారు. ‘దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆహార ధాన్యాల ఉత్పత్తి దేశ ప్రజలకు సరిపోయేత లేవు, ఉత్పత్తి పెరగాలంటే వ్యవసాయం చేసే వాళ్ళు పెరగాలని, భూ సంస్కరణల చట్టం తీసుకొచ్చి కొద్ది మంది చేతుల్లో ఉన్న లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి లక్షల మంది రైతులను తయారు చేసిన ఘనత దివంగత ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు.

ప్రపంచంలోని అనేక దేశాలకు ఆహార ఉత్పత్తుల ఎగుమతి చేసే విధంగా పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగాన్ని చేర్చిన ముందు చూపు ఉన్న దార్శనీకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఈ సంవత్సరం వ్యవసాయ రంగానికి బడ్జెట్లో 72 వేల కోట్ల రూపాయలు కేటాయించి రైతులను ప్రోత్సహిస్తున్నదన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంఅమలు చేయని విధంగా కేవలం 15 రోజుల్లో రెండు లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు ఒకే సారి 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేసిన ప్రజా ప్రభుత్వం దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేసిన గొప్ప చారిత్రాత్మకమైన రుణమాఫీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు ప్రతి రైతు దృష్టికి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

## మహిళా సంఘాలకు క్షమాపణ చెప్పండి

### లగచర్లలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించండి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లగచర్లలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లిన మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు వారికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తివేసి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలన్నారు. నిజనిర్ధారణ కమిటీని అడ్డుకోవడ మంటేనే, తప్పు చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టేనని అన్నారు. ఈ మేరకు కెటిఆర్ తన ‘ఎక్స్’(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. లగచర్లలో అర్థ రాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే కాదని, పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నాయకులపైనా దౌర్జన్యమా అని అన్నారు. నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుందని, వాస్తవాలను ఎందుకు తొక్కిపెట్టాలని ప్రయత్నిస్తోందని ప్రశ్నించారు. సిఎం సొంత ఇలాకాలో ఇంతటి నిర్బంధం ఏమిటని, కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందాఅని ఎద్దేవా చేశారు.

## కాంగ్రెస్ మూసీలో మునగడం ఖాయం

### మాజీ ఎంఎల్ఎ గొంగిడి సునీత

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కాంగ్రెస్ పార్టీ మూసీ లో మునిగిపోవడం ఖాయమని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ గొంగిడి సునీత అన్నారు. ఆ పార్టీని ముంచడానికి సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఇద్దరూ చాలని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో ఎవరిని కదిలించినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆగ్రహ కట్టలు తెచ్చుకుంటుందన్నారు.బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేశామని, కాంగ్రెస్ పాలన నిర్లక్ష్యంతో కూడిన పాలన అని అన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముందు కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలని, బిఆర్ఎస్‌పైన మాట్లాడటం కాదని సూచించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
డివిజన్-14, జిహెచ్ఎంసి.
NIT. No. 39/E.E.14/GHMC/2024-25 తేది: 18.11.2024
**పని పేరు:** డివిజన్-14, కెజెడ్, జిహెచ్ఎంసి కింద వివిధ పనులు. **అంచనా విలువ :** రూ.52.1 లక్షలు, **బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 20.11.2024న ఉ.11.00గం.ల నుండి 27.11.2024న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ అనగా http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 6787-PP/CL/ADVT/1/2024-25, Date: 19-11-2024

ఫోకస్

# మహిళ

## మలివయసులో సమస్యలెన్నో..



వయసు పెరిగేకొద్దీ శారీరక, మానసిక సమస్యలు పెరుగుతాయేగానీ తగ్గవు. ఆర్థికంగా నిలదొక్కుకొని, అన్ని బాధ్యతలను సక్రమంగా పూర్తి చేసిన వారికి కూడా కొన్ని మానసిక సమస్యలు తప్పకపోవచ్చు. శారీరం శిథిలమవుతున్నప్పుడు వచ్చే సమస్యలకు ఆర్థిక అంతస్తులతో సంబంధం ఉండదు. ఈ సమస్యలు పురుషులకు కూడా వర్తిస్తాయి. కానీ, మహిళల్లోనే అధికం. ఆరోగ్యంపై దశాబ్దాల తరబడి కొనసాగిన నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణం. బాధ్యతల పేరుతో తమను తాము పట్టించుకోకపోవడం అత్యధిక శాతం మంది మహిళల లక్షణం. ఈ గుణం కుటుంబానికి, సమాజానికి మేలు చేసినా, వారికి మాత్రం నష్టాన్నే మిగిలిస్తున్నది. మహిళలు మలివయసులో ఎదుర్కొనే అత్యంత సాధారణ సమస్య మోకాళ్ల నొప్పులు. ఇది ఎంతోమందికి ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నది. మోకాలిలోని కీలు, ఎముకలు, వాటి మధ్య కదలికలు మృదువుగా ఉండేలా చూసే సున్నితమైన మృదులాస్థి పొరలు అరిగిపోవటం మోకాళ్ల నొప్పికి ముఖ్యకారణం. 55,60 ఏళ్ల వయసు తర్వాత దాదాపుగా సగానికి సగం మంది ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య ఇది. తీవ్రమైన మోకాళ్ల నొప్పి వల్ల నడక నరకంగా తయారై కదల్లేకపోతారు. దీని వల్ల శారీరక శ్రమ తగ్గి మరింత బరువు పెరగుతారు. బరువు పెరిగినకొద్దీ మోకాళ్ల నొప్పులు మరింత సతాయిస్తాయి. ఇదో విషవలయంగా తయారవుతుంది. అందుకని పెద్దవయసులో సాధ్యమైనంత వరకూ బరువు పెరగకుండా చూసుకోవటం మంచిది. బరువు అధికంగా ఉంటే, తగ్గేందుకు ప్రయత్నించాలి. బరువు తగ్గితే మోకాళ్లు అరిగిపోయే ముప్పు కూడా తగ్గుతోందని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కొద్దిగా మోకాళ్ల నొప్పులున్నా కదలికలు మానెయ్యకూడదు, రోజువారీ ఓ మోస్తరు నడక, వ్యాయామాలు కొనసాగించాలి. ఇప్పుడు మోకాళ్ల నొప్పులకు మంచి చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. వైద్యులను సంప్రదిస్తే పరీక్షలు చేసి, సమస్య ఏ స్థాయిలో ఉంది, దీనికి ఏం చెయ్యొచ్చన్నది వివరిస్తారు. యుక్తవయసు నుంచీ చక్కటి వ్యాయామాలు చేస్తుండటం వల్ల చాలా వరకూ ఈ సమస్య దరిజేరకుండా చూసుకోవచ్చు. ఎప్పుడో వారాంతాల్లో ఒక్కసారిగా, విపరీతంగా వ్యాయామం చెయ్యటం కాకుండా.. రోజూ విడవకుండా, నిలకడగా నడక వంటి వ్యాయామాలు చెయ్యటం వల్ల మోకీలు చుట్టూ ఉండే కండరాలు బాగా బలపడతాయి. దానివల్ల భారం మొత్తం కీలే మొయ్యాల్సిన పరిస్థితి ఉండదు. ఫలితంగా కీలు అరుగుదలా తగ్గుతుంది. ఎక్కువగా గొంతికూర్చోకుండా ఉండటం, ఎత్తు మడమ చెప్పులు (హైహీల్స్) వాడకుండా ఉండటం కూడా మోకీళ్లకు మంచిది. మోకాలి గుజ్జు తగ్గిపోతే, ఇంజక్షన్లతో నయం చేయవచ్చని కొంత మంది అంటారని, కానీ, ఇది ఒక రకం గా బాధితులను మోసం చేయడమేనని ప్రముఖ ఆర్థోసర్జన్ డాక్టర్ గురువారెడ్డి పలు ఇంటర్వ్యూల్లో తెలిపారు. మోకాలిలో మృధులాస్థిని కృత్రిమంగా పెంచడం అసాధ్యమని, ఈ సమస్యకు శస్త్రచికిత్స ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఏదిఏమైనా సమస్య ఎదురైనప్పుడు వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది. ఆర్థో స్పెషలిస్టులను సంప్రదించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, బరువు తగ్గడం అత్యవసరం.

## 'బ్యాడ్ టచ్'పై మహిళా కమిషన్ సీరియస్



దుస్తులు కుట్టడానికి, హెయిర్ డ్రెస్సింగ్ చేయడానికి మహిళలను పురుషులు ఉద్దేశపూర్వకంగా చేయివేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఉత్తర ప్రదేశ్ మహిళా కమిషన్ ఇటీవల పేర్కొంది. అంతేగాక, ఈ విధానం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'బ్యాట్ టచ్'ని ఖండించింది. ఇకపై మహిళల దుస్తుల కోసం పురుషులు కొలతను తీసుకోవడం గానీ, కుట్టడంగానీ చేయకూడ దని ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక, టైలింగ్ షాపుల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని కూడా స్పష్టం చేసింది. మహిళల శిరోజనాలను పురుషులు కత్తిరించకుండా, హెయిర్‌డ్రెస్సింగ్ పార్లర్లలో మహిళలే ఉండాలని ప్రతిపాదించింది. బ్యాడ్ టచ్ నుంచి మహిళలను రక్షించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొంది. ఈ తరహా వృత్తిలో ఉన్న పురుషుల వల్ల మహిళలు వేధింపులకు గురవుతున్నారని యుపి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బబితా చౌహాన్ చేసిన వ్యాఖ్యలు సమర్థనీయం. మహిళలు వెళ్లే జిమ్‌లలో కూడా మహిళా శిక్షకులు ఉండితీరాలన్న ఆమె సూచన హర్షణీయం. జిమ్ ట్రైనర్లందరికీ పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరి చేయడం కూడా ఆహ్వానించతగ్గ పరిణామం. యుపి మహిళా కమిషన్ చేసిన సూచనల్లో ముఖ్యమైనవి..

- అమ్మాయిల దుస్తుల కొలతలు మహిళలు మాత్రమే తీసుకోవాలి. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- ఇక సెలూన్లలో మహిళా కస్టమర్లకు అమ్మాయిలే సేవలందించాలి.
- జిమ్, యోగా సెంటర్లలో అమ్మాయిలకు మహిళా ట్రైనర్లే ఉండాలి. అలాంటి జిమ్లను తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయాలి.
- స్కూల్ బస్సుల్లో తప్పనిసరిగా మహిళా ఆయా లేదా ఉపాధ్యాయిని ఉండాలి. డ్రామా ఆర్ట్ సెంటర్లలో అమ్మాయిలకు మహిళా డ్యాన్స్ టీచర్లను ఏర్పాటు చేయాలి.
- మహిళల వస్తువులను విక్రయించే దుకాణాల్లో తప్పనిసరిగా మహిళా సిబ్బందే ఉండాలి. కోచింగ్ సెంటర్లలో సిసి టివిలు ఏర్పాటు చేయాలి.
- దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులను నిరోధించడానికి ఇలాంటి నిర్ణయాలు కొంతవరకైనా తోడ్పడతాయి. మిగతా రష్టాలు కూడా ఇలాంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## మహిళా తొలి స్టాంపు..




భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత తొలి మహిళా స్టాంపు 1952 అక్టోబర్ ఒకటో తేదీన విడుదలైంది. మీరా బాయి పేరుమీద రెండు అణాల తపాలా బిళ్లను విడుదల చేశారు. అయితే, మన దేశానికి బ్రిటిషర్లు 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తే, అదే ఏడాది నవంబర్ 21న 'జైహింద్' నినాదంతో మూడు స్టాంప్స్‌ను విడుదల చేశారు. స్వతంత్ర్య భారతంలో ఇవే మొదటి స్టాంపులు. ఒకటిన్నర అణాలు విలువతో అశోక స్థూపంలోని మూడు సింహాలతో ఒకటి, మూడున్నర అణాల విలువతో భారత త్రివర్ణ పతాకంతో ఒకటి, 12 అణాల విలువతో విమానం బొమ్మతో ఒకటి చొప్పున ఈ స్టాంపులను విడుదల చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ పోస్టల్ స్టాంప్ మొదటిసారి, మనకు స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత, 1948 ఆగస్టు 15న విడుదలైంది.

## ఆరోగ్యం

## రక్తంలో ఆక్సీజన్ తక్కువైతే..



పసిపిల్లలకు వచ్చే కొన్ని రకాల రుగ్మతలపై తల్లులకు కనీస అవగాహన ఉండాలి. చాలా మంది శిశువుల్లో ఆక్సీజన్ శాతం తగ్గడం అదేది సాధారణం. దీని వ్ల్ల శిశువులు నీలంగా ఉంటారు. అందుకే బ్లూబేబి లేక సయనోటిక్ బేబి అంటారు. ట్రంకస్ ఆర్టిరియోసిస్, టోటల్ అనోమలస్ పల్మోనరి వీనస్ కనెక్షన్, టెట్రాలజీ అఫ్ ఫాలట్, గ్రేట్ వెజల్ ట్రాన్స్పొజిషన్, ట్రైకల్పిడ్ ఎట్రిషియాల వల్ల శిశువులు ఇలా కనిపించవచ్చు. లక్షణాలు గుండెజబ్బు తీవ్రతను బట్టి ఉంటాయి. కొంతమంది పిల్లల్లో లక్షణాలుండవు. కొంతమంది పిల్లలు శ్వాశించడానికి ఇబ్బంది పడుతుంటారు. నీలంగా కనిపిస్తుంటారు. బాగా చెమట పడుతుంది. ఛాతినొప్పితో బాధపడుతుంటారు. గుండెలో గురగుర, శ్వాసకోసలో ఇన్ఫెక్షన్స్ లాంటి వాటితో బాధపడుతుంటారు.సి.హెచ్.డి. చాలా వాటికి సరిదిద్దడానికి శస్త్ర చికిత్స అవసరమవుతుంది. మందుల్ని వాడాల్సి వస్తుంది. డయూరిటిక్స్ డిజాక్సన్ వాడడం వల్ల గుండెలోని నీరు, సాల్ట్స తొలగించబడతాయి. గుండె చిన్నదై బలంగా తయారవుతుంది. గుండె కొట్టుకోవడం తగ్గి కణాలలోంచి కొన్ని ద్రావకాలు వేగంగా బయటకు వస్తాయి. కొన్ని లోపాల్ని సరిదిద్దడానికి శస్త్రచికిత్స తప్పనిసరి, తల్లి కడుపులో శిశువు రూపొందుతుండంలో దోషాల వల్ల, గుండెకు రక్తం సరఫరా చేసే కరొనరి ఆర్టెరీలో ఆటంకాలు కలిగినా వచ్చే గుండెజబ్బులకు శస్త్రచికిత్సలతో చాలా వరకు నయం చేయవచ్చు. సరైన వయసులో చేయకపోతే జీవితం పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే ఒకసారి అనుమానం వచ్చినప్పుడు స్పెషలిస్టును సంప్రదించాలి.

# పేదల గుండెల్లో హరికిషన్ చెరగని ముద్ర

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/మునగాల :** అమరజీవి చిల్లంచర్ల హరికిషన్ పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం అమరజీవి చిల్లంచర్ల హరికిషన్ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్రజెండా పట్టుకుని ఉద్యమాలు నడిపిన ఘనత చిల్లంచర్ల రఘునాధం కుటుంబం కుటుంబానికి ఉందన్నారు. రఘునాధం చిన్న కుమారుడు హరికిషన్ సిపిఐలో అనేక ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. జర్నలిస్టుగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో సేవలందించారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ చిల్లంచర్ల హరికిషన్ అందరితో అప్యాయంగా పలకరించేవాడని గుర్తు చేశా రు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ హరికిషన్ చిన్నతనం నుండే తండ్రి బాటలోనే నడిచి సిపిఐ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేశారన్నారు. అంతకు ముందు హరికిషన్ కుటుంబసభ్యులను సిపిఐ రాష్ట్ర నాయకులు పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, టియుడబ్ల్యూజె 143 ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జులూరి గౌరిశంకర్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, సాగర్ ఎడమకాలువ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి, మేకల శ్రీనివాసరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మాజీ జడ్పిటిసి సుంకర అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసిన హరికిషన్

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా

సిపిఐ మండల కార్యదర్శివర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు చిల్లంచర్ల హరికిషన్ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన సిపిఐ మండల కార్యదర్శివర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు చిల్లంచర్ల హరికిషన్‌కు పార్టీ జిల్లా కార్యవర్గం సోమవారం నివాళులర్పించింది. హరికిషన్ చిత్రపటానికి పూలమాలవేసి పల్లా వెంకటరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ చిల్లంచర్ల హరికిషన్ తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, పుట్టుక నుండి మరణం వరకు పనిచేశాడన్నారు. హరికిషన్ తండ్రి చిల్లంచర్ల రఘునాధం తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక ఉద్యమాలు నడిపారని గుర్తు చేశారు. తన తండ్రి బాటలోనే హరికిషన్ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి అనునిత్యం ఎర్రజెండా అండతో పోరాడారని గుర్తు చేశారు. జర్నలిస్టుగా నిరంతరం పేదల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి హరికిషన్ అని కొనియాడారు. హరికిషన్ చిన్నతనంలోనే అనారోగ్యంతో మృతిచెందడం బాధకరమని, వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. అనంతరం హరికిషన్ కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు దూళిపాళ ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కరీంనగర్‌లో ఏఐఎస్‌ఎఫ్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ ఫీజు బకాయిలు విడుదల లేకపోవడం మూలంగా విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఏ విధంగా ఇబ్బంది పడుతున్నారో, అదే విధంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సిబ్బందికి జీతం ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలను నిర్వహణ చేయలేమని డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ చేస్తే వారంలో విడుదల చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడంలో న్రిర్లక్ష్యం కనబడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులు చదువులను, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు రవి, రమేష్, రాజు క్రాంతి, సురేష్ పాల్గొన్నారు.



# రైతులు, పేదలకు కస్టోడియన్ భూములు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటి నరసింహ్మా డిమాండ్



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** కస్టోడియన్ భూములను రైతులకు పేదలకు పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటి నరసింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సర్వేనంబర్ 1 నుంచి 59సర్వే నంబర్లు వెయ్యి ఎకరాలు వరకు ఉన్న కస్టోడియన్ భూములను పేదలకు పెంచాలన్నారు. మంగళవారం లక్ష్మాపూర్ గ్రామంలో కస్టోడియన్ భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ 50సంవత్సరాలుగా ప్రభుత్వ కస్టోడియంగా ఉన్న భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవన ఉపాధి పొందుతున్నారన్నారు. తమకు భూములపై హక్కు పత్రాలను పాసు బుక్కులను ఇవ్వాలని పలు సందర్భాల్లో రైతులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా వారికి ఎలాంటి పాసుపుస్తకాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి పట్టా పాస్‌పుస్తకాలు అందే విధంగా చూడాలన్నారు. కస్టోడియన్ భూములను ప్రజలకు పంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని, తక్షణమే అధికారులు గ్రామాన్ని సందర్శించి సాగులో ఉన్న రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వడంతో పాటు మిగిలి ఉన్న భూములను పేదల ప్రజలకు చెందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక గ్రామాలలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను, భూస్వాముల భూములను పేద ప్రజలు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములను కలెక్టర్ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతోని కుమ్మక్కు అయ్యి బినామీలను సృష్టించుకుని అక్రమంగా వారికి పట్టాలివ్వడం జరిగిందన్నారు. ఇటీవల భూ కుంభకోణంపై జిల్లా స్థాయి కలెక్టర్‌గా పనిచేసిన అధికారులను ఇడి విచారించి వారిపై చర్యలకు సిద్ధమవుతున్నదన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడైతే ప్రభుత్వ భూములు కబ్జాకు గురై అయినవో వాటిపైన సమగ్రమైన విచారణ జరపాలని, రిటైర్డ్ జడ్జితో కమిటీ వేసి భూకబ్జాదారుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాల కోసం ఉపయోగించాలని, భూమి లేని పేద ప్రజలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభు త్వంలో ధరణి పేరుతో పలు ప్రభుత్వ భూములను అక్రమంగా అధికార పార్టీ నాయకులు, వారి అనుచరుల పేరుపై పట్టాలు చేయించుకున్నారని, అటువంటి భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని ఈటి నరసింహ్మా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మహబూబ్ ఖాన్, మోహన్‌రెడ్డి, దేవేందర్, పలువురు రైతులు, పేద ప్రజలు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఉంటేనే గుర్తింపు

### ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతుల్లో వక్తలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** కార్మికులు అనునిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తే గుర్తింపు లభిస్తుందని, ఆ బాధ్యత ఎఐటియుసి నాయకత్వంపై ఉందని, కార్మికుల పక్షం వహించి వారిని ఉద్యమాల వైపు నడిపిస్తేనే కార్మిక సంఘానికి గుర్తింపు లభిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు పానుగంటి పర్వతాలు, ఉమామహేష్‌లు అన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఎఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు చుంచుపల్లి మండల పరిధిలోని గౌతంపూర్ సింగరేణి కమ్యూనిటీ హాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎఐటియుసి జెండాను ఎగురవేసిన అనంతరం శిక్షణా తరగతుల్లో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు తక్షణమే స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలని, వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలని, తద్వారా సంఘం బలోపేతం అవుతుందన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను తాకట్టుపెడుతోందని, కేంద్ర విధానాలపై ఎఐటియుసి శ్రేణులు కార్మికులను అప్రమత్తం చేస్తూ ఉద్యమాలవైపు నడిపించే బాధ్యతను స్వీకరించాలన్నారు. కార్మిక వర్గ సమస్యలపై పోరాటాలతో కార్మిక సంఘం బలోపేతం అవుతుందన్నారు. రెండు రో పాటు జరుగుతున్న ఈ శిక్షణా తరగతులను ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు సారయ్య, కార్మికసంఘం జిల్లా నాయకులు వట్టికొండ మల్లిఖార్జున్‌రావు, ఎస్‌డి సలీం, దేవరకొండ శంకర్, వేల్పుల మల్లిఖార్జున రావు, భాస్కర్, ఎస్.విజయలక్ష్మి, భాస్కర్, వీరస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.







## వచ్చే ఏడాది పుతిన్ భారత్ పర్యటన

**న్యూఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చు ఏడాది భారతదేశంలో పర్యటించనున్నారు. ఇరు దేశాల నేతల పరస్పర వార్షిక పర్యటనలో భాగంగా ఆయన ఈ పర్యటన చేపట్టనున్నట్లు మంగళవారం నాడు రాయబార వర్గాలు తెలియజేశాయి. పర్యటనకు సంబంధించిన అవకాశాలను ఇరు వైపులు పరిశీలిస్తున్నాయని, అయితే ఇంకా తేదీలు ఖారురు కాలేదని తెలిపాయి. ఈ ఏడాది జూలై మాసంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాస్కో పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడిని భారత్‌లో పర్యటించాలని ఆహ్వానించారు. భారతదేశ సీనియర్ సంపాదకులతో మంగళవారం నాడు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ విడియో కాన్ఫరెన్స్ సందర్భంగా భారత, రష్యా ద్వైపాక్షిక సంబంధాలు బలంగా ఉన్నాయని, పుతిన్ భారత పర్యటన పరిశీలనలో ఉన్నదని వెల్లడించారు. అయితే, పర్యటనకు సంబంధించిన తేదీలను, పర్యటన పూర్తిస్థాయి వివరాలను ఆయన తెలియజేయలేదు. తేదీలకు సంబంధించి ఇరు పక్షాలు చర్చిస్తాయన్నారు. ఈ సమావేశాన్ని రష్యా అధికార వార్తా సంస్థ 'స్పుత్నిక్' వార్తా సంస్థ ఏర్పాటు చేసిది. గత నెలలో బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యేందుకు రష్యాలోని కజాన్‌కు ప్రధాని మోదీ వెళ్ళారు.

# నయా ఉదారవాద ప్రపంచీకరణ విఫలం

### జి–20 సదస్సులో బ్రెజిల్ ప్రధాని లూలా ద సిల్వా



**రియో డి జెనిరో :** నయా ఉదారవాద ప్రపంచీకరణ విఫలమైంది. భద్రతా మండలి నిష్క్రియాప్రియత్వం అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పు గా మారింద'ని బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా విమర్శించారు. ఐక్యరాజ్య సమితి శాశ్వత సభ్యు ల వీటో అధికారాన్ని ఉపయోగించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రెట్టన్ ఉడ్స్ సంస్థలు సుస్థిరాభివృద్ధి సాధనలో ఆటంకాలుగా మారాయ ని అన్నారు. ఏకపక్ష ఆంక్షలు అత్యంత బలహీన దేశాలను మరింత ఇబ్బందుల్లోకి నెడుతోందన్నారు. బ్రెజిల్ దేశం రియో డిజెనిరో నగరంలో సోమ,మంగళవారాలలో జి–20 సదస్సు 'లీడర్స్ సమ్మిట్' లో డిసిల్వా ప్రారంభోపన్యాసం చేశారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర అగ్ర దేశాల అధిపతుల సమక్షంలో ఆయన ప్రసంగిస్తూ చిన్న, మధ్యతరహా దేశాల పాలిట అభివృద్ధిపై విదేశీ రు ణాలు ప్రభావం చూపిస్తున్నాయన్నారు. ఆఫ్రికన్ దేశాలలో మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య లో పెట్టుబడి కోసం వనరులు తీసుకుందామంటే విదేశీ రుణాలు మించిపోయాయన్నారు. అసమానతలను తగ్గించేందుకు అంతర్జాతీయ పన్ను సహకారం అవసరమని నొక్కి చెప్పారు. పురోగామిని పన్నుల వనరులను వాతావరణ సంక్షోభంపై పోరుకు వినియోగించాలన్నారు. శాంతి మార్గం కోసం బహుళ పక్ష వ్యవస్థలు అవసరమని చెప్పారు. ప్రపంచ సుస్థిరత మరింత ప్రాతినిధ్యం కలిగిన సంస్థలపై ఆధారపడి ఉంటుందన్నారు. భవిష్యత్తు బహుళధృవాలదేనన్నారు.

#### ఆకలి ఆమోదయోగ్యం కాదు

ప్రపంచవ్యాప్తంగా 2024లో 73.3 కోట్ల మంది పౌష్టికాహారలోపంతో ఉన్నారని లులా ద సిల్లా తెలిపారు. ఏటా 40 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయని, మరో వైపు మిలిటరీ కోసం 2.4 ట్రిలియన్ డాలర్‌లు ఖర్చు పెడుతున్నారని విమర్శించారు. ఆకలి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. కరువు లేదా ప్రకృతి వైపరీత్యాలో ఆకలి, పేదరికాలకు కారణం కాదని, గణనీయమైన మానవత్వ భాగాన్ని వేరుచేసే రాజకీయ నిర్ణయాలే కారణమని అన్నారు. సంపద్వంతమైన సమాజాలు, శాంతియుత ప్రపంచ నిర్మాణం కోసం ఆకలి, పేదరికాన్ని నిర్మూలించాలన్నారు.

## శీతాకాల సమావేశాలకు ముందు..
# 24న అఖిలపక్ష భేటీ

### 25వ తేదీ నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు : రిజిజు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుం చి డిసెంబర్ 20 వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం ఈనెల 24న కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో ఉదయం 11 గం టలకు ఈ సమావేశం జరగనుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు మంగళవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. పార్లమెంట్ ఉభయసభల్లోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లను సభా వ్యవహారాలపై చర్చించేందుకు కేంద్రం సమావేశానికి ఆహ్వానించింది. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించే అవకాశం ఉన్నది.నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్రం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఈ నెల 26న ప్రత్యేక వేడుకలు జరగనున్నాయి. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ మన రాజ్యాంగాన్ని ఆమోదించిన న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సభ్యులు సమావేశం కానున్నారు. కాగా ఇదివరకూ నవంబర్ 26ను జాతీయ న్యాయ దినోత్సవంగా నిర్వహించేవారు. కానీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని 2015 నుంచి నవంబర్ 26ను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లు మొదలైనవి సభ ముందుకు రాబోతున్నట్టు తెలిసింది. ఈ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదింపజేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. గురుగావ్ ఎన్నికల ప్రచారంలోనూ ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. మరోవైపు విపక్షాలు జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లు2024ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో విపక్షాలు, అధికార ఎన్డీయే కూటమి సభ్యుల మధ్య పార్లమెంట్‌లో వాడి వేడి చర్చ సాగే అవకాశం ఉంది.

# దేశంలో తీవ్రంగా ఎరువుల సంక్షోభం

### పదేళ్లలో ఎరువుల అవసరాన్ని అంచనా వేయకపోవడమేంటి? : ప్రియాంకాగాంధీ



**న్యూఢిల్లీ :** దేశంలోని ఎరువుల సంక్షోభం తీవ్రంగా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ విమర్శించారు. పదేళ్లలో దేశానికి ఏ మేరకు ఎరువులు అవసరమో బిజెపి ప్రభుత్వం అంచనా వేయలేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించామని, ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని, పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్న బిజెపి... రైతుల పాలిట సంక్షోభంగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండిపడ్డారు. 'ఇది రబీ పంటలు విత్తడానికి పీక్ సీజన్ అని, అయనా ఎప్పటిలాగే దేశవ్యాప్తంగా ఎరువుల సంక్షోభం తీవ్రం ఉంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో ఎరువుల కోసం పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి' అని ప్రియాంక గాంధీ ఒక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రైతులు పొలాల్లో పనులు వదిలి ఎరువుల కోసం అన్ని ప్రాంతాలూ తిరుగుతున్నారని, పలుచోట్ల నిరసనలు తెలుపుతున్నారని ధ్వజమెత్తారు. బిజెపి హయాంలో ప్రతి సీజన్‌లోనూ ఎరువుల సంక్షోభం నెలకొనడంతో రైతులకు ఈ సమస్య సర్వసాధారణమైపోయిందని, దేశంలో ఎంత ఎరువులు అవసరమో పదేళ్లలో బిజెపి ప్రభుత్వం అంచనా వేయలేకపోయిందా అని ఆమె ప్రశ్నించారు. హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతులు ఎరువుల కోసం తెల్లవారుజామున, రాత్రి క్యూలో నిలబడాల్సి వస్తోందని కాంగ్రెస్ నేతలు ఇంతకుముందు కూడా 'ఎరువుల కొరత'పై ధ్వజమెత్తారు. హర్యానాలో డిఎపి ఎరువుల కొరత లేదని, రైతులు భయాందోళనలకు గురికావద్దని హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ అన్నారు.

# సంబంధాల స్థిరీకరణపై భారత్–చైనా దృష్టి



**న్యూఢిల్లీ/రియోడీ జనైరో :** భారత్–చైనా రెండు దేశాలూ పరస్పర సంబంధాల స్థిరీకరణ, వైరుధ్యాలను శాంతియుత పద్ధతులలో పరిష్కరించుకోవడం, తదుపరి చర్యలపైనే దృష్టి పెట్టడం వంటి విషయాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తాయి. ఈ మేరకు రెండు దేశాలు నిర్ణయించారు. త్వరలోనే సరిహద్దు సమస్యపై రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులమధ్య ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. సుమారు ఐదు సంవత్సరాల విరామం తర్వాత మళ్ళీ రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులమధ్యా ఈ సమావేశానికి తెరలేవనున్నది. దీనినిబట్టిచూస్తే రెండు దేశాలమధ్యా ప్రత్యక్షంగా విమానాల రాకపోకలు, కైలాస్ మానస సరోవర్ యాత్రలు పునఃప్రారంభం కావడానికి పరిస్థితులు చాలా దగ్గరలోనే ఉన్నట్లు కనిపిస్తున్నది. తూర్పు లఢఖ్‌లోని రెండు వివాదాస్పద ప్రాంతాల నుండీ చైనా–భారత్ సైన్యాలు వెనక్కు వెళ్ళి పూర్వప్రదేశాలకు చేరుకున్న కొన్ని వారాల తర్వాత రెండు దేశాలమధ్య పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. రెండు దేశాల సంబంధాల మెరుగుదలకు విస్తారమైన అంశాలపై తదుపరి చర్యలపైనే ఉన్నతస్థాయీ వర్గాలు దృష్టి పెట్టాయి. ప్రధానంగా సంబంధాలను స్థిరీకరించుకునే దిశగా అడుగులు వేయాలని ఉన్నతస్థాయీ వర్గాలు భావిస్తున్నాయి. రెండు దేశాల విదేశీ వ్యవహారాల మంత్రులు ఎస్.జైశంకర్, వాంగ్ యీలు రియోడీ జనైరోలో జి–20 సదస్సు సందర్భంగా కలుసుకున్నారు. వారు ప్రధానంగా ఈ విషయాల గురించే మాట్లాడుకున్నారు. రెండు దేశాల సంబంధాలను స్థిరీకరించుకోవడంపైనే దృష్టిపెట్టాల్సిన అనివార్యమైన ఆవశ్యకత ఉందని విదేశాంగమంత్రులు ఇద్దరూ అభిప్రాయపడ్డారు. తూర్పు లఢఖ్ నుండి రెండు దేశాల సైన్యాలు వెనక్కు వెళ్ళిపోయిన తర్వాత ఉన్నతస్థాయిలో విదేశాంగమంత్రులు ఇద్దరూ కలుసుకుని మాట్లాడుకోవడం ఇదేమొదటిసారి. సైన్యాలు తమ తమ పూర్వస్థానాలకు వెళ్ళిపోవడం రెండు దేవబూలమధ్య శాంతి, స్థిరత్వ సాధనకు దోహదం చేస్తాయని జైశంకర్, వాంగ్ యీ అభిప్రాయపడ్డారు. ప్రత్యేక ప్రతినిధులు, విదేశాంగకార్యదర్శి, ఉప మంత్రుల సమావేశాలు త్వరలో ఏర్పాటు చేయాలని కూడా వారు నిర్ణయించారు. కైలాస్ మానస సరోవర్ యాత్ర పునరుద్ధరణ, సరిహద్దుల్లో ఉన్న నదులకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, భారత్–చైనా మధ్య జిల్లాలకు విమానాల రాకపోకలు పునరుద్ధరించడం, మీడియా రాకపోకలు వంటి వాటిని చేపట్టాలనే విషయాలపై వారు చర్చించారు. కరోనా మహమ్మారి కారణంగా 2019లో చైనా నుండి భారత్‌కు విమానాలు ప్రత్యక్షంగా రాకుండా నిషేధం విధించారు. 2019 డిసెంబరు 21వ తేదీన న్యూఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధులమధ్య 22వ విడత సమావేశాలు జరిగాయి. ఈ చర్చల్లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ కుమార్ దోవల్, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీలు పాల్గొన్నారు. ఏకపక్ష వైఖరులకు, ఆధిక్యతా భావాలకు భారత్ తీవ్ర వ్యతిరేకమని చర్చల సందర్భంగా చైనా మంత్రి వాంగ్ యీ కి అజిత్ దోవల్ స్పష్టం చేశారు.

## క్రోనీ క్యాపిటలిస్టులను రక్షించేందుకు
# ఫిక్స్‌డ్ మ్యాచ్:రాహుల్ గాంధి

**న్యూఢిల్లీ :** అశ్రిత పెట్టుబడిదారుల (క్రోనీ క్యాపిటలిస్ట్‌ల)ను రక్షించేందుకు ఇప్పటికే 'ఫిక్స్‌డ్ మ్యా చ్'(ముందు నిర్ణయించిన మ్యాచ్) జరుగుతోందని, ఇందులో సాధారణ పెట్టుబడిదారులు భారీ గా నష్టపోతారని కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ ఆ రోపించారు. 'బచ్ స్టాప్స్ హియర్' పేరుతో 8 నిమిషాల నిడివి కలిగిన విడియోను ఎఐసిసి 'ఎక్స్'లో మంగళవారం విడుదల చేసింది. ఇందులో సెబీ ఛీ ఫ్ మాధబి పురి బచ్, వ్యాపారి గౌతమ్ అ దానీల కు సంబంధించిన అంశాలను ఎఐసిసి అధికార ప్రతినిధి పవన్ ఖేడా, జర్నలిస్టు సుచేతా ద లాల్‌లతో రాహుల్‌గాంధీ సంభాషించారు. ఈ సం దర్భంగా పెట్టుబడిదారుల సంపదను పరిరక్షించడంలో సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్ విఫలమయ్యారని, అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలను పరిరక్షించేందుకే కృషి చేస్తున్నారని ఆరోపించారు.

# వర్చువల్‌గా జడ్జీల వాదనలు : సిజెఐ



**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో వీలైతే జడ్జీలు వర్చువల్‌గా వాదనలు వినిపించాలని సుప్రీంకోర్టు సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక సూచనలు చేశారు. కాలుష్య అంశం చేయి దాటిపోయిందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టులో ఆందోళన వ్యక్తం చేశారు. జిఆర్‌పిఎ–4 పరిమితులను పరిగణనలోకి తీసుకొని ఢిల్లీలోని కోర్టులు పూర్తిగా వర్చువల్ విధానాన్ని అనుసరించాలని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, గోపాల్ శంకరనారాయణన్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. దీంతో ఏ కేసులైనా సరే లాయర్లు వర్చువల్ మోడ్‌లో పాల్గొని తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. ఢిల్లీలో వాయుకాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. మంగళవారం సగటు గాలి నాణ్యతా సూచీ (ఎక్యూఐ) 494కు పడిపోయింది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్క్‌ను దాటిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఇప్పటికే పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాయు కాలుష్యంపై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ఢిల్లీ ప్రభుత్వంపై మండిపడింది. రోజురోజుకు వాయు నాణ్యత క్షీణిస్తున్నా అధికారులు అలసత్వం ప్రదర్శించడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. కాగా కాలుష్యం నేపథ్యంలో ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

## కారు లోయలో పడి ముగ్గురు మృతి

**సిమ్లా :** హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో మంగళవారం కారు లోయలో పడటంతో ముగ్గ రు వ్యక్తులు మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఐదుగురు కుటుంబ సభ్యులు వివాహానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా భర్మార్–భర్మణి రహదారిపై సావన్‌పూర్ వద్ద అర్ధరాత్రి ఈ ప్రమా దం జరిగిందని వారు తెలిపారు. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్, అతని భార్య త్రిప్తా దేవి, అతని సోదరుడు కమలేష్ సింగ్ మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ సూపరింటెండెంట్ చం బా, అభిషేక్ యాదవ్ మాట్లాడుతూ, కుటుంబం సచుయిన్ గ్రామంలోని వారి ఇంటికి వెళుతుండగా, డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడం తో లోతైన లోయలోకి పడిపోయిందని చెప్పారు. వీరిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, శివకుమార్, నందిని దేవి గాయపడగా భర్మార్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు యాదవ్ తెలిపారు. తదుపరి చికిత్స కోసం శివకుమార్‌ను చం బాలోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. ప్రమాదంపై విచారణ జరుగుతోందని ఎస్పీ తెలిపారు.



# నిర్భయంగా ముందడుగు వేయడానికి బలం..నాయనమ్మే

### దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 'జయంతి'లో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ స్మరణ

**న్యూఢిల్లీ :** దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి కాంగ్రెస్ పార్టీ ఘనంగా నివాళులు అర్పించింది. మంగళవారం నాడు దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత, ఇందిరాగాంధీ మనవడు అయిన రాహుల్‌గాంధీ ఇక్కడి సఫ్దర్ జంగ్ రోడ్డు నెంబర్ 1లోని శక్తి స్థల్‌లో ఉన్నటువంటి ఇందిరాగాంధీ స్మారకనిర్మాణంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులుఅర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేతో కలిసి ఇందిరాగాంధీ స్మారకనిర్మాణం వద్దకు వచ్చిన రాహుల్ గాంధీ ఇరువురూ పుష్పగుచ్ఛాలు స్మారకనిర్మాణంపై ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడుతూ జాతి ప్రయోజనాల బాటలో తాను నిర్భయంగా ముందడుగు వేయడం వెనక అసలైన బలం తనకు తన నాయనమ్మ ఇందిరాగాంధీ నుంచి వచ్చిందన్నారు. 'ఐరన్‌లేడీ ఆఫ్ ఇండియా'గా పేరొందిన దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ నగరంలో 1917సంవత్సరం నవంబరు 19న జన్మించారు. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తన 'ఎక్స్'పోస్ట్ ద్వారా తన సందేశాన్ని ఇచ్చారు. కోట్లాది ప్రజలు ఐరన్‌లేడీ ఇందిరాగాంధీ జీవితం నుంచి స్ఫూర్తి పొందడాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆమె జీవితం అంతా సుదీర్ఘ పోరాటాలతో కొనసాగిందన్నారు. జాతి నిర్మాణం కోసం ఆమె ధైర్యసాహసాలతో అలుపెరుగని సేవలు అందించారని కీర్తించారు. భారతదేశ ఐక్యత, సమగ్రత కోసం ఆమె తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయురాలన్నారు. ఆమె జయంతి సందర్భంగా మన అందరి వినయపూర్వక నివాళి అందజేస్తున్నామని వివరించారు. రాహుల్‌గాంధీ తన 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో మాట్లాడుతూ 'ధైర్యం, ప్రేమకు నిలువెత్తు ఉదాహరణ తన నాయనమ్మ ఇందిరాగాంధీ' అని కొనియాడారు. 'జాతి ప్రయోజనాల కోసం నిర్భయంగా ముందుకు సాగే బలం నాకు ఆమె నుంచే సంక్రమించిందన్నారు. ఆమె జ్ఞాపకాలే నాకు బలం. నాకు ఎల్లప్పుడూ ఇందిరాగాంధీనే మార్గనిర్దేశకురాలు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆమెను గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ తన నాయనమ్మ ఇందిరాగాంధీజీ తన ఎన్నికల ప్రచారాన్ని ఎప్పుడూ మహారాష్ట్రలోని నందుర్బర్ నుంచే ప్రారంభించేవారన్నారు. గిరిజన సమాజ సంస్కృతి ఎంతో మహోన్నతమైనదని ఇందిరాగాంధీ విశ్వసించేవారని, ఎందుకంటే గిరిజన సమాజం ప్రకృతిని ఎంతో గౌరవిస్తూ రక్షిస్తారని ఆమె వారిపట్ల అందుకే ప్రేమాభిమానాలను కనబరుస్తారని ప్రియాంకగాంధీ వాద్రా స్మరించుకున్నారు. ఆమె తన పాలసీలతో గిరిజనులు, దళితులు, వెనకబడినతరగతులు, పేద ప్రజల సముద్ధరణ కోసం పాటుపడ్డారని కీర్తిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్ కూడా ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.

## నాపై విష ప్రచారానికి రూ.500 కోట్లు ఖర్చా? : సోరెన్



**రాంచి :** తనపై అసత్య ప్రచారం చేసేందుకు బిజెపి భారీ మొత్తంలో డబ్బులు ఖర్చు పెడుతోందంటూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజల్లో విద్వేషాన్ని రగిల్చేందుకు తీవ్రంగా యత్నిస్తోందని అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బిజెపి తనపై చేసిన ఆరోపణలపై సీఎం 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించారు. ప్రజల్లో నాపై విద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకు కాషాయ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని, అందుకు రూ.500 కోట్లు ఖర్చు చేస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య ద్వేషాన్ని రగిల్చి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడంలో ఆ పార్టీ దిట్ట అని, రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వం గురించి బూటకపు ప్రచారం చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేసి 9 వేలకు పైగా వాట్సప్ గ్రూప్‌లను సృష్టించిందనిఆరోపించారు. కానీ, తాను జార్ఖండ్‌కు చెందిన బిడ్డ అని, ఈ గడ్డపై ఇలాంటి సంస్కృతికి తావు లేదని, అటువంటి పనులు ఎప్పటికీ చేయలేను అని హేమంత్ సోరెన్ పేర్కొన్నారు. 'బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగాల్ నుంచి కొందరిని ప్రచారానికి తీసుకొచ్చింది. వారితో నాకు వ్యతిరేకంగా మాట్లాడించింది. ఓటర్లను ఆందోళనకు గురిచేసేందుకు ప్రయత్నించింది. ఇవన్నీ భాజపా జిమ్మిక్కులు. ఇందుకోసం ఒక్క నియోజకవర్గంలోనే రూ.కోటికి పైగా ఖర్చు చేసింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారు ప్రచారం చేయకుండా అసత్యాలు మాట్లాడారు. ఎన్నికల బాండ్లు, నకిలీ ఔషధాలు, నకిలీ వాక్సిన్లతో మేము ప్రజల జీవితాలతో ఆడుకోలేదు' అంటూ బిజెపిపై ఆరోపణలు చేశారు.

# మణిపూర్ ఎంఎల్‌ఏల గైర్హాజరును షా గమనించారా?



**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో ఎన్‌డిఎ సమావేశానికి కొందరు శాసనసభ్యులు వెళ్ళలేదని, వారి గైర్హాజరు గోడ మీద రాతలా స్పష్టంగా ఉన్నదని, అది కేంద్ర మంత్రి అమిత్‌షా చదివారా లేదా? అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఎంత కాలం మణిపూర్ ప్రజలు నరకయాతన కొనసాగుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ఇంఫాల్‌లో మణిపూర్ ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఎన్‌డిఎ ఎంఎల్‌ఏల సమావేశంలో ఆయన కాకుండా 26 మంది మాత్రమే హాజరయ్యారని 'ఎక్స్'లో ఆయన తెలిపారు. అందులో నలుగురు ఎన్‌పిపి కి చెందిన వారని, ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రస్తుత మణిపూర్ ముఖ్యమంత్రికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లుగా బిజెపి జాతీయ అధ్యక్షుడికి లేఖ రాసారని పేర్కొన్నారు. దీంతో గోడ మీద రాత స్పష్టంగా ఉన్నదని, కానీ, ప్రధాన మంత్రి మనిపూర్ బాధ్యతలను పూర్తిగా ఔట్‌సోర్సింగ్ చేసిన మణిపూర్ అద్భుత సూత్రధారి కేంద్ర హోం మంత్రి దానిని చదివారా? లేదా? అని ప్రశ్నించారు. హాజరైనట్లు చెప్పిన మూగ్గురు ఎంఎల్‌ఏల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు వెల్లడైందన్నారు. కాబట్టి 60 ఎంఎల్‌ఏల మణిపూర్ శాసనసభలో ఎన్‌డిఎ సమావేశానికి 24 మందే హాజరయ్యారని తెలిపారు. అనంతరం మణిపూర్ పిసిసి అధ్యక్షుడు మేఘచంద్ర సింగ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ అమిత్‌షా, బీరేన్ సింగ్‌లు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# విజయవంతంగా కక్ష్యలోకి జిశాట్–ఎన్ 2

### ఇక మరింత నాణ్యతగా బ్రాడ్ బ్యాండ్ సేవలు



**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన తాజా కమ్యూనికేషన్ల ఉపగ్రహం జి శాట్–ఎన్ 2 ను స్పేస్ ఎక్స్ సంస్థ మంగళవారం నాడు విజయవంతంగా ప్రయోగించింది. అమెరికాలోని కేప్ కెనవెరల్ నుండి ఈ వాణిజ్య ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినట్లు ఇస్రో అనుబంధ సంస్థ ఎన్ఎస్ఐఎల్ (న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్) తెలియజేసింది. 14 సంవత్సరాలపాటు ఈ ఉపగ్రహం బ్రాండ్‌బ్యాండ్ వినియోగదారులకు అత్యుత్తమస్థాయి ప్రమాణాలతో సేవలు అందిస్తుంది. ప్రధానంగా భారత భూభాగానికి సేవలు అందిస్తుంది. అమెరికాకు చెందిన ప్రపంచ సంపన్నుడు ఎలాన్ మస్క్ స్థాపించిన స్పేస్ ఎక్స్ అంతరిక్షప్రైవేటు సంస్థ ఇస్రోకు చెందిన 4,700 కేజీలు బరువుగల కమ్యూనికేషన్ల ఉపగ్రహం జిశాట్–ఎన్2ను ఫాల్కన్ 9 వాహకనౌక విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనంతరం ఇస్రోకు చెందిన మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ విభాగం ఈ ఉపగ్రహాన్ని, దాని కదలికలను తన అధీనంలోకి తీసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ కమ్యూనికేషన్ల ఉపగ్రహం ఎంతో బాగా పనిచేస్తోందని ఎన్ఎస్ఐఎల్ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టింది. ఎన్ఎస్ఐఎల్ పంపిన రెండో కమ్యూనికేషన్ల ఉపగ్రహం జిశాట్–ఎన్ 2 అనేది కా–బ్యాండ్‌కు చెందిన అత్యున్నతస్థాయి ప్రమాణాలుగలది. బ్రాడ్ బ్యాండ్ సర్వీసులను మరింత అత్యుత్తమస్థాయి నాణ్యతా ప్రమాణాలతో శరవేగంగా అందింగల సామర్థ్యం ఈ కమ్యూనికేషన్ల ఉపగ్రహానికి ఉంది. భారత్ ఉపఖండంలో ఈ బ్రాండ్‌బ్యాండ్ సేవలను మరింత అత్యుత్తమంగా విస్తరించగల సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. ఇదే తరహాలో మొదటితరం కమ్యూనికేషన్ల ఉపగ్రహం జిశాట్–24ను 2022లో జూన్ 23వ తేదీన ఫ్రెంచ్ గుయానాలోని కౌరౌ నుండి విజయవంతంగా ప్రయోగించి ఎన్ఎస్ఐఎల్ కక్ష్యలోకి పంపింది. కా వెర్సస్ కా ట్రాన్స్‌పాండర్స్‌తో కూడిన ప్రస్తుత జిశాట్–2 ఉపగ్రహం గతంకంటే విస్తారమైనసంఖ్యలో వినియోగదారులకు సేవలు అందించగలదు. ఇందులో వ్యవస్థలు కూడా సంక్షిప్తంగానే ఉంటాయి. యూజర్ టర్మినల్స్ చిన్నవిగా, బహుముఖంగా భారత్ ఉపఖండం అంతటా కేంద్రీకరించి హై ఫ్రీక్వెన్సీతో వినియోగదారులకు ఈ కమ్యూనికేషన్ల ఉపగ్రహం ఉత్తమ సేవలు అందిస్తుంది.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, నవంబరు 20

# అంతుచిక్కని ఓటరు నాడి

మహారాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం 288 సీట్లకు, ఝార్ఖండ్ అసెంబ్లీకి మలిదశలో 38సీట్లకు బుధవారం పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉంది. అయితే ఓటరు నాడి అంతుచిక్కక రెండు రాష్ట్రాల్లోని పాలక, ప్రతిపక్ష కూటములేకాదు, ఎన్నికల పండితులు, జోశ్యులు సైతం తికమకలో ఉన్నారు. హర్యానా ఎన్నికల్లో అంచనాలకు భిన్నంగా బిజెపి అధికారం నిలుపుకున్నవైనం ఈ గందరగోళాన్ని మరింత పెంచింది. హర్యానా ఫలితాలను బిజెపికి సానుకూలం చేసిన అంశాలేమిటి? ఒక విశ్లేషణ ప్రకారం బిజెపి వ్యూహం, ఎత్తుగడలు. ప్రతిపక్షం ఓట్లు చీల్చటానికి అది చిన్నచిన్న పార్టీలను, స్వతంత్రులను పోటీకి ప్రోత్సహించింది. కాంగ్రెస్‌కు మూలస్తంభంగా ఉన్న జాట్ కులం ఆధిపత్యాన్ని వ్యతిరేకించే ఇతర వెనుకబడిన తరగతులపై కేంద్రీకరించి పనిచేయటం, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి పోలింగ్ కేంద్రానికి వెళ్లటానికి సుముఖంగా లేని ఓటర్లకు నచ్చజెప్పి వారిచేత ఓటు వేయించటం. ఆ విధంగా ఓ 5శాతం ఓట్లు బిజెపికి అదనంగా రాబట్టారట. ఈ పోల్ మేనేజిమెంట్ ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేసిందట! అగ్రనాయకుల సభలు, రోడ్ షోలు సంబంధిత పార్టీకి ప్రచారం కల్పిస్తాయి తప్ప అదనపు ఓట్లు రాల్చవు. ఏ పార్టీ కమిటెడ్ ఓటర్లు ఆ పార్టీకి ఎలాగూ ఉంటారు.

బిజెపి ఇదే ఎత్తుగడలను తాజాగా ఎన్నికలు జరుగుతున్న రెండు రాష్ట్రాల్లోనూ అనుసరిస్తున్నది. ఆర్థిక రాజధాని ముంబైతో కూడిన మహారాష్ట్రను దక్కించుకోవటం కమలం పార్టీకి, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టకు ఎంతో అవసరం. బిజెపి, శివసేన(షిండె), ఎన్‌సిపి(అజిత్ పవార్)లతో కూడిన పాలక మహాయుతి కూటమి మొత్తం 288 సీట్లకు పోటీ చేస్తున్నాయి. బిజెపి రెండు సీట్లను నవనిర్మాణ సమితికి కేటాయించింది. కాగా ఇతర భాగస్వాములు అక్కడ పోటీలో ఉన్నారు. ఈసారి ముఖ్యమంత్రి పదవిని బిజెపి ఆశిస్తోంది. ఉద్ధవ్‌థాక్రే శివసేన కన్నా ఎక్కువ సీట్లు గెలిచి తమదే అసలు సిసలు సేనగా నిరూపించుకునే పనిలో ఉంది ముఖ్యమంత్రి షిండె నాయకత్వంలోని శివసేన. అజిత్ పవార్‌దీ అదే ఎత్తుగడ. శరద్ పవార్ ఎన్‌సిపి కన్నా తమదే పెద్దపార్టీగా రుజువు చేసుకోటానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఈ పరస్పర వైరుధ్యాలతో ప్రచారంలో పొరపొచ్చాలు తలెత్తుతున్నాయి. పైగా 21సీట్లలో ఈ పార్టీలు మైత్రీపూర్వక పోటీలో ఉన్నాయి. మరికొన్ని చోట్ల తిరుగుబాటుదార్ల బెడద ఉండనేఉంది. ఎక్కడ ఎవరికి ఎసరు తగులుతుందోనని భయపడుతున్నారు.

ప్రతిపక్ష మహా వికాస్ అగాఢి పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. కాంగ్రెస్, శివసేన(ఉద్ధావ్ థాక్రే), ఎన్‌సిపి(శరచ్చంద్ర పవార్) భాగస్వాములు. ఈ పార్టీలు 15చోట్ల మైత్రీపూర్వక పోటీలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాకపోవచ్చు. చిన్నపార్టీలు, స్వతంత్రులు ప్రభుత్వ ఏర్పాటుకు కీలకం కావచ్చు. రెండు కూటములూ ముఖ్యమంత్రి ముఖం నిర్ణయం చేయలేదు.

ఝార్ఖండ్ రాష్ట్రంలోని 81అసెంబ్లీ సీట్లకుగాను 38సీట్లకు బుధవారం రెండవ, తుది దశ పోలింగ్ విజేతలను నిర్ణయించనుంది. జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, ఆర్‌జెడి, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్‌లతో కూడిన ఇండియా కూటమి అధికారాన్ని, బిజెపి తదితరులతో కూడిన ఎన్‌డిఎ కూటమి సవాలు చేస్తున్నది. ఇండియా కూటమి సిపిఐ, సిపిఐ(ఎం)లను దూరంగా పెట్టింది. ఎన్‌డిఎ ప్రచార సారథులు మోదీ, షాలు జెఎంఎం అవినీతి, బంగ్లాదేశ్ ముస్లింల చొరబాటుపై దాడిని కేంద్రీకరించారు. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు – లోక్ జాగరణ్ మంచ్, వనవాసీ కళ్యాణ్ కార్యకర్తలు బిజెపి అభ్యర్థులకు ప్రచారం చేశాయి. సంఘ్‌పరివార్ సంస్థలు పనిచేసే ప్రాంతాల్లో ప్రభుత్వరంగ సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు వినియోగిస్తూ, బిజెపికి ఆదరణ పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ క్యాడర్లు హర్యానా ప్రచార మోడల్‌ను అనుసరిస్తున్నారు.

రెండవ దశ పోలింగ్ జరిగే 38సీట్లలో 25 ఛోటా నాగపూర్ రీజియన్‌లో ఉన్నాయి. బొగ్గుగనులు కేంద్రీకరించి ఉన్న ఈ ప్రాంతం ఎంతో సంపద్వంతమైంది. బొకారో ఉక్కు కర్మాగారం ఇక్కడే ఉంది. నవంబర్ 13న తొలిదశ పోలింగ్‌లో 7స్థానాలకు ఓటింగ్ ముగిసింది. ఈ ప్రాంతంలో ఎస్‌టి రిజర్వుడు సీట్లు లేవు. నాలుగు ఎస్‌సి సీట్లు. ఒబిసిల్లోని కుడ్మి మహతో విభాగానికి చెందిన 30ఏళ్ల టైగర్ జైరాం మహతో లోక్‌సభలో 3.5లక్షల ఓట్లు పొందారు. ఇప్పుడు – ఝార్ఖండ్ లోక్ తాంత్రిక్ క్రాంతికార్ పార్టీ పేరుతో ఆయన పార్టీ 71సీట్లలో పోటీ చేస్తున్నది. ఆయన 2సీట్లలో పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఇది కొత్త అంశం. ఈ పార్టీ ఎవరి ఓట్లను ఎక్కడ చీల్చుతుందనేది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుంది. కాబట్టి 23వ తేదీ ఫలితాలకోసం వేచిచూదాం!

## కాలంచెల్లిన ఐక్యరాజ్యసమితి ఛార్టర్

# ‘వీటోపవర్’ దేశాల మధ్య రాజీతోనే సంస్కరణ సాధ్యం

**శ్రేయ బన్సాల్**

దాదాపు 80 ఏళ్ళ క్రితం ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ సమయంలో ప్రకటించిన అధికారిక హక్కుల పత్రానికి ఇప్పుడు కాలం చెల్లింది. దాదాపు 80లక్షలమంది సైనికులు, ప్రజల మరణాలకు కారణమైన, సెంట్రల్ యూరప్‌ను అతలాకుతలం చేసిన యుద్ధం(1618) తర్వాత 1648లో జరిగిన వెస్ట్‌ఫాలియా (జర్మనీ వాయువ్యప్రాంతం) శాంతి ఒప్పందం దగ్గరనుండి రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక 1945లో ఐక్యరాజ్యసమితి ఆవిర్భావంనాడు ప్రకటించిన మరో శాంతి ఒప్పంద హక్కులపత్రం వరకూ ప్రపంచం (దాదాపు 300సంవత్సరాల పాటు) ఎంతో సుదీర్ఘమైన ప్రయాణం చేసింది. ఈ భూగోళంపై వివిధ ప్రాంతాలలో ఏ ఒక్కరి సార్వభౌమాధికారం అణచివేతకు గురికాకుండా, ప్రపంచంపై నియంతృత్వపాలన సాగకుండా, నిబంధనల కు లోబడి దేశాలు తమ పరస్పర గౌరవాన్ని కాపాడుకోడానికి ఐక్యరాజ్యసమితి ప్రపంచసంస్థగా ఆవిర్భవించింది.

భూప్రపంచంలో శాంతి, సహజీవనం, భద్రత, ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించే ఒక సాహసకృత్యాన్ని, లక్ష్యాన్ని ఐక్యరాజ్యసమితి తీసుకుంది.కేవలం ఐక్యరాజ్యసమితికే కాదు, ఏ అంతర్జాతీ య సంస్థకైనా ఇది పర్వతారోహణను మించిన అత్యంత సంక్లిష్టమైన లక్ష్యం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ లక్ష్యాలు నెరవేర్చే క్రమంలో ఎలాంటి సంస్థ ఐనాగానీ నిర్దేశిత సంపూర్ణప్రామాణికతలను సాధించడంలో ఎన్నో వైఫల్యాలు కూడా మూటగట్టుకుంటుంది. ఐక్యరాజ్యసమితి పరిస్థితీ అలాంటిదే. ఎందుకంటే అంత అత్యున్నతమైనస్థాయి లో సాధించాల్సిన లక్ష్యాలు ఐక్యరాజ్యసమితికి నిర్దేశిత మయ్యాయి. ఎప్పటికైనా నెరవేర్చగల ఈ ఆదర్శాలను సాధించడాని కి, ఈ ఆశయాలను సాకారం చేయడానికి ఐక్యరాజ్యసమితి ఏనాడూ కూడా చిత్తశుద్ధితో నిజమైన ప్రయత్నాలు చేయలేదు. ఎందుకంటే ఐక్యరాజ్యసమితి ఆదర్శాలు, దాని అధికార హక్కులపత్రంలో ఉన్న నిబంధనలు అన్నీ పరస్పరం ఎప్పుడూ ప్రత్యక్ష సంఘర్షణ పడుతూ ఉండటంవల్ల ఆవిర్భావం నుండీ ఇప్పటివరకూ ఈ ప్రపంచసంస్థ విఫలం కావడానికే కట్టుబడిపోయింది.

ప్రస్తుతం గాజాలో కొనసాగుతున్న యుద్ధనేపథ్యంలో ఐక్యరాజ్యసమితిలో అంతర్గతంగా ఉన్న అధికార యంత్రాంగానికీ, దాని ఆదర్శాలకూ మధ్యగల వ్యవస్థీకృతమైన అసమతౌల్యం గతంలో ఎన్నడూ లేనంత ప్రస్ఫుటంగా పైకి కనిపిస్తున్నది. ఈ సంక్షోభం అత్యంత మౌలికమైన సమస్యను ప్రముఖంగా తెరమీదకు చర్చకు తీసుకువచ్చింది. శాంతి సంరక్షణకు ఉద్దేశించిన ఈ సంస్థ తన లక్ష్యాన్ని నెరవేర్చనీయకుండా తరచు ఎప్పటికప్పుడు దానికి సంకెళ్లు పడుతూ వచ్చాయి. లక్ష్యసాధనలో ఎదురయ్యే ఆచరణాత్మకమైన ఆటంకాల వల్ల ఐక్యరాజ్యసమితికి ఈ బంధనాలు పడలేదు, దాని ఆవిర్భావంలోనే నిర్మితమైన వ్యవస్థీకృత లోపాలు, అసమానతల కారణంగానే ఐక్యరాజ్యసమితికి ఈ ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి హక్కులపత్రంలోని పీఠిక మొదటి వాక్యాలు ‘‘ప్రజలమైన మేము’’ అని ప్రారంభం అవుతుంది. వెస్ట్‌ఫాలియన్ శాంతి సూత్రాలకు అనుగుణంగా అంతర్జాతీయ చట్టం ముందు భూగోళంపై అన్ని దేశాలూ సమానమేనని పీఠిక స్పష్టం చేస్తున్నది. ప్రపంచ సంస్థ అధికార హక్కుల పత్రంలో నిర్దేశించిన బాధ్యతలను సమ్మతించి సభ్యత్వం పొందిన దేశాలలోని ప్రజలందరికీ సమాన ప్రాతినిధ్యం ఉంటుంది. భారత మానవహక్కుల కార్యకర్త, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ‘ఆమ్నెస్టీ’ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సలీల్ షెట్టి ప్రశ్నించిన విధంగా, ‘‘అసలు ఈ ప్రపంచసంస్థ నిర్ణయాలు ప్రజల ఆలోచనలను, ప్రజావాణిని ఎక్కడ ప్రతిబింబిస్తోంది?

**ఐదు దేశాలకు వీటో పవర్**

**ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘన**

ఐక్యరాజ్యసమితి హక్కుల పత్రంలోని రెండవ అధ్యాయం చెప్పిన ప్రకారం, ‘‘సభ్యదేశాలన్నింటికీ సార్వభౌమాధికార సమానత్వ సూత్రాన్ని వర్తింపజేయడంపైనే ఈ సంస్థ ఆధారపడి ఉంది. అంతేకాకుండా ప్రజాస్వామ్య ఆదర్శాలకు ఐక్యరాజ్యసమితి కట్టుబడి ఉంది. ఐనప్పటికీ ఐదు శాశ్వత సభ్యదేశాలకు భద్రతామండలిలో సంక్రమించిన ‘వీటో’ (తీర్మానాలను ఏకపక్షంగా తిరస్కరించే అధికారం) పవర్ ప్రజాస్వామ్య విలువలను ఉల్లంఘించడమేనని స్పష్టమవుతున్నది. ఐక్యరాజ్యసమితి 1945లో ఆవిర్భవించినప్పటినుండీ ఈ సంస్థ హక్కులపత్రానికి మూడుసార్లు మాత్రమే (1963, 1965, 1973) సవరణలు జరిగాయి. ఈ సవరణలు దాటి ఎలాంటి మార్పులూ ఈ



హక్కుల పత్రంలో జరగలేదు. ఎందుకంటే ఐదు శాశ్వత సభ్యదేశాలూ తమ వీటో అధికారాన్ని దుర్వినియోగం చేసినందువల్ల నామమాత్రపు సవరణలతోనే ఈ సంస్కరణలన్నీ జరిగాయి. గడచిన అనేక సంవత్సరాలుగా ఈ వీటో అధికారాలను సంస్కరించేందుకు అనేక సార్లు అనేక ప్రతిపాదనలు వచ్చాయి. కానీ అవన్నీ ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నాయి. వీటో అధికారాలు రద్దుచేయాలని అందరూ గాఢంగా వాంఛించే ఒక ప్రతిపాదన ఈ మధ్యకాలంలో ఐక్యరాజ్యసమితి ముందుకు వచ్చింది. శాశ్వత సభ్యదేశాలకు సంక్రమించిన ఈ వీటో అధికారం అత్యంత వివాదాస్పదంగా మారినందువల్ల దానిని రద్దుచేయాలని అనేకసార్లు ఇప్పటికే ఎంతోమంది గగ్గోలు పెట్టారు. ఐతే ఇందుకు సంబంధించిన లాంఛనపూర్వకమైన సవరణ ప్రతిపాదన ఐక్యరాజ్యసమితి ముందుకు రాలేదు. అలాంటి ప్రయత్నం ఇప్పటివరకూ ఎవరూ చేయలేదు. అలాంటి ప్రయత్నం జరిగితే అనివార్యంగా ఐదు శాశ్వత సభ్యదేశాలనుండీ ప్రతిఘటన వస్తుంది. తమ హక్కులు కాపాడుకోవడంలో భాగంగా ఐదు దేశాలు ఈ ప్రతిపాదనను వీటో చేస్తాయి. ఐదు అగ్రదేశాలకూ భద్రతామండలిలో వీటో అధికారాన్ని రద్దు చేయాలని టర్కీ దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ 2022 అక్టోబరునెలలో ముందుకు తెచ్చిన ఆలోచనను రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఆ తర్వాత ‘‘ఆర్‌ఎన్2వి’’ (వీటో చేయకూడదనే బాధ్యత) కూడా తెరమీదకు వచ్చింది. 2001లో మొదటిసారి ఈ ప్రతిపాదన వచ్చింది. అగ్రదేశాలకు తమ సొంత ప్రయోజనాలు ఇమిడి ఉన్నట్లయితే, అందుకు విరుద్ధంగా మెజారిటీ దేశాల మద్దతు ఉన్న సమయంలో, శాశ్వతదేశాలు వీటో చేయకూడదన్నదే ఈ ప్రతిపాదన.

వీటో అధికార సంస్కరణతోపాటు భద్రతామండలి సభ్యత్వాన్ని విస్తరించాలన్న ప్రతిపాదనలు కూడా వచ్చాయి. ప్రపంచ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రం ఒకవైపు నుండి మరోవైపునకు మళ్ళుతున్న ఛాయలు స్పష్టంగా గోచరమవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదనలు వచ్చాయి. జి–4 (భారత్, జర్మనీ, జపాన్, బ్రెజిల్)దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఇవ్వాలనే ప్రతిపాదనతోపాటు, ప్రస్తుత అధికారపంపిణీ ప్రాతిపదికపై చూసినప్పుడు 1945లో పునఃప్రతిష్ఠితమైన ప్రపంచ నిబంధనలు ఇంకెంతమాత్రం చెల్లుబాటుకావనీ, సమకాలీన ప్రపంచానికి ఆ హక్కులపత్రంలోని నిబంధనలు సరిగ్గా అతికినట్టు సరిపోవనే పూర్వసిద్ధాంతం ఆధారంగా ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. ఏదిఏమైనప్పటికీ, ‘‘భద్రతామండలి గనుక ఐదు శాశ్వత సభ్యదేశాల ప్రయోజనాలతో రాజీపడి సమన్వయ చర్యలు తీసుకోకపోతే, మరిన్ని దేశాలకు సభ్యత్వం ఇచ్చి ఏవిధంగా భద్రతామండలిని విస్తరించి బలోపేతం చేయగలుగుతుంది?’’అని సమకాలీన సమస్యలమధ్య అనేక దేశాలు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవదీశాయి.

ఐదు శాశ్వత సభ్యదేశాలకు ‘వీటో అధికారం’ పూర్తిగా రద్దు చేయకుండా పరిమితమైన ప్రత్యామ్నాయ అవకాశాలకు సలహాలు కూడా ముందుకు వచ్చాయి. ‘డబుల్ మెజారిటీ మెథడ్’ ద్వారా భద్రతామండలిలో ప్రస్తుతం ఉన్న వీటో అధికారానికి ప్రత్యామ్నాయ మార్పులు ప్రతిపాదించాలని అమెరికాకు చెందిన న్యాయవాది, రిటైర్డ్ ఆర్మీ అధికారి కైత్ ఎల్.సెల్లెన్ సలహా ఇచ్చారు. ఆయన సలహా ప్రకారం, ఏదైనా తీర్మానాన్ని ఏదోక దేశం వీటోచేసినపుడు దాన్ని తిరస్కరించేందుకు 3 వీటో హక్కుదేశాలతోపాటు 8 సభ్యదేశాలు అంగీకారానికి రావటం ఈ ‘డబుల్ మెజారిటీ మెథడ్’. మీడియా ఎగ్జిక్యూటివ్ మైఖేల్ జె.కెల్లీ సలహా ప్రకారం, శాశ్వత సభ్యదేశాల్లో ఏదైనా ఒక దేశం గనుక ఒక విషయాన్ని వీటో ద్వారా తిరస్కరిస్తే, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం పిలవాలి. ఆ వీటో చేసిన దేశం ప్రతిపాదనకు జనరల్ అసెంబ్లీ సమావేశంలో మెజారిటీ లభించకపోతే, వీటోను తిరస్కరించాలి. ఐతే ఈ రెండు ప్రతిపాదనలకు ఐదు శాశ్వత సభ్యదేశాల సమ్మతి అవసరం. అది వారి హక్కుల్లో జోక్యం చేసుకున్నట్లే, వారు వీటో చేసేఅవకాశం ఉంటుంది.

కానీ ఈ విధంగా, ఎంపిక చేసిన ఐదు దేశాలకు ఏ తీర్మానాన్ని అయినా తిరస్కరించే ఏకపక్ష అధికారాలు ఇవ్వడం అంటే, ఐక్యరాజ్యసమితి లక్ష్యాలలో ప్రకటించిన సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం వంటి మౌలిక సూత్రాలను దెబ్బతీయటమే. ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణలు, మానవ సంక్షోభాలు కొనసాగుతున్న పరిస్థితు ల్లో వాటిని పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి నిర్ణయాత్మక కార్యాచరణ సామర్థ్యాన్ని రోజురోజుకూ అనేక దేశాలు ప్రశ్నించడం పెరుగుతున్నది. అందువల్ల ఐక్యరాజ్యసమితిలో అందరూ కోరుకున్నవిధంగా సంస్కరణలు ఎంతో అవసరం. ఐదు శాశ్వతసభ్యదేశాలూ అసాధారణరీతిలో రాజీపడి ఈ ప్రపంచ సంస్థను పునర్వ్యవస్థీకరించాలి, పునర్నిర్మించాలి. అప్పటివరకూ శాంతి, న్యాయం అమలు చేయడం కోసం ఆవిర్భవించిన ఐక్యరాజ్యసమితి సంస్థ ఆచరణాత్మక ఆటంకాలు, వైఫల్యాలతో, అసమానతలు, వైరుధ్యాలమధ్య కొట్టుమిట్టాడు

# శాస్త్రవేత్తలారా.. మీకు శతకోటి వందనాలు!

రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) 2024 నవంబర్ 16న ఒడిశాతీరంలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి దేశీయంగా అభివృద్ధి చేసిన మొదటి సుదూర శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. దీనితో మన దేశ అమ్ములపొదిలో మరో బలమైన అస్త్రం చేరింది. ఈ హైపర్ సోనిక్ క్షిపణి సాయుధ దళాల కోసం 1,500కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధి వరకు వివిధ పేలోడ్ల ను మోసుకెళ్లేలా రూపొందించబడింది. ఈ క్షిపణిని వివిధ రేంజ్ వ్యవస్థలు ట్రాక్ చేశాయని, బహుళ ప్రాంతాలలో మోహరించాయని, డౌన్ రేంజ్ షిప్ స్టేషన్ల నుండి పొందిన ఫ్లైట్ డేటా విజయవంతమైన టెర్మినల్ విన్యాసాలు, ప్రభావా న్ని అధిక స్థాయి ఖచ్చితత్వంతో ధృవీకరించిందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రయోగంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎంపిక చేసిన కొన్ని దేశాల జాబితా లో మనదేశం చేరినట్లైంది. హైపర్‌సోనిక్ వెపన్ టెక్నాలజీలో చైనా, రష్యా, అమెరికా వంటి ప్రధాన సైనిక శక్తులతో పాటు భారతదేశాన్ని నిలబెట్టింది. ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్, ఇరాన్, ఇజ్రాయెల్‌తో సహా అనేక ఇతర దేశాలు కూడా హైపర్సోనిక్ క్షిపణి వ్యవస్థల ను అభివృద్ధి చేయడానికి ప్రాజెక్టులను మొదలుపెట్టాయి.ఈ క్షిపణిని హైదరాబాద్ లోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం మిసైల్ కాంప్లెక్స్ ప్రయోగశాలలు, పలు డీఆర్డీవో ప్రయోగశాలలు, పరిశ్రమలు భాగస్వామ్యమై దేశీయంగా అభివృద్ధి చేశాయి.

**రక్షణమంత్రి ట్వీట్ :** ‘ఒడిశా తీరంలోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారత్ కీలక మైలురాయిని సాధించింది. ఇది చారిత్రాత్మక ఘట్టం, ఈ గణనీయమైన విజయం మన దేశాన్ని ఇటువంటి క్లిష్టమైన అధునాతన సైనిక సాంకేతిక పరిజ్ఞానాల సామర్థ్యాలను కలిగి ఉన్న ఎంపిక చేసిన దేశాల సమూహంలో ఉంచింది. అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు డిఆర్డిఒ బృందానికి, మన సాయుధ దళాలకు నేను అభినందనలు తెలియజేస్తున్నాను’ అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేసారు.

**ప్రత్యేకతలు – ఉపయోగాలు:** ఈ క్షిపణి రక్షణ దళాల ఉపయోగార్థం పదిహేనువందల కిలోమీటర్లకు మించిన పరిధివరకు అనేక పేలోడ్లను మోసుకె ళ్లే సామర్థ్యం కలిగి ఉంది. అత్యంత వ్యూహాత్మకంగా రూపొందించిన ఈ క్షిపణిని అగ్ని ప్రోగ్రామ్‌లోని సాంకేతిక పరిజ్ఞానా న్ని వినియోగించి అభివృద్ధి చేశారు. దీని వేగం మాక్ 5 లేదా ధ్వని కంటే ఐదు రెట్లు. వేగాన్ని బట్టిచూస్తే ఈ క్షిపణిని శత్రుదేశ రాడార్లు గుర్తించడం కష్టతరం. వేగం, విన్యాసాల కలయికతో ప్రస్తుత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థలు దీన్ని అడ్డుకోలేవు. రాబోయే సాయుధ దళాల రాకెట్ ఫోర్స్‌కోసం ఈ క్షిపణిని అభివృద్ధి చేయడమే కాకుండా భూమి, గాలి, నౌకాద ళ వేదికలకు అనుకూలమైనది. వేగం, చురుకుదనంతో ఆధుని క క్షిపణి రక్షణ వ్యవస్థలను అధిగమిస్తుంది. సైన్యం, నౌకాద ళం, వైమానిక దళం అంతటా బహుళ ఉపయోగాలు కలిగి ఉంది. నావికాదళ




వెర్షన్ సుదూర శ్రేణుల వద్ద శత్రు యుద్ధనౌకలను లక్ష్యం చేసుకుని ఖచ్చితత్వంతో నాశనం చేస్తుంది. అంతేకాకుండా శత్రు వైమానిక వాహక నౌకలను కూడా లక్ష్యం చేసుకోగలదు. ఇది హిందూ మహాసముద్రాన్ని రక్షించడానికి కీలకమైన ఆయుధం. భూమి నుండే శత్రువుల వైమానిక స్థావరాలు వంటి అధిక విలువగల లక్ష్యాలను ఛేదించడానికి దీనిని మోహరించనున్నారు. మరో ప్రధానమైన విశేషం ఏంటంటే ఇది సంప్రదాయ లేదా అణు వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు.

**తొలి అడుగులు:** 2019లో ప్రారంభించబడిన హైపర్సోనిక్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ వెహికల్ ప్రాజెక్ట్‌లపై ఈ ప్రయోగం రూపొందించబడింది. సెప్టెంబర్ 2020లోనే ధ్వని వేగం కంటే ఆరు రెట్లు (మాక్6) వేగంగా ప్రయాణించగల ఏదైనా క్షిపణిని రక్షణరంగంలోకి చొచ్చుకుపోయే నూతన అత్యాధునిక ఆయుధాలను అభివృద్ధి చేసే దిశగా భారతదేశం తొలి అడుగులు వేసిం ది. అప్పట్లోనే ఒడిశా ప్రయోగ కేంద్రం నుండి మొదటిసారిగా హైపర్సోనిక్ టెక్నాలజీ డెమోన్‌స్ట్రేటర్ వెహికల్ (హెచ్‌ఎస్టిడివి)ఫ్లైట్ పరీక్షను డిఆర్డిఓ విజయవంతంగా నిర్వహించింది.


**హైపర్సోనిక్ అంటే ఏమిటి ?..** హైపర్సోనిక్ ఆయుధం అనేది హైపర్సోనిక్ వేగంతో ప్రయాణించగల ఆయుధం. ఇది ధ్వని వేగం కంటే 5 నుండి 25రెట్లు లేదా సెకనుకు 1 నుండి 5 మైళ్లు (1.6 నుండి 8.0 కిమీ/సె) వేగాన్ని కలిగి ఉంటాయి. హైపర్ సోనిక్ వ్యవస్థలు దశాబ్దాలుగా వాడుకలో ఉన్నాయి. హైపర్ సోనిక్ ఆయుధం యొక్క మొదటి రూపకల్పన సిల్బర్వోగెల్. దీనిని 1930లలో జర్మన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. జాన్ గ్లెన్ 1962లో భూమి చుట్టూ తిరిగి మొదటి యుఎస్ క్రూడ్ ఫ్లైట్ నుండి భూమికి తిరిగి వచ్చినప్పుడు క్యాప్సూల్ హైపర్సోనిక్ వేగంతో వాతావరణంలోకి ప్రవేశించింది. ప్రపంచంలోని అణు ఆయుధాలలో ఉన్న అన్ని ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు హైపర్ సోనిక్‌గా ఉంటాయి. హైపర్సోనిక్ క్షిపణులు వాటి ఖరీదు కారణాన అధిక పరిమాణంలో ఉత్పత్తి చేయడం ఆర్థికంగా కష్టం.

అవి ఒకటి ఏరోబాలిస్టిక్ రకం. హైపర్ సోనిక్ ఏరోబాలిస్టిక్ సిస్టమ్ ఎయిర్ క్రాఫ్ట్ నుండి జారవిడిచబడుతుంది. రాకెట్‌ని ఉపయోగించి హైపర్‌సోనిక్ వేగంతో వేగవంతం చేయబడుతుంది. రెండు గ్లైడ్ రక వాహనాలు. ఒక హైపర్సోనిక్ గ్లైడ్ వాహనం రాకెట్‌పై అధిక ఎత్తుకు పంపించబడి ఆ పై దాని లక్ష్యాన్ని చేరుకుంటుంది. మూడు క్రూయిజ్ క్షిపణులు. హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని రాకెట్ ద్వారా హైపర్ సోనిక్ వేగానికి పెంచుతారు. ఆ వేగాన్ని కొనసాగించడానికి స్క్రామ్జెట్ అని పిలువబడే ఎయిర్ బ్రీతింగ్ యంత్రాన్ని ఉపయోగిస్తుంది. క్రూయిజ్ క్షిపణి దాని లక్ష్యాన్ని గుర్తించడం లేదా ముందుగా నిర్ణయించిన లక్ష్యాన్ని కలిగి ఉంటుంది. ఇది క్షిపణిలో మార్గదర్శక వ్యవస్థను ఉపయోగించి ప్రయాణిస్తుంది. ఈ వ్యవస్థ అత్యంత ముఖ్యమైన అధునాతనమైన భాగం. వ్యూహాత్మక క్షిపణులలో, ఎలక్ట్రానిక్ సెన్సార్లు దానినుండి విడుదలయ్యే లేదా ప్రతిబింబించే శక్తిని గుర్తించడం ద్వారా లక్ష్యాన్ని గుర్తిస్తాయి. క్రూయిజ్ క్షిపణులను భూదాడులు, నౌకాదళ దాడుల కోసం భూమి, సముద్రం, గాలి నుండి ప్రయోగించవచ్చు. ఇవి భూ ఉపరితలానికి సాపేక్షంగా దగ్గరగా ఉంటాయి. కాబట్టి క్షిపణి నిరోధక వ్యవస్థల ద్వారా వాటిని సులభంగా గుర్తించలేరు. అధిక ఖచ్చితత్వంతో పెద్ద పేలోడ్లను మోసుకెళ్తాయి.

**డిజె మోహనరావు,**
8247045230

# ప్రపంచ బాలల హక్కుల హననాలు!

నేటి బాలలే భావి ప్రపంచ పౌరులు. బాల్యం ఆనందాలకు చిరునామా. బాల్యం సున్నితం, బహు సుందరం. బాల్యం అద్వితీయ అనుభవాల నెలవు. అందరం బాల్య దశ నుండి ఎదిగిన వారమే. కుటుంబ సంతోషాలకు ప్రేరణ చిరునవ్వుల చిన్నారులు. పిల్లలకు ప్రశ్నించడం, తెలుసు కోవాలనే తపన ఉండడం గమనిస్తుంటాం. సమాజంలో ఒక ప్రధాన భాగమైన బాలల భవితను సన్మార్గంలో నిర్మించాల్సిన కనీస బాధ్యత నేటి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజంపై ఉన్నది. పిల్లలకు మానవ హక్కులు ఉంటాయని, వాటిని అమలు చేయాలని, అవగాహన కల్పించాలని, చర్చించి తగు సమాధానాలు వెతకాలని, బంగారు బాటలు వేయాలనే పలు సదుద్దేశాలతో ప్రతి ఏట యూనిసెఫ్ నాయకత్వం లో 20 నవంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు ప్రపంచ బాలల దినోత్సవం(వరల్డ్ చిల్డ్రన్స్ డే) ఘనంగా నిర్వహించడం 1990 నుంచి ఆనవాయితీగా మారింది. భారత్‌లో ప్రతి ఏటా నవంబర్ 14న జాతీయ బాలల దినాన్ని, జూన్ 01న అంతర్జాతీయ బాలల దినం కూడా పాటిస్తున్నామని మనందరికీ తెలుసు. పిల్లలకు చదువులతో పాటు ఆటపాటలు, లలిత కళల పట్ల ఆసక్తిని గమనించి శిక్షణను ఇవ్వడానికి పెద్దలు చొరవ చూపాలి.



ప్రపంచ బాలల హక్కులను నిర్లక్ష్యం చేయడం, అపార్థం చేసుకోవడం, కాలరాయడం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నేటి బాలల సంక్షేమ చర్యలే రేపటి ప్రపంచ ఉజ్వల భవితకు రాచబాటలని మరిచిపోతున్నాం. ఆధుని క ప్రపంచ బాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పేదరికం, ఆకలి కేకలు, పోషకాహారలోపాలు, అవిద్య, సామాజిక మాధ్యమాల దురలవాటు, సహచరుల ఒత్తిడి, స్క్రీన్ టైమ్ అవలక్షణాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, చదువుల ఒత్తిడి, స్థూలకాయం, శారీరక ఎదుగుదల లోపించడం, అనవసర ఆందోళనలు, భావోద్వేగ సవాళ్లు, లైంగిక వేధింపులు, సురక్షిత నీటికొరత, బాల కార్మిక అవస్థలు, లింగఆధార హింస, యుద్ధ దేశాల్లో దుష్ప్రభావాలు, వలసల దుఃఖాలు, గృహ వసతులు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వాతావరణ మార్పులతో అనారోగ్యాలు, కాలుష్య ప్రతికూలతలు, కుటుంబ సమస్యలు, అక్రమ రవాణాలు, జాతి వివక్షలు, మానసిక సమస్యలు లాంటివి గుర్తించబడినవి.

**బాలల హక్కులకు పట్టం కడదాం:** విశ్వ బాలల హక్కులు ఎలాంటి చర్చలకు తావులేనివి. బాలల హక్కులను కాలరాయడం అంటే రేపటి వారి ఉజ్వల భవిష్యత్తును పాతరేయడమే. నేడు, రేపు, భవిష్యత్తులో సదా ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండాలంటే బాలల పెంపకంలో అతి శ్రద్ధ అనివార్యం. పిల్లల ఆలోచనలు విందాం. వారిలో దాగిన సృజనను ప్రోత్సహిద్దాం. వారి అనుమానాలను ఓపికగా నివృత్తి చేద్దాం. వారి సున్ని త మనసులను ఆప్యాయంగా ఆదరిద్దాం. తల్లితండ్రుల జీవ న సాఫల్యత వారి పిల్లల ఎదుగుదల ప్రమాణాలపై మాత్ర మే ఆధారపడి ఉంటుందని తెలుసుకుందాం. నేటి ప్రపంచ బాలల దినోత్సవం– 2024 థీమ్ ప్రతి పిల్లాడికి మౌళిక హక్కులు ఉన్నాయి(ఫర్ ఎవ్రీ చైల్డ్, ఎవ్రీ రైట్) ఆధారంగా సకల సౌకర్యాలను కల్పిస్తూ చిరు మొక్క వలె పంచుదాం, మహావృక్షంగా ఎదిగి మరి కొందరికి నీడనిచ్చే స్థాయికి చేర్చుదాం. చిచ్చర పిడుగుల్లో ఆత్మగౌర వం, ఆత్మవిశ్వాసాలను పెంచుదాం. సృజనకు పట్టం కడదాం. కలలను సాకారం చేసుకునే విధంగా సౌకర్యాలను కల్పిద్దాం. పసిపిల్లలు తోటలో మొగ్గల్లాంటి వారని, వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తే పరిమళ సుగంధ పుష్పాలుగా వికసిస్తారని గుర్తుంచుకుందాం. కుటుంబం విచ్ఛిన్నమైతే విశ్వం వల్లకాడు అవుతుంది. మన బాలల్ని మనసారా ప్రేమించడం అంటే వారి పెంపకంలో అత్యంత శ్రద్ధ వహించడమే. నేటి ప్రపంచ బాలల్ని రేపటి విశ్వ నాయకుల స్థాయికి చేర్చడానికి మనందరం నిచ్చెనగా నిలబడదాం, తడబడినపుడు ఊతకర్రగా నిలుద్దాం.

**(20 నవంబర్ ప్రపంచ బాలల దినోత్సవం)**

**డా.బిఎంఆర్,** 9949700037

# ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 మాసాలు పూర్తికావస్తుంది. ఎన్నికల ముందు ఉద్యోగ, కార్మికులతోపాటు వివిధ వర్గాలకు అనేక హామీలు ఇచ్చారు. వాటిని ఒక్కొక్కటిగా అమలుకు దృష్టి పెట్టాల్సి ఉంది. ఉద్యోగ, కార్మికుల సమస్యలు గతకొంతకాలంగా అంటే బిఆర్‌ఎస్ హయాం నుండే పరిష్కరింపకుండా నిరంకుశంగా వాయిదా వేస్తూ వ్యవహరిస్తు వచ్చారు. గత ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ, అంగన్వాడి, ఆశ, మున్సిపాలిటీ, పంచాయితీ, కెజిబివి వివిధ రంగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మెలు, ఆందోళనలు చేశారు. కానీ గత ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మిక సంఘాలను చర్చలకు పిలువక పోగా పనికిమాలిన సంఘాలంటూ అవమానపరిచింది. సమ్మె చేస్తారా అని చీదరించుకున్నది. గత ముఖ్యమంత్రి కెసిఆర్ మొదటి నుంచి కార్మికుల సమస్యల పట్ల, సమ్మెల పట్ల, ట్రేడ్ యూనియన్‌ల పట్ల కఠినంగా అసహనంతో, పెత్తందారీ పోకడలతో వ్యవహరించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. యూనియన్ లేకుండా చేశారు. అంగన్వాడి యూనియన్లను చీల్చి తన కుమార్తె కవితను అధ్యక్షులుగా పెట్టి డిమాండ్ల కొరకు నిరసన తెలిపిన సంఘాలను నిర్వీర్యం చేశారు.

గత ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా విసుగెత్తిన రాష్ట్ర ప్రజలు, కార్మిక వర్గం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులు ఉద్యోగ కార్మిక సంఘాలకు టైం ఇస్తూ చర్చలకు ఆహ్వానిస్తున్నప్పటికీ వారి సమస్యలు వినడం తప్ప ఉపశమనం లేదు. దీంతో కడుపు నిండదు కదా! సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ రంగాల కార్మికులు నిరసనగళం ఎత్తుతూ ధర్నాలు, ప్రదర్శనలు జరుపుతున్నారు.

కేంద్ర రాష్ట్ర స్కీములలో పనిచేస్తున్న దాదాపు లక్షమందికి పైగా ఆశా వర్కర్స్, మిడ్ డే మీల్స్ వర్కర్స్, అంగన్‌వాడీ వర్కర్స్ తమ వేతనాలు పెంచాలంటూ గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. వీరికి ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ నేటికీ ఆచరణకు నోచుకోలేదు. ఆశ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.18వేలకు పెంచాలంటూ, మిడ్డే మీల్స్ వర్కర్స్ ప్రస్తుతం రూ.1000/లు మాత్రమే ఇచ్చే గౌరవ వేతనమును ప్రభుత్వం రూ.3వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ అమలు చేయలేదు. ఈ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పుతూ వస్తుంది. కానీ నేటికీ ఆచరణకు నోచకోకపోగా నెలల తరబడి మెస్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీరు కనీసం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్వాడీ టీచర్స్‌కు ప్రస్తుతం రూ.13,500, హెల్పర్స్‌కు రూ.7500 మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సెకండ్ ఎఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేస్తూ వేతనాలు పెంచాలని కోరుతున్నారు. ఈ స్కీములన్నింటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం చొప్పున నిధులు ఇవ్వాల్సి ఉంది. ఎన్నికల్లో వారికి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, వారి వేతనాలు పెంచాలని గత నాలుగు నెలలుగా జిల్లా, రాష్ట్ర కేంద్రాలలో ఆందోళనలు చేస్తూ వస్తున్నారు.

రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఒల విధానాన్ని గత ప్రభుత్వం రద్దుచేసి వివిధ శాఖలకు బదిలీ చేశారు. ఈ ప్రభుత్వం వారినందరినీ రెవెన్యూ శాఖలోనే నియమిస్తామంటూ హామీ ఇచ్చిన నేపథ్యంలో సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ సీనియర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, వారి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వస్తున్నారు.

గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతన విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఐకెపి, విఒఎ తమ సమస్యలపై ఆందోళన చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలైన ప్రభుత్వంలో విలీనం, వేతన సవరణలు, పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కచాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారు. టిఎన్జీవోలు వేతన సవరణను చేపట్టాలని, వారికి ఇచ్చే పెండింగ్‌లో ఉన్న 6డిఏలు (గత ప్రభుత్వం ఉన్నప్పుడే ఇచ్చేవి 3) ఇవ్వాలని కోరుతున్నారు.

కడుపు నిండనప్పుడు కండ్లెర్రజేయడం సహజం. అందుకే వరుసగా అందరూ ఆందోళన బాట పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో సర్కార్ స్పందించకపోతే ఉద్యమబాట తప్పదు. రేవంత్ సర్కారు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తక్షణమే స్పందించాలి. ఆయా ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

**వి.ఆర్**



## మంత్రి తుమ్మలను కలిసిన 'హరే కృష్ణ' బాధ్యులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హరేకృష్ణ మూమెంట్ సంస్థ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హరే కృష్ణ మూమెంట్ సంస్థ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం నియోజక వర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు సహకరించాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందించే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. అల్పాహారాన్ని అందించేందుకు కిచెన్ షెడ్డు అవసరం ఉన్న విషయాన్ని సంస్థ బాధ్యులు తెలపగా వెంటనే జిల్లా ముజమ్మిల్ ఖాన్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి సంస్థకు కిచెన్ షెడ్డు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంస్థ బాధ్యులు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కలెక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని సూచించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ బాధ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు కౌటిల్య దాస్ రవి, సులోచన దాస్ పాల్గొన్నారు.



## సిపిఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

✻ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య

**ప్రజాపక్షం/మణుగూరు రూరల్ :** సిపిఐ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని విప్పల సింగారంలో జంగం మోహన్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన బి. అయోధ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామాల్లో సిపిఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా, లేకున్నా పేద ప్రజల సంక్షేమం కోసం సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా పనిచేస్తుందని, అందుకోసం పార్టీని ఆదరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, ఏఐటియుసి మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, కొడిశాల వీరన్న, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## త్యాగాల చరిత్ర కమ్యునిస్టులదే

సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదేనని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ పోరాటాలు సాగించిందని తెలిపారు. రఘునాథపాలెం మండల పరిధిలోని పంగిడి గ్రామశాఖ ఆధ్వర్యంలో సిపిఐ శత జయంతి సందర్భంగా పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సభ్యత్వాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలు, కర్షకులు, కార్మికుల పక్షాన సిపిఐ నిరంతరం పోరాటాలు సాగించిందన్నారు. ఎన్నో హక్కులు సాధించిన ఘనత సిపిఐది అని తెలిపారు. రఘునాథపాలెం మండలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని వందల ఎకరాల భూములు పంచిన ఘనత సిపిఐ దన్నారు. శత జయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు [illegible], జిల్లా సహాయ కార్యదర్శి శివ నాయక్, మండల నాయకులు బానోత్ [illegible], జామ్లా నాయక్, రామా నాయక్, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల్లో మమేకమైన సంఘం ఏఐటియుసి

ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతుల్లో వక్తలు



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** కార్మికులు అనునిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఏఐటియుసి నాయకత్వంపై ఉందని, కార్మికుల పక్షం వహించి వారిని ఉద్యమాలవైపు నడిపిస్తేనే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు పానుగంటి పర్వతాలు, ఉమా మహేష్ అన్నారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఏఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు చుంచుపల్లి మండల పరిధిలోని గౌతంపూర్ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతుల్లో నాయకులు మాట్లాడుతూ ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు కార్మికుల సమస్యలపై సత్వరమే స్పందించే తత్వాన్ని అలవరుచుకోవాలని, కార్మికుల్లో మమేకమై పనిచేసినప్పుడే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని, దీని ద్వారా సంఘం బలోపేతం అవుతుందన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ బడా పారిశ్రామిక వేత్తలకు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను తాకట్టు పెట్టి కాలరాస్తోందని విమర్శించారు. ఏఐటియుసి శ్రేణులు కార్మికులను అప్రమత్తంగా చేస్తూ ఉద్యమాలవైపు నడిపించే బాధ్యతను స్వీకరించాలన్నారు. రెండు రోజుల పాటు జరుగుతున్న శిక్షణా తరగతులను ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సాబీర్‌పాషా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, జిల్లా నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు కె.సారయ్య, వట్టికొండ మల్లికార్జునరావు, భాస్కర్, ఎస్.వీరయ్య, [illegible], భాస్కర్, వీరస్వామి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల కిటకిటా..
# బస్సుల కటకట!



'మహాలక్ష్మి'తో పెరిగిన మహిళల ప్రయాణాలు

సగం అద్దె బస్సులే

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే వారు సరైన రీతిలో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి అధికారులు గతం కంటే బస్సుల సంఖ్య పెరిగిందని సంఖ్యాపరమైన వివరాలు వెల్లడిస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ప్రతి బస్టాండ్ లోనూ చాలా సేపు వేచి చూస్తే తప్ప బస్సు ఎక్కే పరిస్థితి లేదు. ఇక ఆర్డినరి, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కాలు పెట్టడానికి కూడా చోటు ఉండడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం లభించింది. గతంతో పోల్చినప్పుడు మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడానికి ముందు ఖమ్మం రీజియన్ పరిధిలో 2023 డిసెంబర్‌లో 397 బస్సులు ఉండగా, నవంబర్ 2024 నాటికి 408 బస్సులకు పెంచారు. కానీ ప్రయాణికుల సంఖ్య ముఖ్యంగా మహిళా ప్రయాణికుల సంఖ్య సుమారుగా రెట్టింపు కాగా ఆ స్థాయిలో బస్సులు పెంచకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం డిపోలో 2023లో మహాలక్ష్మి అనుమతించే బస్సులు 105 ఉండగా, నవంబర్ 24 నాటికి 101కి తగ్గించారు. మధిర డిపోలో 57 ఉండగా, 56కు తగ్గించగా సత్తుపల్లి డిపోలో గతంలో మహాలక్ష్మిని అనుమతించే బస్సులు 73 ఉండగా ఇప్పుడు వాటిని 72కు కుదించారు. భద్రాచలం డిపోలో 59 ఉండగా ఇప్పుడు 64కు పెంచారు. కొత్తగూడెం డిపోలో గతంలో 48 ఉండగా ఇప్పుడు 51కు, మణుగూరు డిపోలో మహాలక్ష్మి పథకం అమలయ్యే బస్సులు 41 ఉండగా ఇప్పుడు 45కు, ఇల్లందులో 14 ఉండగా ఇప్పుడు 19కు పెంచారు. ఖమ్మం రీజియన్‌లో గతంలో 397 బస్సుల ద్వారా మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించగా ఇప్పుడు ఆ సంఖ్య 408కు పెంచారు. మొత్తంగా కేవలం 11 బస్సులను పెంచారు. కానీ ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గతంలో ఖమ్మం రీజియన్ పరిధిలో మొత్తం బస్సులు 544 ఉండగా ఇప్పుడు 583కు చేరుకున్నాయి. మహిళా ప్రయాణికులను అనుమతించే బస్సుల సంఖ్య 11 పెరగగా ఇతర సర్వీసులను 28కు పెంచడం గమనార్హం. ప్రయాణికుల సంఖ్యను బట్టి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఇదిలా ఉండగా ఖమ్మం రీజియన్‌లో అద్దె బస్సులే 40 శాతం ఉండగా మహాలక్ష్మి పథకం అమలయ్యే బస్సుల్లో సగానికి ఎక్కువగా ఉన్నాయి. ఖమ్మం డిపో పరిధిలో 64, మధిర డిపోలో 27, సత్తుపల్లిలో 54, భద్రాచలంలో 24, కొత్తగూడెంలో 29, మణుగూరు డిపోలో 32 మొత్తం 230 అద్దె బస్సులు ఉన్నాయి. ఇందులో పల్లె వెలుగులు 121 కాగా, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 109 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని చెపుతున్నప్పటికీ ఆ పని చేయకపోవడం వల్ల ఇప్పుడు బస్సు ప్రయాణం నరకప్రాయంగా మారింది. బస్సులతో పాటు పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా సిబ్బంది నియామకం జరపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిబ్బంది సరిపడ లేకపోవడంతో అదనపు విధులు నిర్వహించాల్సి వస్తుందని దీని వల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమని, అందుకు తగినవిధంగా బస్సుల సంఖ్య, సిబ్బంది నియామకం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కుల భోజనాలు వద్దు.. జన భోజనాలే ముద్దు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజలలో చైతన్యం పెరిగే కొద్దీ కుల ప్రభావం పెరుగుతుందని కార్తీక మాస వనభోజనాల సందర్భంగా కుల విభజన జరుగుతుందని స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్ ఆరోపించారు. కుల భోజనాల సందడి పెరిగిందని ఈ కుల సమీకరణల ద్వారా రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని వారు తెలిపారు. మంగళవారం మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భాస్కర్, అశోక్‌లు మాట్లాడుతూ కులాన్ని, మతాన్ని కూలిపోకుండా ప్రోత్సహించేందుకే ఇటువంటి వన భోజనాలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు చైతన్యవంతమై ఈ కుల భోజనాలను బహిష్కరించాలని వారు పిలుపునిచ్చారు. ఆధిపత్య కులాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం ఈ కుల భోజనాల పేరిట సమీకరణ చేస్తున్నారని దీనిని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజాస్వామిక వాదులు, బుద్ధిజీవులు కుల భోజనాలను వ్యతిరేకించి జన భోజనాలను జయప్రదం చేయాలన్నారు. డిసెంబర్ ఒకటిన ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనక మలీదు జగన్ మామిడి తోటలో ఏర్పాటు చేసిన సకల జన వన భోజనాలను జయప్రదం చేయాలని భాస్కర్, అశోక్‌లు కోరారు. మీడియా సమావేశంలో ఝాన్సీ, కొల్లేటి నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, శిరోమణి, శోభ, మంగతాయి, లక్ష్మణ్, రాకేష్, తేజానాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

## చట్టసభలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలి

బిసి కమిషన్‌కు బిసి హక్కుల సాధన సమితి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర జనగణన తర్వాత చట్టసభలు, స్థానిక సంస్థల్లోనూ బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని బిసి హక్కుల సాధన సమితి ఖమ్మం జిల్లా కమిటీ కోరింది. మంగళవారం వెనకబడిన తరగతుల కమిషన్ బహిరంగ విచారణ సందర్భంగా కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రూప్ 1కు సంబంధించిన జీవో నెం.29ని రద్దు చేసి జనరల్ సీట్లలోని కోటాను భర్తీ చేసిన తర్వాత బిసి రిజర్వేషన్ కోటాను పూర్తిచేయాలని, విదేశాలలో విద్యను అభ్యసిస్తున్న బిసి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రాయితీలను తక్షణం విడుదల చేయాలని కోరారు. కళాశాలలో ఫీజు రీయంబర్స్‌మెంట్, మెస్ ఛార్జీలను తక్షణం విడుదల చేయాలని, కేంద్రం, రాష్ట్రంలోనూ బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బిసి గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని తాటి వెంకటేశ్వరరావు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, నాయకులు నూనె శశిధర్ తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కు పాదం

12 ఇసుక ట్రాక్టర్లు సీజ్ కేసు నమోదు

వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తే తాటతీస్తా

ఎస్ఐ కూచిపూడి జగదీష్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో ఇసుక రవాణాకు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేదని ఈ ప్రాంతంలో వాల్టా చట్టం అమల్లో ఉందని తిరుమలాయపాలెం మండలం కాకరవాయి ముజాయితీపురం సుద్దవాగు తండా పాలేరు వాగు నుండి హైదర్ సాయిపేట పడమటి తండా ఆకేరు నుండి ఇసుక తోలేందుకు అనుమతి లేదని తిరుమలాయపాలెం ఎస్ఐ కూచిపూడి జగదీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఇసుక ట్రాక్టర్లు విచ్చలవిడిగా రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో తన సిబ్బందితో కాపుగాసి 12 ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

కొందరు వ్యక్తులు రైతుల వ్యవసాయ భూమిపై ఉన్న పట్టా పాస్ బుక్కులు బ్యాంకులలో ప్రభుత్వ సబ్సిడీలలో వ్యవసాయ పనుల నిమిత్తం తీసుకున్న ట్రాక్టర్‌లు వ్యవసాయ పనులు మినహా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతూ పట్టుబడితే అ ట్రాక్టర్లు సీజ్ చేసి వాటి సబ్సిడీని రద్దు చేయడమే కాకుండా డ్రైవర్ లైసెన్స్ రద్దు చేయడం ఓనర్‌పై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై తరచు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతుదన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఇసుక రవాణాకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని సంబంధం ఉన్న వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.




## ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

యాంటీ ర్యాగింగ్‌పై మెడికల్ విద్యార్థులకు సిపి అవగాహన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విద్యార్థులకు సూచించారు. యాంటీ ర్యాగింగ్ చట్టంపై ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి చంద్రశేఖర్‌తో కలిసి పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం అవగాహన కల్పించారు. మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ర్యాగింగ్‌పై నిషేధం ఉందని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేసినా, ఎలాంటి ఇబ్బందులు పెట్టినా వెంటనే అధ్యాపకులకు తెలపాలని సూచించారు. చట్టాన్ని తెలుసుకుని మసులుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆనందంగా ఉండవచ్చునని తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాసంపై దృష్టి నిలిపి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సిపి తెలిపారు. తోటి విద్యార్థినిల పట్ల సోదర భావంతో కలిసిమెలిసి విద్యను అభ్యసించాలని, అత్యుత్సాహానికి పోయి జైలుపాలై జీవితాలను అంధకారం చేసుకోవద్దని సిపి తెలిపారు. చట్టప్రకారం ర్యాగింగ్ శిక్షార్హమన్నారు. సీనియర్స్ జూనియర్స్ పట్ల ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టాన్ని అతిక్రమించినట్లవుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎసిపి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## మోడిఫైడ్ సైలెన్సర్లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

వింత శబ్ద కాలుష్యం కలిగించే 25 సైలెన్సర్లు తొలగింపు

ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు మంగళవారం ఖమ్మం నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే బుల్లెట్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 25 మోడిఫైడ్ సైలెన్సర్లు ఉన్న వాహనాలను గుర్తించి వాటిని తొలగించి రూ.1,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంత మంది యువత ద్విచక్ర వాహనాలకు సంబంధించి సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చి వింత శబ్దాలు, అధిక శబ్దాలు వచ్చే వాటిని అమరుస్తున్నారని ఏసిపి తెలిపారు. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా రోడ్లపై ఆకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొంత మంది హారన్‌లను సైతం అదే తరహాలో అమరుస్తున్నారని అటువంటి వారి ఆటకట్టించేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో దృష్టి సారించామన్నారు. నిబంధనలకు విరుద్ధగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మోడిఫైడ్ సైలెన్సర్లతో పట్టుబడితే వాటిని తొలగించి జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్, నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని, నెంబర్ ట్యాంపరింగ్ కలిగిన, నెంబర్ తుడిచి వేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్ఐ రవి, సాగర్, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

## రైతు భూమిని సర్వే చేయించిన తహసీల్దార్ కరుణశ్రీ

ప్రజాపక్షం వార్త కథనంకు స్పందన..

**ప్రజాపక్షం/కూసుమంచి :** ప్రజాపక్షం దినపత్రిక వార్తా కథను స్పందించిన కూసుమంచి తహసీల్దార్ డి.కరుణ శ్రీ ఇటీవల కాలంలో ప్రజాపక్షం దినపత్రికలో మంత్రి మాట పట్టించుకోని తహసీల్దార్ కథనానికి కూసుమంచి రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికీ రెండు దాఫాలుగా కదిలి మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన బాణాల రామలింగాచారి భూమిని సర్వే నెంబర్ 491లో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పక్క రైతులు సర్వే కు సహకరించ పోవడంతో నాలుగు రోజుల్లో వారి అభిప్రాయం తెలపాలని లేని పక్షంలో నక్షత్రం రెవెన్యూ చట్ట ప్రకారం చట్టబద్ధంగా రైతుకు దారి చూపి తీరుతామని ఆమె అన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో తాసిల్దార్ కరుణ శ్రీ తోపాటు సర్వేర్లు సిబ్బంది పాల్గొన్నారు. గత రెండు సంవత్సరాలుగా బీడు బారిన భూమికి కూసుమంచి రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి రైతుకు దారి ఏర్పాటు చేస్తున్నందున నేలపట్ల గ్రామంలోనూ, పరిసర ప్రాంత సాటి రైతుల నుండి రెవిన్యూ అధికారుల పట్ల ఆశాభావం వ్యక్తమై రెవెన్యూ సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నారు.



ప్రజాపక్షం ఎఫెక్ట్

## క్యాస్పైడర్ ఇంటర్వ్యూలో..
## ప్రియదర్శిని విద్యార్థినుల సత్తా

ప్రత్యేక అభినందనలు తెలిపిన

కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా పంచాయతీపరిధిలోని ప్రియదర్శిని మహిళల కళాశాల విద్యార్థినులు మంగళవారం నిర్వహించిన క్యాస్పైడర్ ఇంటర్వ్యూలో సత్తచాటారు. 160మంది విద్యార్థినులు నమోదు చేసుకోగా 90మంది విద్యార్థినులు గ్రూప్ డిష్కర్షన్‌లో అర్హతను సాధించారు. అందులో 40మంది విద్యార్థినులు రూ.3.5లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. కాగా వీరిని కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిగోపాల్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ...తమ కళాశాల విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థినులు సైతం తమ ఫ్యాకల్టి బోధనలను క్రమశిక్షణతో వింటూ తల్లిదండ్రుల ఆశలను నెరువేరుస్తుండటం తమకేంతో గర్వకారణం అన్నారు. చదువుకుంటున్న విద్యార్థినులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత ముందజలో దూసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకరమణ, వివిధ విభాగాల అధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట

**ప్రజాపక్షం/ ఖమ్మం బైపాస్‌రోడ్ :** ఖమ్మం నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట (ఐఏఎస్) మంగళవారం లెర్నింగ్ లైసెన్స్ పొందారు. లైసెన్స్ కోసం వచ్చిన ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట లైన్‌లో నిలబడి ఫోటోలు దిగి సంతకం చేశారు. ఓ సాధారణ వ్యక్తిగా ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా నిబంధనల ప్రకారం లైనులో నిలబడ్డారు. లైసెన్స్ కోసం వచ్చిన ట్రైనీ కలెక్టర్‌కు ఖమ్మం ఇంచార్జి ఆర్టివో వెంకటరమణ స్వాగతం పలికారు. ట్రైనీ కలెక్టర్‌కు సంబంధించి పత్రాలను తనిఖీ చేసి లెర్నింగ్ లైసెన్స్ జారీ చేశారు. ట్రైనీ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల విధి విధానాలను పరిశీలించారు.

## లొంగిపోయిన మావోయిస్టు దళసభ్యుడు

**ప్రజాపక్షం/భద్రాచలం :** నిషేదిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన దళ సభ్యుడు లొంగిపోయాడు. వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జీలొరుగడ్డ గ్రామానికి చెందిన మడివి అయిత సిఆర్‌పిఎఫ్ 14 బెటాలియన్, జిల్లా పోలీసుల ఎదుట మంగళవారం లొంగిపోయాడు. మావోయిస్టు నేత హిడ్మా నాయకత్వంలో నడిచే దళంలో సభ్యునిగా ఉంటూ ఆ రాష్ట్రంలో జరిగిన పలు రకాల హింసాత్మక కార్యక్రమాల్లో పాల్పంచుకున్నాడు. ఇటీవల బీజాపూర్ జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సిఆర్‌పిఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేస్తుండటంతో మావోయిస్టు పార్టీని విడిచి స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ మేరకు లొంగిపోయిన మావోయిస్టును ఎస్‌పి రోహిత్ రాజ్ మీడియా ముందుకు ప్రవేశపెట్టారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన దళ సభ్యులు అడవిని, ఆయుధాలను వీడి ప్రజా స్వామ్య బద్ధంగా ప్రజా హక్కుల కోసం పోరాడాలని సూచించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి సాధారణ జీవితం గడపాలనే వారు నేరుగా పోలీసులను సంప్రదించి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపున పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న నన్నపునేని దంపతులు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** తెలంగాణ రాష్ట్ర వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వాణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వర్ణగిరిలోని వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు నరేందర్ వాణి దంపతులకు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## జాతీయ బిసి సంక్షేమ సంఘం నర్సంపేట డివిజన్ అధికార ప్రతినిధిగా లింగయ్య



**ప్రజాపక్షం/ నర్సంపేట :** జాతీయ బిసి సంక్షేమ సంఘం నర్సంపేట డివిజన్ అధికార ప్రతినిధిగా గండిలింగయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు నీలారపు నరేందర్ యాదవ్‌లు తెలిపారు. గతంలో గండి లింగయ్య విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులుగా, పలు ప్రజా సంఘాలలో పనిచేశారని, పదవీ విరమణ పొందారన్నారు. మెరుగైనా సేవల కోసం నియమించడం జరిగిందన్నారు.అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు గండు రవి, డివిజన్ కార్యదర్శి సాంబరాతి మల్లేషం, సోల్తి రవి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. జనగామ మండలంలోని పెంబర్తి గ్రామంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండగా పరిశీలించారు. తేమ శాతాన్ని చూసి కొనుగోళ్లపై ఆరా తీశారు. ఎంత మంది రైతులు ఎంత ధాన్యం విక్రయించారు ఓపిఎంఎస్‌లో ఎంత మంది రైతుల వివరాలు నమోదు చేశారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 75 మంది రైతుల్లో 69 మంది రైతుల ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరిగిందని, 69 మంది రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. హమాలీలు తూకం వేస్తుండగా పరిశీలించారు. పరిశీలించిన వారిలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో పాటు ఆర్‌డిఓ గోపిరామ్, తహశీల్దార్,హుస్సేన్, వ్యవసాయ శాఖ అధికారులు, డిఎస్‌ఓ సరస్వతి, డిటిసిఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దళిత సాధన సమితి సభ్యులు బైండోవర్



**ప్రజాపక్షం/ కమలాపూర్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం కాలం విజయవంతం అయినందున హన్మకొండ జిల్లాలోని పలు కార్యక్రమాలకు సిఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు దళిత సాధన సమితి సభ్యులు పుల్ల శ్రీనివాస్, మాట్ల దినేష్, పున్నం చందర్, మాట్ల రాజు అనే నలుగురు సంఘ నాయకులను కమలాపూర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి విడుదల చేసినట్లు తెలిపారు.

## 10 బస్సులలో సిఎం సభకు మహిళలు




**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి మంగళవారం వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మహిళా సంఘాల ప్రతినిధులు వరంగల్ జిల్లా కేంద్రానికి తరల వెళ్లారు. 10 బస్సులలో సుమారు వేయి మంది మహిళలు, జీబులు, కార్లు, ఇతర వాహనాలలో పార్టీ శ్రేణులు వరంగల్ కు తల్లి వెళ్లారు. ప్రియతమ నాయకుడు రేవంత్ రెడ్డి సందేశం వినడం కోసం, నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి ని కలవడం కోసం, పార్టీ శ్రేణులు, ఉత్సాహంగా వరంగల్ కు తరలివెళ్లారు.

## జాఫర్‌గడ్ మండల కేంద్రం నుంచి..

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన విజయోత్సవ సభకు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశానుసారం జఫర్‌గడ్ మండల కేంద్రం నుండి సభకు నాయకులు బయల్దేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన కర్ణాకర్ రావు, నాయకులు మంచాల ఎల్లయ్య, అన్నబోయిన బిక్షపతి, గుజ్జర్ రాజు, మండల యాదగిరి, సుదర్శన్, అభి, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వేకు స్వచ్ఛందంగా సహకరిస్తున్న ప్రజలు



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కు ప్రజలు ప్రస్తుతం గ్రామాలలో స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని, సర్వే అధికారి యాకూబ్ రెడ్డి తెలిపారు. ప్రజలకు కొన్ని సోషల్ మీడియాలలో గతంలో వచ్చిన సందేశాలతో అపోహలతో సందిగ్ధంలో పడ్డ ప్ర జలు ప్రస్తుతం స్వచ్ఛందంగా సర్వేకు సహకరిస్తూ వారి వారి కుటుంబ వివరాలు తెలుపు చున్నారని ఆయన అన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా భేష జలాలకు పోకుండా గ్రామాలలో ప్రజలు సర్వేకు సహకరిస్తున్నారని సర్వేఅనుకున్నసమయానికిపూర్తిచేస్తామనేఆశభావాన్నిఆయనవ్యక్తం చేశారు.

# జ్ఞానాన్ని ప్రసాదించే దేవాలయాలే గ్రంథాలయాలు

**రాష్ట్ర మంత్రి సీతక్క**




**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** జ్ఞానాన్ని ప్రసాదించే దేవాలయాలే గ్రంథాలయాలని, ములుగు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని త్వరలోనే మోడల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం 57వ జాతీయ గ్రంథాలయ ఉత్సవాల ముగింపు సమావేశానికి మంత్రి సీతక్క, బానోత్ రవిచందర్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి హాజరై గ్రంథాలయంలో చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించి, నూతన టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రంథాలయ ఉత్సవాలలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని, బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందని వారు చేసిన సేవలను మంత్రి సీతక్క కొనియాడారు. ప్రతి గ్రామంలో విద్యాలయంతో పాటు గ్రంథాలయం కూడా ఉండాలని బడి ద్వారా మన బతుకులు కుటుంబాల భవిష్యత్తు, దేశ భవిష్యత్తు కూడా బడిలోనే నిర్మితం అవుతుందని అదేవిధంగా గ్రంథాలయాల ద్వారా జ్ఞానం లభిస్తుందని తెలిపారు. గ్రామాలలో ఉండే గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా స్థానిక ప్రజలు జ్ఞానవంతులు అవుతారని వారితో పాటు యువతకు ఉపాధి ఉద్యోగాలలో రాణించడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కాగానే కేవలం 10 నెలల కాలంలో 54 వేల మందికి ఉద్యోగాలు నియామక పత్రాలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డిడబ్ల్యూఒ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, మారుమూల ప్రాంతాలలోని చిన్న చిన్న తండాల అను సంధానం కోసం లింక్ రోడ్డుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ అన సూయ సీతక్క అన్నారు. మంగళవారం ములుగు మండలంలో రెండు కోట్ల ఇరవై లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న జాకారం నుండి ఇంచేర్వుపల్లి బిటి రోడ్డు రూ80 లక్షల నిధులతో నిర్మిస్తున్న వెంకటేశ్వర్లపల్లె నుండి మాడా లక్ష్మారెడ్డిపల్లె బిటి రోడ్డు రూ.80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ఆర్ అండ్‌బి రోడ్ నుండి ఏసునగర్ బిటి రోడ్డు, ఒక కోటి ఇరవై లక్షల రూ పాయల నిధులతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి దేవనగర్ వయా యా పలగడ్డ బిటి రోడ్డులను మంత్రి సీతక్క, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్‌లతో కలిసి మంత్రి సీతక్క ప్రా రంభించారు.జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, జిల్లా సంక్షేమాధికారి శిరీష, ములుగు ఎంపిడిఒ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

**ఎమ్మెల్యే గండ్ర**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** దేశం కోసం సర్వస్వం ధారపోసిన మహనీయురాలు, బ్యాంకుల జాతీయకరణ, 20 సూత్రాల కార్యక్రమం లాంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతిని పురస్కరించుకుని భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో పట్టణ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిధులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాశ్ రెడ్డి పాల్గొని ఇందిరా గాంధీ చిత్ర పటం, విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, ఇందిరాగాంధీ తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ దేశ సమగ్రత, సమైకత్య, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకుని ఆమె ముందుకు సాగారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ పాలనను ఆదర్శంగా తీసుకుందనీ, ఆ మహనీయురాలి స్ఫూర్తితోనే పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, పిప్పాల రాజేందర్, క్యాథరాజు సాంబమూర్తి, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, పృధ్వీరాజ్, మహేందర్, రంజిత్ నాయకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నూటెంకి భవ్య 'ఆర్ట్ గ్యాలరీ'

**మంత్ర ముగ్ధులైన మంత్రులు,ఎంపిలు,ఎమ్మెల్యేలు**



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇందిరా మహిళా శక్తి సభ సందర్భంగా హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలో నూటెంకి భవ్య వేసిన ఆర్ట్ చిత్రాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన నూటెంకి జయప్రభాకర్ దంపతుల కూతురు భవ్య ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భవ్య ఆర్ట్ గ్యాలరీ నీ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, ధనుసరి అనసూర్య (సీతక్క), వరంగల్ ఎంపి కడియం కావ్య, సేర్ప్ సిఇఒ దీపా దేవరాజన్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాజీ మే యర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ కలెక్టర్ సత్య శారదా, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డీస్ జగన్, ఇతర ప్రజా ప్రతినిధులు భవ్య ఆర్ట్ గ్యాలరీ నీ చూసి మంత్ర ముగ్దులు అయ్యారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా భవ్య వేసిన చిత్రాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవ్య పెన్సిల్ తో వేసిన సిఎం చిత్రపటాన్ని బహూకరించారు. ఐతే ఒక్కో చిత్రం జీవం ఉట్టి పడే విధంగా ఉన్నాయని సందర్శకులు కొనియాడారు. గత పది సంవత్సరాలుగా ఈ పెయింటింగ్స్ వేయడం జరుగుతున్నదని, భవ్య ప్రత్యక్ష సాక్షితో చెప్పారు. ఈ ఆర్ట్ కళను రానున్న రోజులలో చాలా మందికి నేర్పించాలని ఉందని, సిఎం ఏదైనా దారి చూపిస్తారని కోరడం జరిగిందని చెప్పారు. ముఖ్యమంత్రి స్వయంగా అభినందించడం గర్వంగా ఉందని నూటెంకి భవ్య తెలిపారు.

# ముమ్మరంగా ప్రజాపాలన కళా యాత్ర

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకల సందర్భంగా, తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్సెస్) కళాకారులు ప్రజాపాలన కళా యాత్ర కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ మరియు సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుండి వచ్చే నెల 7వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజపాలన కళాయాత్ర వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు నిర్వహణకు తయారు చేసున షెడ్యూల్ ప్రకారం ఎలాంటి డీవియేషన్ రాకుండా కళాయాత్ర కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై గ్రామ, మున్సిపల్ వార్డుల్లో విస్తృతంగా టీఎస్సెస్ కళాకారులు తమ ఆటా, పాటలు ద్వారా అవగాహన కల్పించడం ఈ కళా యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి రోజు మూడు గ్రామాల్లో ఆటపాటలు ప్రదర్శనలు నిర్వహించాలని అన్నారు. కనీసం గంటన్నర పాటు ప్రతి కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజల శ్రద్ధ ఆకర్షించేలా ప్రదర్శనలతో ప్రణాళిక రూపొందించామని, అట్టి ప్రణాళికలు ప్రకారం కళాయాత్ర నిర్వహించాలని సూచించారు. టీఎస్సెస్ కళాకారులు, గ్రామీణ ప్రజలను చైతన్యపరిచే విధంగా ప్రదర్శనలు అందించాలని, ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చేరువ చేసే విధంగా కళా ప్రదర్శనలు జరగాలని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రాధాన్యంతో కూడిన షెడ్యూల్ ప్రకారం యాత్రలు కొనసాగాలి. ప్రజాపాలన కళా యాత్రలో ప్రజలు, అధికారులు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలను మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఏదేని అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జిఎం.సిద్ధార్థ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం.రాములు, టిఎస్సెస్ కళాకారులు పాల్గొన్నారు.

## సిఎం సభకు జనగామ నుంచి భారీసంఖ్యలో మహిళలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం హన్మకొండలో నిర్వయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు జనగామ జిల్లా నుండి జనం భారీగా తరలి వెళ్లారు. జనగామ డిపో పరిధిలోని బస్సులు అన్నింటిని మహిళల్ని తరలించేందుకు కేటాయించగా వాటితో పాటు ప్రైయివేట్ వాహనాల్లోనూ భారీగా తరలి వెళ్లారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట, తరిగొప్పుల, నర్మెట చెందిన వారు చిల్పూర్ మీదుగా చిన్నపెండ్యాల నుండి తరలి వెళ్లగా, బచ్చన్నపేట, జనగామ, రఘునాథపల్లి, లింగాలఘనపురం, దేవరుప్పుల, పాలకుర్తికి చెందిన వారు స్టేషన్‌ఘనపూర్ మీదుగా తరలి వెళ్లారు. జనగామ నుండి వెళ్లె వాహనాలను జిల్లా పార్టీ కార్యాలయం వద్ద అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. స్టేషన్‌ఘనపూర్‌లో కడియం శ్రీహరి, పాలకుర్తిలో యశశ్వినిరెడ్డి ప్రారంభించారు. పెద్ద ఎత్తున మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధుల్ని తరలించడంలోనూ కాంగ్రెస్ శ్రేణులు నిమగ్నమై అనుకున్న మేరకు తరలించాయి. ముఖ్యమంత్రి సభకు తరలి వచ్చిన వారికి జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాపాలన విజయోత్సవ ప్రచార రథాలు ప్రారంభం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి** ప్రజాపాలన విజయోత్సవాలపై ఏ ర్పాటు చేసిన ప్రచార రథాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 19 నుండి డిసెంబర్ 7 వరకు తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళారూపాలతో ప్రభుత్వ పథకాల అ మలు, వాటి ప్రాధాన్యతను వివరిస్తూ ఈ వాహనా లు తిరుగుతాతయాన్నరు. జనగామ డివిజన్‌కు 11 మంది స్టేషన్‌ఘనపూర్ డివిజన్‌కు 10 మంది కళాకారులను ఏర్పాటు చేశామని, ప్లెక్సీలు, బ్యానర్లు, మైక్‌లతో ఈ ప్రచార వాహనాలు గ్రామాల్లో ప్రచారం నిర్వయిస్తాయన్నారు. ఆరు గ్యారెంటీల్లో బాగంగా ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళాశక్తి, గృహజ్యోతి, గృహలక్ష్మి, రైతు రుణమాఫి, ఇందిరమ్మ ఇండ్లు, యువతకు ఉద్యోగ అవకాశాలు, స్కిల్ యూనివర్సిటీ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు వంటి వాటిపై ప్రచారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబందాల అధికారి కె శ్రీనివాసరావు, సాంస్కృతిక సారధి కళాకారులు పాల్గొన్నారు.

## ఫార్మా కంపెనీ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఫార్మా కంపెనీ ప్రపోసల్స్ వెంటనే వెనక్కి తీసుకోవాలని జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లగచర్లలో ఫార్మా కంపెనీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు ఆందోళన చేస్తుండగా వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడం సరియైంది కాదన్నారు. గిరిజనులు మంగళవారం ఛలో కొడంగల్‌కు పిలుపునివ్వగా వారిని అదుపులోకి తీసుకోవడంతో మంగళవారం వారిని కలిశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గిరిజనుల అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్‌లు బల్లులు అడుగుతున్నారని అరెస్ట్ చేశారు, అందులో బాగంగా బిఆర్ఎస్ నాయకుల్ని సైతం అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఎక్కడ చూసినా బందోబస్తు, అమెరికా అధ్యక్షుడు వచ్చినా అంత బందోబస్తు ఉండదన్నారు. ప్రజలు అంటే బయపడుతున్నారని, బిఆర్ఎస్ తరుపున ప్రజలకు ఎప్పటికి అండగా ఉంటామన్నారు. గిరిజన నాయకులు ఆజ్మీరా స్వామి నాయక్, కౌన్సిలర్ వాంకుడోతు అనిత, శంకర్‌నాయక్‌తో పాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# డబుల్ బెడ్రూమ్ సమస్యలను పరిష్కరిస్తాం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేషాలపల్లిలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యపై డబుల్ బెడ్ రూమ్ కాలనీ అధ్యక్షుడు మేర సురేష్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. మంచినీటి సరఫరాకు సంబంధించిన పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు ఈ సమస్యలపై డబుల్ బెడ్ రూమ్ కమిటీ ఆధ్వర్యం లో విన్నవించడం జరిగిందని కాలనీలో ఉన్న మౌ లిక వసతుల కల్పనకు అన్ని చర్యలు చేపట్టి ఏ ర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భం గా కాలనీ వద్ద మంచినీటి సరఫరా కోసం ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ సంపును కలెక్టర్ పరిశీలించారు. సంపు నుండి నీటిని సరఫరా చేయడం కోసం కావలసిన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసి నీటి ని సరఫరా చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అట్లాగే కాలనిలో ఉన్న సమస్యలపై వెంటనే స్పందించిన కలెక్టర్‌కు కాలనీవాసులు డబుల్ బెడ్ రూమ్ కమిటీ అధ్యక్షుడు సురేష్ ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంటా ఆర్డీవో మంగీలాల్, కమిషనర్ రాజేశ్వర్, స్థానిక తహసిల్దార్ శ్రీనివాసులు, కాలనీ అధ్యక్షుడు మీరా సురేష్, సంబంధిత అధికారులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## సిఎం సభకు వాహనాలకు జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పాలకుర్తి:** హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో జరిగే ప్రజాపాలన విజయోత్సవ సభకు తరలివెళ్తున్న బస్సులను మంగళవారం జెండా ఊపి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమార్, మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్, వాగ్దేవి కళాశాల మధ్య అవగాహన ఒప్పందం



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** ఎస్ఆర్ యూనివర్సిటీ వరంగల్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వరంగల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు డాక్టర్ చింతకింది తెలిపారు. విద్యా, పరిశోధన, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని పెంపొందించడానికి రెండు విద్యా సంస్థల మధ్య సహకార భాగస్వామ్యాన్ని నెలకొల్పడం ఈ అవగాహన ఒప్పంద ఉద్దేశమన్నారు. సహకార పరిధోధన కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, అధ్యాపకుల పరిశోధన పర్యవేక్షకులుగా గుర్తించబడతారన్నారు. వారికి పూర్తి సమయం, పార్ట్‌టైం పీహెచ్‌డీ కేటాయించబడతారు. ఉమ్మడి సెమినార్లు, వర్క్‌షాపులు, కాన్ఫరెన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా క్రాస్ కల్చరల్ అవగాహన, విద్యా సంబంధమైన ఉపన్యాసాన్ని పెంపొందించడం, లైబ్రరీ వనరులు, డేటా బేస్, పరిశోధనా సౌకర్యాలు, ఇతర విద్యా సామాగ్రిని సాధ్యమైనపుడు పరస్పరం అంగీకరించినపుడు భాగస్వామ్యం చేయడంలో సహకరించడం జరుగుతుందన్నారు. ఈ ఎంఓయూ సంతక కార్యక్రమానికి ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ దీపక్ గార్గ్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్, వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్ సతకం చేసిన కాపీలను మార్చుకున్నారు. ఇరుపక్షాల ప్రతినిదులు డాక్టర్ బాలాజీ మారమ్, డాక్టర్ సందీప్ భట్టాచార్య, డాక్టర్ గిరిరాజన్, డాక్టర్ రేఖ గంగుల, డాక్టర్ నవీన్, డాక్టర్ దినేష్, డాక్టర్ మనోహర్, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




## డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సిఐ సురేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాలెంల గురుకుల డిగ్రీ కళాశాలలో ఎస్ఐ బాలు నాయక్‌తో కలిసి విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్ళతో జాగ్రత్తగా ఉండాలన్నారు. తమ బ్యాంకు ఖాతా, ఎటిఎం, ఓటిపి వంటి వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవదన్నారు. సైబర్ మోసాలపై 1930, విద్యార్థినిలు, మహిళలు వేధింపుకై 100కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ బాలు నాయక్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ నీల, షిటీం ఎఎస్ఐ సాలయ్య, భరోసా సిబ్బంది మౌనిక, శృతి, పోలీస్ సిబ్బంది వేణు, శోభ, కళాబృందం ఇన్‌చార్జీ యల్లయ్య, గోపయ్య, నాగార్జున, గురులింగం, చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడల వల్ల మానసికోల్లాసం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** క్రీడలు దివ్యాంగులకు మనోధైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని జిల్లా సంక్షేమ అధికారి కె నర్సింహ్మారావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖల ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. క్రీడలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు మానసికంగా కుంగిపోకుండా మనోధైర్యంగా ముందుకు సాగాలన్నారు. దీంతో ఏదైన సాధిస్తారన్నారు. దివ్యాంగులకు పరుగు పందెం, క్యారం, చెస్, షాట్ ఫుట్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు డిసెంబర్ 3న జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో బహుమతులను ప్రధానం చేస్తామన్నారు. దివ్యాంగ సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ ఓటుహక్కు నమోదు




**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని విద్యార్థులు ఓటు విలువలను తెలుసుకోవాలని కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. మంగళవారం కోదాడలోని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓటర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోని యువతి, యువకులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఓటు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరు ఓటుకు అర్హులేనని అన్నారు. సంబంధిత అధికారులు ఓటు నమోదు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ జాబితాలో ఇతర సవరణలకు కూడా అవకాశం ఉందన్నారు. ఓటుకు అర్హత ఉన్న వారు సంబంధిత బిఎల్‌వోలను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వాజిద్‌అలీ, ఎన్నికల డిటి అనిల్‌కుమార్, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు సైదమ్మ, జిఎల్‌వి న్‌రెడ్డి, రఫీ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ సక్సెస్‌కు కృషి




**ప్రజాపక్షం/(నల్లగొండ )కనగల్:** నల్లగొండ జిల్లా కేంద్రం లో డిసెంబర్ 30న జరగబోయే సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు అన్ని అధిక సంఖ్యలో తరలి రాలి వచ్చి విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం కనగల్ సిపిఐ మండల సమావేశం సోమవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 పార్టీ సభ్యత్వము పునరుద్ధరించి కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించాలని కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గంటా సత్యనారాయణ,దోటి పాండరి, తొారకొప్పుల నాగయ్య, బోగారి రామకోటి, తలారి లచ్చయ్య, జానయ్య, భైరగోని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల హామీలు ఇంకెప్పుడు అమలు?

**ప్రజాపక్షం/సూర్యాపేట:** కల్లుగీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కెజికెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవనంలో జిల్లా అధ్యక్షులు ఏనుగూరి గోవింద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కల్లుగీసేందుకు చెట్టు ఎక్కే క్రమంలో ఎంతో మంది జారిపడి వికలాంగులుగా మిగులుతున్నారని, మరికొందరు తమ ప్రాణాలను కొల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్మికులకు కాటమయ్య రక్ష సేఫ్టి కిట్టులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, నాయకులు అబ్బగాని భిక్షం, ఉయ్యాల నగేష్, జె కృష్ణ, నాగమల్లయ్య, సైదులు, కాశయ్య, పిచ్చయ్య, సిద్దయ్య, ఇస్తారి పాల్గొన్నారు.




## జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం రూ.15 వేలు

### ఐఎల్ నాయకుడు, సీనియర్ న్యాయవాది నారాయణరావు డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా జూనియర్ న్యాయవాదులకు రూ.15 వేలు ఉపకార వేతనం ఇవ్వాలని ఐఎల్ నాయకులు, సీనియర్ న్యాయవాది మునగాల నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) సమావేశం సీనియర్ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ ఐఎల్ కు దేశవ్యాప్తంగా ఘనమైన చరిత్ర ఉందన్నారు. న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు. అధికార భాష అయిన తెలుగును అన్ని కోర్టులో అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రెండవ తరగతి న్యాయవాది మిర్యాల రాజేందర్,అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్ లాల్ మాట్లాడుతూ ఇటీవల నూతనంగా అమలులోకి వచ్చిన బిఎన్ఎస్ఎస్ చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం న్యాయవాద రక్షణ చట్టంను రూపొందించాలని,41 సిఆర్‌పిసి, ప్రస్తుతం 35 బిఎన్ఎస్ఎస్ చట్టాలను ఎత్తివేయాలి, మూడు సంవత్సరాల లోపు సీనియారిటి ఉన్న జూనియర్ న్యాయవాదులకు రూ.15వేలు ఉపకార వేతనాలుఇవ్వాలి,అర్హులైన న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, న్యాయవాదులకు ఇన్సూరెన్స్,ఆరోగ్య భీమా,డెత్ బెనిఫిట్స్ 10 లక్షలు పెంచాలని తీర్మానం చేశారు. సమావేశంలో న్యాయవాదులు గోలి అమరేందర్ రెడ్డి,గుండె వెంకటేశ్వర్లు, కట్ట అనంతరెడ్డి, గుర్రం వెంకటరెడ్డి,పులి పాపయ్య,ఎండి నజీరుద్దీన్,బి నరసింహారావు, బరిగెల నగేష్, బొమ్మరబోయిన వెంకన్న, బరిగల వెంకటేష్,ఆవుల ప్రేమ్ సుందర్, అయిలేష్,భువనగిరి రవి ఉన్నారు.

### ఐఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కట్టా, కస్తాల





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) నల్లగొండ జిల్లా నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా కట్ట అనంతరెడ్డి,కస్తాల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మంగళవారం జరిగిన ఆ సంఘం జిల్లా మహాసభలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా మునగాల నారాయణరావు,గోలి అమరేందర్ రెడ్డి,గుండె వెంకటేశ్వర్లు,జి.జవహర్ లాల్,గౌరవ అధ్యక్షులు మల్లెపల్లి ఆదిరెడ్డి,కార్యనిర్వాక అధ్యక్షులుగా గుర్రం వెంకటరెడ్డి,ఉపాధ్యక్షులుగా పులి పాపయ్య,ఎండి నజీరుద్దీన్,బి.నర్సింహా రావు,బరిగెల నగేష్ ,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బరిగెల వెంకటేష్,కార్యదర్శి ఆవుల ప్రేమ్ సుందర్,ఏ అయిలేష్,కోశాధికారి బోనగిరి రవి తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కట్ట అనంతరెడ్డి మాట్లాడుతూ ఐఎఎల్ న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు.రాబోయే రోజుల్లో న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం అదేవిధంగా ఐఎఎల్ ఇచ్చిన కార్యాచరణ అమ లు చేస్తూ అందరికీ చేదోడు,వాదోడుగా ఉం టూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తాన్నారు. తమ పట్ల విశ్వాసంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఐఎల్ సభ్యులకు, న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు.

## మెరుగైన వైద్య చికిత్స అందించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భువనగిరి టౌన్‌లోని ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సునిశితంగా పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణంగా పరిశీలించారు. వైద్య సదుపాయాలు గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని, ఎంత మంది పేషంట్లు వస్తారని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. సమయపాలన పాటించని డాక్టర్లు, సిబ్బంది పై చర్యలు తప్పవని హెచ్చరించారు. అవుట్, ఇన్ పేషెంట్ రిజిష్టర్‌ను పరిశీలించడం జరిగింది. ఎమర్జెన్సీ వార్డును కలియ తిరిగారు. అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూడాలని, మందుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆసుపత్రికి వచ్చిన రోగుల శాంపిల్స్‌ను ప్రైవేట్ ల్యాబ్‌కు పంపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బెడ్ షీట్లు, పిల్లో కవర్‌లు పరిశుభ్రంగా లేనందున కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణలో పరిసరాల ప్రాంతాలు పరిశుభ్రంగా లేనందున శానిటేషన్ సూపర్వైజర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శానిటేషన్ ఏజెన్సీకి మెమో జారీ చేశారు. తీరు మారకపోతే తొలగించడం జరుగుతుందని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పేషంట్లతో వచ్చే వారికి మౌలిక వసతులు లేవని ప్రశ్నిస్తూ వారికి వెంటనే మౌలిక సదుపాయాలను కల్పించాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. వీల్ చైర్స్ లేక ఇబ్బంది పడుతున్నం అని పేషంట్స్ తెలిపినందున వెంటనే ఎండీ టిజిఎంఐడిసితో ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే జిల్లా ఆసుపత్రికి వీల్ చైర్స్ పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి మనోహర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజరామ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నాణ్యమైన మొక్కలతోనే మంచి దిగుబడి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవర్

**ప్రజాపక్షం/మునగాల:** జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగు చేసేరైతులు నాణ్యమైన మొక్కలను అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవర్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో పతంజలి ఆయిల్‌ఫామ్ కంపెనీవారు పెంచుతున్న నర్సరీని కలెక్టర్ అకస్మికతంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ నర్సరికీ ఇతర దేశాల నుండి వచ్చే మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, మెలుకువలు తదితర అంశాలపై క్షుణంగా పరిశీలించారు. నాణ్యతలేని మొక్కలను గుర్తించి నర్సరీలోనే కాల్చివేయాలని చెప్పారు. రైతులకు అరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను సరఫరా చేసినట్లు అయితే మంచి దిగుబడులు సాధిస్తారని అన్నారు. మొక్కల పెంపకంలో అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య, సాంకేతిక ఉద్యాన అధికారి మహేష్, పతంజలి డిజిఎం బి.యాదగిరి, మేనేజర్ హరిష్, నర్సరి ఆఫీసర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వశక్తితో రాణించాలి: డిఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో రాణించాలని సూర్యాపేట డిఎస్‌పి రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత మున్సిపల్ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డివైజ్ ఇంటిరియల్ అండ్ ఎక్ట్సిరియల్ సోల్యూషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిర్వహకులు నమ్మకంతో తమ వ్యాపారాలను నిర్వహించాలని, నాణ్యతతో పని చేసి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. నిర్వహకులు మహ్మద్ ఇమ్రాన్, లక్ష్మీ కాంత్, తరుణ్‌లు మాట్లాడుతూ నూతన గృహాలకు కలర్‌లతో పని లేకుండా తక్కువ ఖర్చుతో తమ ఇంటిరియల్ ద్వారా హైక్లాస్ లుక్కు ఇస్తామన్నారు. సిలిలింగ్, టీవి యూనిట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. తుప్పు పట్టకుండా తక్కువ ధరలో వచ్చే డివైజ్ ఇంటిరియల్ సోల్యూషన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి వెంకట్, మదూరి వామన శ్రీధర్, ముక్కిడి బాలు గౌడ్, స్వామి గౌడ్, అఖిల్, రాహుల్, ప్రసన్న, మహేష్ పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు




**ప్రజాపక్షం/చండూరు:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అన్నారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో నిర్వహించిన సిపిఐ మండల కార్యవర్గ సభ్యుల సమావేశానికి రామలింగయ్య ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని అన్నారు. పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని సరైన మద్దతు ధరను పొందాలన్నారు. డిసెంబర్ 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగు సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు , బరిగెల వెంకటేశం , దోటి వెంకన్న, బండమీది వెంకటేశం పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా : ఇద్దరు అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత కొంతకాలంగా మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం స్తానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మందపాటి నరసింహారావు, కల్లూరి లింగయ్యలు మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్నారు. గత అక్టోబర్ 24న దామరచర్ల గ్రామ శివారులోని అశోక్ లేలాండ్ మినీ గూడ్స్ వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో అందులోని కూలీలు గాయపడగా దాచేపల్లి గ్రామానికి చెందిన షేక్ నాగుల్ అనే కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో డ్రైవర్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం మందపాటి నరసింహారావు, కల్లూరి లింగయ్యలు వాడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోగా వారిని విచారించడంతో తెలంగాణ రాష్ట్రంలో బియ్యం కొనుగోలు చేసి ఆంధ్రాకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, ఎస్ఐలు హరికృష్ణ, శేఖర్‌లు ఉన్నారు.

## రైతులు ఎవ్వరూ నష్టపోవద్దు



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో ఐకెపి, పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సంగెంలోని ధాన్యలక్ష్మి పార్ బాయిల్డ్ రైస్ మిల్‌ను రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశిలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులను ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఏ ఒక్క రైతు కూడా నష్టపోవడానికి వీలు లేదని, దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. రైతుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తెచ్చిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా లేదా అని సంబంధిత రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో ఉన్న ధాన్యలక్ష్మి పార్ బాయిల్ రైస్ మిల్లును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికపుడు అన్లోడ్ చేసుకోవాలని, ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది కలగకుండా మిల్లర్లు అప్పటికప్పుడే కొనుగోలు చేయాలన్నారు. మిల్లర్లు దిగుమతులలో జాప్యం లేకుండా చూడాలని రైస్ మిల్లర్లకు ఆదేశించారు. ఏమైనా సమస్యలు వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## కేసు నమోదైనా చర్యలేవి?

### ఆ అధికారిని కాపాడడంలో అంతర్యం!

### ఉన్నతాధికారుల తీరును తప్పుపడుతున్న ప్రజలు



ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
కంచే...చేను మేస్తోంది...!

**ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమ రవాణాదారులతో చేతులు కలిపి పోలీసులకు చిక్కి కేసు నమోదైన తుంగతుర్తి సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ విజయశేఖర్ పై ఉన్నతాధికారులు నేటికీ చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారుల తీరును జిల్లా ప్రజలు తప్పు పడుతున్నారు.**

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్ మండల పోలీసులు గత 17న సూర్యాపేట దంతాలపల్లి రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటాఎసి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాల ప్రజాపంపిణీ బియ్యాన్ని పట్టుకున్న విషయం అందరికి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన స్థానిక పోలీసులు మద్దిరాల మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ గూడ వెంకట్ రెడ్డి ప్రజాపంపిణీ దుకాణం నుండి ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ రోడ్డులోని కాసం రమేష్ అనే వ్యాపారికి చెందిన లక్ష్మీ మోడ్రన్ రైస్ మిల్లుకు ఈ బియాన్ని తరలిస్తున్నట్లుగా నిర్ధారించారు. ఈ కేసులో లోతుగా దర్యాప్తు జరిగిన అధికారులు తుంగతుర్తి సివిల్ సప్లయి డిప్యూటి తహసీల్దార్ విజయ శేఖర్ ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించారు. అక్రమ రవాణాదారులతో ఆయన కుమ్మకై గతంలో సీజ్ చేసిన బియ్యాన్ని తిరిగి రిలీజ్ చేస్తున్నట్లుగా ఆర్డర్ కాపీ సృష్టించి డీలర్ వెంకట్ రెడ్డి వద్ద ఉన్న 30 క్వింటాల ప్రజాపంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో విజయ శేఖర్‌ను ఏ5 నిందితుడిగా చేర్చారు. అతనిపై 420 చిటింగ్ కేసు, ఎస్ఎస్ఎస్ కమ్యూనిటి యాక్ట్, ఆర్గనైజ్డ్ క్రైం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని పోలీసుల నుండి మొదలుకోని సివిల్ సప్లయి శాఖ అధికారులు బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. దీంతో ఈ విషయం ప్రజాపక్షం దృష్టికి రాగా ఈనెల 9న "కంచే... చేను మేస్తోంది...!" , సివిల్ సప్లయిలో అవినీతి దొంగలు, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాలో అధికారుల పాత్ర..., పోలీస్ విచారణలో వెలుగులోకి అంటూ మెయిన్‌లో వార్త కథనాన్ని ప్రచురించింది. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకుతిరిగాడు. చివరకు హైకోర్టును ఆశ్రయించి గత ఐదు రోజుల క్రితం ముందస్తు బెయిల్ పొందాడు. ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాలో తుంగతుర్తి డిప్యూటి తహసీల్దార్ విజయ శేఖర్ ప్రమేయం ఉందని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలుపుతూ నూతనకల్ పోలీసులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో పాటు జిల్లా సివిల్ సప్లయి శాఖ ఉన్నతాధికారి రాజేశ్వర్‌కు లిఖితపూర్వకమైన సమాచారాన్ని పంపారు. అయిన సదరు అధికారిపై నేటి వరకు వారు ఏలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే విషయమై జిల్లా సివిల్ సప్లయి అధికారి రాజశ్వర్‌ను వివరణ కోరగా పోలీసులు కేసు నమోదైన విషయం తమ దృష్టికి రాలేదని, తమకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవ్వడంతో మెమో జారీ చేసినట్లు చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అతడు విధులకు గైర్హాజరవ్వడం కేసులో ఇరుక్కొని తప్పించుకు తిరిగాడన్న నిజం వారికి తెలిసినా.. దాని ఉసెత్తకపోవడం గమనార్హం. ఈ అవినీతి అధికారిని కాపాదేందుకు ఉన్నతాధికారులు కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలను జిల్లా ప్రజలు తప్పు పడుతున్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొంత మంది ప్రజాప్రతినిధుల వత్తిడికి తలొగ్గి ఇలా చేస్తున్నట్లు అదే శాఖలో పని చేస్తున్న కొంత మంది ఉద్యోగులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఏ చిన్న తప్పు జరిగిన స్పందించే జిల్లా కలెక్టర్ సైతం ఈ విషయంలో మౌనంగా ఉండడం విస్మయానికి గురి చేస్తుంది. ఇప్పటికైన అవినీతి అధికారిపై జిల్లా ఉన్నతాధికారులు వేటు వేస్తారా.. లేదా అన్నది వేచి చూడాల్సిందే.

## రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

**ప్రజాపక్షం / గద్వాల :** పత్తి కొనుగోళ్ళలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని వెంటనే టోకెన్లు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం ఉండవెల్లి శివారులోని వరసిద్ధి వినాయక పత్తిమిల్లు ఏర్పాటు చేసిన సిసిఐ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనికీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మిల్లులో తెచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించాలని తేమ శాతాన్ని తేమ మీటర్‌తో తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు పత్తిని ఆరబెట్టుకొని తేవాలని అప్పుడే రైతులకు గిట్టుబాటు ధర వస్తుందని అన్నారు.ప్రతి వారం నిర్దేశించిన ప్రకారం వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. ఈ జాబితాను మార్కెటింగ్ అధికారి,పోలీసు శాఖ, సిసిఐ అధికారులకు ,మిల్లర్లకు,అందజేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ,జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్,అలంపూర్ మర్కెట్ యార్డు చైర్మెన్ దొడ్డెప్ప, సిసిఐ ప్రతినిధి గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో ప్రజాపాలన కళాయాత్ర ను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు నవంబర్ 19 నుండి డిసెంబర్ 7 వరకు ప్రతి రోజు 3 గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం గావించనున్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శంకర్, తెలంగాణ సమగ్ర శిక్షా సిఎంఓ బాలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్ ఆఫీస్‌పై ఏసిబి దాడి

పట్టుబడ్డ ఎంఆర్ఓ, పరారైన గిర్దావర్



**ప్రజాపక్షం/అంతర్గాము :** ఇసుక ట్రాక్టర్ వదిలిపెట్టేందుకు రూ.12 వేలు లంచం తీసుకుంటూ పెద్దపల్లి జిల్లా అంతర్గాము మండల తహసీల్దార్ ఉయ్యాల రమేష్, గిర్దావర్2 ఎగ్గిడి శ్రీధర్‌లు అవినీతి నిరోధకశాఖకు పట్టుబడిన సంఘటన మంగళవారం చోటు చేసుకున్నది. బాధితుడు ఆలకుంట మహేష్, అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లింగాపూర్ వద్ద ఇసుక తరలింపుకు వచ్చిన రామగుండము పట్టణం రాంమందిర్ ఏరియాకు చెందిన అలకుంట మహేష్ ట్రాక్టర్ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్ వదిలిపెట్టాలంటే కేసుకు రూ.20 వేలు చొప్పున 5 కేసులకు కలిపి రూ.లక్ష జరిమానా చెల్లించాలని తహసీల్దార్ చెప్పాడు. తాను కొత్తగా ట్రాక్టర్ కొనుగోలు చేసి 2 నెలలే అయిందని, అంతా డబ్బు తాను ఇచ్చుకోలేనని తహసీల్దార్‌ను మహేష్ బతిమిలాడాడు. 10 రోజులు కార్యాలయం చుట్టూ తిరిగాక రూ.25వేలు జరినామా కట్టాలనడంతో చెల్లించాడు. ఐన ఇంకా రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.12 వేలు ఇస్తాననడంతో ఒప్పుకున్నారు. అధికారుల వేధింపులపై బాధితుడు కరీంనగర్‌లోని ఏసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం ఏసిబిఅధికారులు మహేష్ దుస్తులకు చిన్న కెమెరా, 2 వాయిస్ రికార్డు మైక్‌లు అమర్చి రూ.12 వేలు ఇచ్చి కార్యాలయంలోకి పంపించారు. డబ్బులు గిర్దావర్ శ్రీధర్‌కు ఇవ్వాలని తహసీల్దార్ చెప్పడంతో అతడి వద్దకు వెళ్లి డబ్బులు ఇచ్చాడు. మహేష్ వెనుకాల వచ్చిన ఓ కానిస్టేబుల్ శ్రీధర్‌ను పట్టనేందుకు ప్రయత్నించగా తీసుకున్న డబ్బులు కార్యాలయ మెట్లపై పడేసి పరారయ్యాడు. ఈ క్రమంలోనే ఏసిబి డిఎస్‌పి వి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో సిఐలు కృష్ణకుమార్, తిరుపతిలు తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అధికారులు మూడు గంటలకుపైగా విచారణ జరిపారు. బాధితుడు ఆలకుంట మహేష్ ఫిర్యాదు మేరకు తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకొని డబ్బును స్వాధీనం చేసుకున్నామని విచారణ జరుపుతున్నట్లు రమణమూర్తి తెలిపారు. కాగా, తహసీల్దార్ రమేష్ ఏసిబికి పట్టుబడటం ఇది రెండోసారని, ధర్మారం మండలంలో పనిచేస్తున్నప్పుడు లంచం తీసుకుంటూ పట్టుబడినట్లు సిబ్బంది చెబుతున్నారు.

## వేతనాల చెల్లింపులో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లింపులో అన్యాయం జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం రాత్రి గోదావరిఖని భాస్కర్‌రావు భవన్లో జరిగిన సివిల్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పనికి తగ్గ వేతనాలు యాజమాన్యం చెల్లించడం లేదని, దీనిపై ఈనెల 28న జరిగే స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు సంకె అశోక్, వెంకట రెడ్డి, బిట్టి వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాస్ మరియు సింగరేణి సివిల్ కాంట్రాక్ట్ కార్మిక నాయకులు బి రాజయ్య, పోషం, హరికృష్ణ, రామాంజన్, సతీష్, శంకర్ వీరాచారి, మధు, రవీందర్, రమేష్ అజయ్ పాల్గొన్నారు.

## ఎస్ఓటూ జిఎంను సన్మానించిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీవన్‌కు బదిలీపై వచ్చిన ఎస్ ఓ టూ జిఎం గోపాల్ సింగ్‌ను గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు ఆర్జీ వన్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకె అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్, నాయకులు బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, సోహెల్, నాయిని శంకర్, రెడ్డి వెంకట స్వామి, గుర్రం ప్రభుదాస్, ఆజీం తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం

పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కె.లక్ష్మి నారాయణ అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య శంకరమ్మకు సంక్షేమ నిధి చెక్‌ను మంగళవారం రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీ ఎం.శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అమర పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన బెనిఫిట్లను తక్షణమే అందజేసే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, సూపరిండెంట్ సంధ్య, జూనియర్ అసిస్టెంట్ నజియా ఇరమ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి, కమాన్పూర్ మండలాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ డి. వేణు మంగళవారం సందర్శించారు. రామగిరి మండల కేంద్రంలోని కలవచర్ల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని, కమాన్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వాసంతితో కలిసి ఆయన పరిశీలించారు. కొనుగోళ్ల నిర్వహణ తీరు అడిగి తెలుసుకుని కొనుగోళ్ల నిర్వహణ జాప్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. అనంతరం రామగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ యజ్ఞంపట్ల మానస, ఆర్ఐలు, కే.మహేష్, నిహారిక, సర్వేయర్ రాధిక కార్యాల సిబ్బంది ఉన్నారు.

# రైతులకు తోడ్పడేలా సహకార సంఘాలు

లక్ష్మీ కాంతరావు సేవలు మరిచి పోలేనివి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సహకార సంఘాలు రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని, వాటికి అనుగుణంగా సంఘం అధ్యక్షుడు రైతులకు సంఘం ద్వారా సేవలు అందించే విధంగా పనిచేయాలని రాష్ట్ర బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన సహకార సంఘం భవనం ప్రారంభోత్సంతో పాటు సంఘ వ్యవస్థపాకుడు బొప్పరాజు లక్ష్మి కాంతరావు విగ్రహాన్ని మంత్రి పొన్నం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా సహకార వారోత్సవాల సందర్భంగా రూ.2కోట్ల నాబార్డు నిధులతో నూతన భవనం ఏర్పాటు చేసుకోవడం శభ సూచకమన్నారు. 1959 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే, హుస్నాబాద్ ప్రాంత ప్రజలు మరిచిపోలేని మహానాయకుడు లక్ష్మి కాంతారావు సహకార సంఘం ఏర్పాటు చేశారని తెలిపారు. ఆనాడు సహకార రంగం అంటే రైతులకు సంబంధించి విద్యార్థి నాయకుడిగా నాకు కరీంనగర్ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారన్నారు. ఒకప్పుడు సహకార సంఘం అంటే ఎవరు నమ్మే పరిస్థితి లేదన్నారు. సహకార రంగంలో రైతు బిడ్డగా, మార్క్‌ఫెడ్ చైర్మన్ అయ్యానన్నారు. ఆనాడు ఐదేళ్ల కాలపరిధిలో మార్క్‌ఫెడ్ సంస్థలో నాపేరు నిలిచి పోయేలా పని చేశానని మంత్రి పొన్నం తెలిపారు. హుస్నాబాద్ సహకార సంఘాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసి తీరుతానని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. చౌటపెల్లిలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి అందులో షీడ్ ప్రాసెసింగ్ యునిట్స్, రైస్ మిల్లు ఏర్పాటు చేస్తామన్నారు. హుస్నాబాద్ సహకారం సంఘం నుండి నేటికి రూ.504 కోట్ల రుణమాఫీ చేసిందని, 204మంది రైతులకు ప్రయోజనం చేకూర్చిందని పేర్కొన్నారు. బొప్పరాజు లక్ష్మి కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు దేశిని చిన్నమల్లయ్య, బొమ్మ వెంకన్న, విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంత నుంచిరెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన సతీష్‌బాబు ఏ సలహా ఇచ్చిన స్వీకరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా పని చేద్దాం, చరిత్రలో నిలిచి పోయే అభివృద్ధి సాధిద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముల్కనూర్ సహకార సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు రవీందర్‌రావు, తెలంగాణ కోపరేటీవ్ యునియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, సెట్విన్ చైర్మన్ గిరిధర్, సింగిల్ విండో చైర్మన్ బొల్లిశెల్లిశెట్టి శివయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్మన్ అకుల రజిత వెంకన్న, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ప్రతిభ, స్ఫూర్తి పలువురికి ఆదర్శం



కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ సునీల్‌రావు



కళాభారతి మరమ్మతు పనులు పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దివ్యాంగుల చాటుతున్న ప్రతిభ, స్ఫూర్తి పలువురికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, నగర మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. వచ్చే నెల 3న దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటలు, క్రీడా పోటీలు నిర్వహించారు. మహిళలు పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర మేయర్ వై.సునీల్‌రావు, కలెక్టర్ పమేలా సత్పతి హాజరై జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, మేయర్ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ సంధర్భంగా దివ్యాంగ విద్యార్థులు పాడిన పాటలు, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డిఇఒ జనార్దన్‌రావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, మాజీమేయర్ రవీందర్‌సింగ్, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు పెండ్యాల కేశవరెడ్డి, లయన్స్ క్లబ్ బాధ్యులు చిరుదం సురేష్, పారెళ్ల శ్రీనివాస్, శరత్ కృష్ణ, సిడిపిఒలు సబిత, కస్తూరి, శ్రీమతి పాల్గొన్నారు.

నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియం ఆధునీకరణ పనులను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు, వేదిక, పార్కింగ స్థలం, సీట్ల సంఖ్య వివిధ సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయ్, ఇంజనీర్ యాదగిరి పాల్గొన్నారు.

### ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి అని, ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సంధర్భంగా యునిసెఫ్ ఆధ్వర్యంలో మానకొండూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన ఊరంతటికీ ప్రమాదకరమన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కలిగించాలని విద్యార్థులను కోరారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఎంపిడిఒ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సంధర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు నగరంలోని ఇందిరాచౌక్ వద్ద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోడూరు సత్యనారాయణ గౌడ్, ఆరెపల్లి మోహన్, నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగర కాంగ్రెస్ ఆద్వర్యంలో ఇందిరాచౌక్ వద్ద వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఎన్నో సంస్కరణలు తెచ్చిన ఘనత ఇందిరాగాంధీది అన్నారు. కార్యక్రమంలో వైద్యుల అంజన్‌కుమార్, ఎండి తాజ్, గడ్డం విలాస్‌రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, కొరివి అరుణ్‌కుమార్, అబ్దుల్ రహమాన్, గుండాటి శ్రీనినివాస్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, అర్ష మల్లేశం, నిహాల్, ఇర్ఫాన్, లింగంపల్లి బాబు, అహ్మద్ అలీ, కుర్ర పోచయ్య, ములకల ప్రవీణ్, పడిశెట్టి భూమయ్య, విక్టర్, సలీముద్దీన్, వంగల విద్యాసాగర్, కలువల రాంచందర్, కంకణాల అనిల్ కుమార్‌గుప్తా, నాగుల సతీష్, మొసర్ల రాంరెడ్డి, మూల రవీందర్‌రెడ్డి, దన్న సింగ్, అబ్దుల్ బారి, ఇమ్రాన్, వసీం, మూల జయపాల్, చింతల కిషన్, గంగుల దిలీప్, దీకొండ శేఖర్, నెల్లి నరేష్, దండి రవీందర్ తదితరులున్నారు.




## ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** దివంగత ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జగిత్యాలలోని ఇందిరా భవన్లో మంగళవారం నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీర వనిత ఇందిర గాంధీ అన్నారు. బ్యాంకుల జాతీయకరణ, జాతీయ ఆహార భద్రత చట్టంను తీసుకువచ్చిన ఘనత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. గరీబ్ హఠావో నినాదం తో ముందుకు వెళ్ళిన వీర వనిత అని, దేశ ప్రతిష్ఠతను ఇనుమడింప చేశారని కొనియాడారు. భూసంస్కరణలు చేపట్టి సాగు చేస్తున్న రైతులకు భూమిపై హక్కు కల్పించారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, తాటిపర్తి శోభారాణి, దుర్గయ్య, నక్క జీవన్, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, ముస్కు దామోదర్ రెడ్డి, అల్లాల రమేష్ రావు, మన్సూర్, పుప్పాల అశోక్, చిట్ల అంజన్న, తాటిపర్తి పరిక్షిత్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, ధర రమేష్, నేహాల్, మహంకాళి రాజన్న, కమటాల శ్రీనివాస్, పిప్పరి అనిత, బొల్లి శేఖర్ పాల్గొన్నారు.



## విద్యార్థుల విద్యాసామర్థ్యాల పెంపునకు కృషి



పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ధాన్యం వివరాలు ఒపిఎంఎస్ నమోదు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కనీస విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం పెద్దపల్లి మండలంలో రాఘవపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా చూడాలని, ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించి చదవడం, రాయడం, చదివింది అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలు ఉండేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### 1503 రైతులకు బోనస్ కింద 5 కోట్ల 91 లక్షల చెల్లింపు

పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 1503 మంది రైతుల నుండి లక్ష 18 వేల 260 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి 5 కోట్ల 91 లక్షల 30 వేల 600 రూపాయల బోనస్ చెల్లించామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సన్న రకం దాన్యం ప్రత్యేకంగా కొనుగోలు చేస్తున్నామని, ప్రతి క్వింటాల్ సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట, మైదంబండ, ముత్తారం గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శ్రీహర్ష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఒపిఎంఎస్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు రిజిస్టర్‌లను పరిశీలించారు. 17 శాతం తేమ రాగానే వడ్లకు కాంటా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### కెజిబివి పాఠశాలను సందర్శించిన కలెక్టర్

ముత్తారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారుజ వారితో మాట్లాడి సమస్యలు ఉన్నాయా అని అడిగారు. పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ వద్ద నీరు నిల్వ ఉండకుండా సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, ముత్తారం ఎంపిడిఒ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ షఫీ మహమ్మద్, ఐకెపి ఎపిఎం పద్మ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిఇఒ ప్రసాద్‌గౌడ్, గుజ్జుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సభకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ గుడి చెరువులో సిద్ధమైన సభా ప్రాంగణం..

పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన

యారన్ డిపో ప్రారంభోత్సవం

గల్ఫ్ బాధితులకు చెక్కుల పంపిణీ

రోడ్ల వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం

**ప్రజాపక్షం/వేములవాడ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా వేములవాడ పట్టణంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం జిల్లా పర్యటన మొదలై, మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. ముందుగా సిఎం రేవంత్ రెడ్డి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. స్వామివారికి మొక్కులు చెక్కిలించుకున్న అనంతరం అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో చర్చిస్తారు. అక్కడి నుంచి వేములవాడ గుడి చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం చేరుకుంటారు. సభాస్థలి వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా అధికారులు సమన్వయంతో పని చేసి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా పని చేయాలని కోరారు. షామియానా, బారికేడింగ్ చేసి భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. శానిటేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్లు సమకూర్చాలని, ఒక్కో గ్యాలరీలో మానిటరింగ్ చేసేందుకు ఒక మండల స్థాయి అధికారి ఉంటారని పేర్కొన్నారు. బహిరంగ సభ కోసం బస్సులను సమకూర్చాలని సూచించారు. అన్నిప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేలా చూడాలన్నారు.



### పర్యటనకు గట్టి భద్రత

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల :** ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సిఎం పర్యటన నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై సిఎం సెక్యూరిటీ సిబ్బంది, పోలీస్ అధికారులు ఇతర శాఖల అధికారులతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం వేములవాడలోని ఆలయ పరిసరాలకు సిఎం రేవంత్‌రెడ్డి చేరుకుంటారని, అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. వేములవాడ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. వేములవాడలో చేపట్టే శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు, మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల పనులకు, యారన్ డిపో నిర్మాణ పనులకు, మూలవాగు బ్రిడ్జి నుండి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణ పనులకు, వైద్య కళాశాల, హస్టల్ బ్లాక్ నిర్మాణ పనులకు, కోనరావుపేట మండలంలో చేపట్టే హైలెవల్ బ్రిడ్జి పనులు, మూడు కోట్లతో నిర్మించే డ్రైన్ పనులు మొదలగు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంఖుస్థాపన చేయనున్నారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మించిన ఎస్పీ భవనాన్ని, వేములవాడలో నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనం, వర్కింగ్ ఉమెన్ హస్టల్ భవనాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా గల్ఫ్ దేశాలలో మరణించిన 17 మంది కుటుంబాలకు పరిహారం, శివ శక్తి మహిళా సంఘాలకు రుణాల చెక్కు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

### 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు : ఎస్పి

**వేములవాడ టౌన్:** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పి అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో బందోబస్తు అధికారులకు, సిబ్బందికి విధులపై ఎస్పి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బందోబస్తును సెక్టార్లగా విభజించి అడిషనల్ ఎస్పి, డిఎస్పి, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించడం జరిగిందన్నారు. బందోబస్త్ కి వచ్చిన పోలీస్ అధికారులకు,సిబ్బందికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.





## సమస్యల పరిష్కారమే ఎఐటియుసి లక్ష్యం



**ప్రజాపక్షం/ మందమర్రి :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఎఐటియుసి నిరంతరం పోరాటం చేస్తుందని, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎల్లవేళల కృషి చేస్తుందని ఎఐటియుసి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని వర్క్ షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ఈనెల 28వ తేదీన గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి అధికారుల సమక్షంలో కొత్తగూడెంలో స్ట్రక్చర్ సమావేశం జరుగుతుందని ఆ సమావేశంలో అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వర్క్ షాప్ పై ఇన్‌కమ్ టాక్స్ కోల్ ఇండియాలో మాదిరిగా యాజమాన్యమే చెల్లించేలా, సొంతింటి కల సాకారం అయ్యేలా మొదలగు వివిధ సమస్యలపై కొత్తగూడెంలో మీటింగ్ జరుగుతుందన్నారు. అదేవిధంగా మందమర్రి ఏరియా స్ట్రక్చర్ సమావేశం త్వరలో జరుపుతామని, స్థానికంగా ఉండేటటువంటి సివిల్ డిపార్ట్మెంట్ ఏరియా వర్క్ షాపు మరమ్మతులు, కాలనీ సమస్యలు వంటి వాటిపై జిఎం ఆఫీసులో ఏరియా స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా నాయకులు తిరుపతి, వర్కర్ మెన్ ఇన్స్పెక్టర్ ములకలపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 22న మహిళా సమాఖ్య జిల్లా మహాసభ

సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాల్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** సదాశివపేట లో ఈ నెల 22న తేదీన జరిగే మహిళా సమాఖ్య జిల్లా మహాసభను ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొని సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాల్ పిలుపు నిచ్చారు. ఈ రోజు మహిళా సమాఖ్య ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఈ విధంగా పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా ,ఆర్థికంగా ఎదగాలన్నారు. వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో 33 శాతం రిజర్వేషన్ రిజర్వేషన్లు అమలుపై కేంద్రంతో పోరాడాలన్నారు. చట్టసభల్లో 50 శాతం మహిళలు రిజర్వేషన్ల అమలు ఏ విధంగా పోరాడి సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్ .లక్ష్మి ,సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్, బుజ్జమ్మ, యాదమ్మ, కళావతి ,శంకరమ్మ, ముంగి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై అఘాయిత్యాలు ఆపాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను పెరుగుతున్న అత్యాచారాలను ఆపాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.స్వరూపరాణి అన్నారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.స్వరూపరాణి మాట్లాడారు. మహిళలపై దేశంలో రోజురోజుకు పెరుగుతున్న అత్యాచారాలను ఆపాలని మహిళలకు నిర్భయ లాంటి ఎన్నో చట్టాలున్న రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలకు రాజకీయ విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంట్‌లో గీతా ముఖర్జీ మహిళా బిల్లు ప్రవేశపెట్టారని పాలకులు మాత్రం మహిళా బిల్లును వాయిదా వేస్తూ ఎన్నికల్లో పబ్బం గడుపుతున్నారన్నారు. పార్లమెంట్ చట్టం చేసిన విధంగా అన్ని రంగాలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశానంతరం శించి రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులుగా బూసమ్మ, జిల్లా కార్యదర్శిగా పి.సుధారాణి అవకాశం కల్పించారు. సదస్సులో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నాయకులు జయమ్మ, రేవతి, లలిత, పవిత్ర, సావిత్రి, భారతి, పల్లవి పాల్గొన్నారు.

## దివ్యాంగులు వైకల్యానికి కుంగి పోవద్దు

జాతీయ దివ్యాంగుల క్రీడలు ప్రారంభించిన కలెక్టర్ క్రాంతి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** దివ్యాంగులు తమ అంగవైకల్యం ను చూసి కుంగిపోవద్దని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఆత్మవిశ్వాసం పట్టుదల ఉంటే అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. మంగళవారం సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియంలో జాతీయ దివ్యాంగుల క్రీడలను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమే అన్నారు. మనసుకు కాదు అని ఆత్మవిశ్వాసం పట్టుదల ఉంటే దివ్యాంగులు అద్భుత విజయాలను సాధించగలరని తెలిపారు. మీరు చదువులో మంచి స్థాయిని సాధించి జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. మీ ప్రయత్నం మీ కుటుంబానికి ,సమాజానికి గర్వకారణం కావాలన్నారు.దివ్యాంగులు ఉన్నత శిఖరాలు అందుకోవాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా సోలార్ సొసైటీ ప్రెసిడెంట్ జాబీదా చూపిన ప్రేరణను ప్రశంసించారు. సోలార్ సొసైటీని స్థాపించి తానే ఆదాయం పొందేటట్టు కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించడం ద్వారా అందరికి ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, యువజన సంక్షేమ అధికారి కాసీం బేగ్, దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులు సాయికుమార్, రవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు గాలికొదిలి విజయోత్సవాలా?

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సిఎం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు గాలికొదిలి విజయోత్సవ సభలు ఎలా నిర్వహిస్తారని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గాంధీభవన్‌లో కూర్చొని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విలక్షణంగా చెబుతున్నారని నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని మాటలు అదుపులో ఉంచుకోవాలని హితవు పలికారు. హరీష్‌రావు గత 30 ఏళ్లుగా పని చేస్తున్న నిఖార్సైన వ్యక్తి అని, తాను ఎప్పటికీ కెసిఆర్‌తోనే ఉంటానన్నారు. సిఎం కాంగ్రెస్ పార్టీలో కొనసాగేటట్లు కనిపించటం లేదన్నారు. సెక్రటేరియట్ కెసిఆర్ కడితే సిఎం రేవంత్‌రెడ్డి సెక్రటేరియట్ గేట్లు ఒకవైపు నుంచి మరోవైపు పెట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏం ముఖం పెట్టుకొని విజయోత్సవ సభ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పదినెల్లు హైడ్రా పేరిట ఇల్లు కూలగొట్టడం తప్ప కట్టించిన పాపాన పోలేదన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్, మాజీ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# దశాబ్దాల పోరాటల ఫలితమే కుల గణన

బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** బిసిలకు ఉన్న బానిస సంకెళ్లు తెగిపోయేందుకు, గులాం గిరి బద్దలు కొట్టేందుకు, దశాబ్దాలుగా జరుగుతున్న ఉద్యమాలు, పోరాటల ఫలితంగానే నేడు రాష్ట్రంలో చరిత్రాత్మక కుల గణన జరుగుతుందని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ తెలిపారు. ప్రతిఒక్కరికి కులమే భవిష్యత్, కులమే ఆధారమని, సమగ్ర సర్వే చేసే అధికారులకు కులం పేరు తప్పు చెప్పొద్దని సర్వేకు సహకరించాలన్నారు. బిసిలందరూ పార్టీలక తీతంగా ఒకటవ్వాలని, రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ పట్టణంలోని తెలంగాణ భవన్‌లో మెదక్ జిల్లా బిసి సంఘం ఆధ్వర్యంలో బిసి కుల గణనపై రౌండ్ టేబ్ల్ సమావేశం జిల్లా అధ్యక్షులు మెట్టు గంగారాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిసి సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో జరుగుతున్న కుల గణన అలంపూర్ నుంచి మొదలైన చైతన్య యాత్ర మెదక్ చేరుకుందన్నారు. వచ్చే అన్ని ఎన్నికలకు ఈ సర్వే పునాది రాయి లాంటిదన్నారు. తెలంగాణలో చారిత్రాత్మకంగా కులగణనలో బిసిలు అందరు భాగస్వాములు కావాలన్నారు. పిడికెడు శాతం లేని అగ్రకులాల వాళ్ళు రాజ్య అధికారం చేస్తున్నారనీ, పార్టీలకు అతీతంగా బిసి బిడ్డలు పని చేస్తే రాజ్య అధికారం మనకే వస్తుందన్నారు. బిసిల వాటా కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అన్నారు. బిసి కుల గణన వల్ల బిసి జనాభా, వారి రిజర్వేషన్ వాటా తేలుతుందనీ పేర్కొన్నారు. కుల గణన సర్వేను బిసిలు తేలికగా తీసుకోకూడదనీ బిసి బిడ్డల కోసం వారి రాజ్యాంగ హక్కుల కోసమైనా సర్వేకు సహకరించాలని కోరారు. ఎన్నో పోరాటాలు చేస్తే సర్వే జరుగుతుందన్నారు. బిసిలను ఐక్యం చేయడం కోసమే ఈ సమావేశం అన్నారు. భారతదేశం లో ఏ రాష్ట్రంలో కూడా కుల గణన జరగడం లేదని, తెలంగాణలో రాష్ట్రంలో మాత్రమే జరగుతుందన్నారు. స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ వాళ్ళు తీసిన లెక్కలే ఇప్పటివరకు ఉన్నాయనీ, మొదటిసారి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఈ సర్వే జరుగుతుందనీ చెప్పారు. సర్వేలో అన్ని విషయాలు ఎన్యుమారెటర్లకు సహకరించి చెప్పాలనీ, ముఖ్యంగా 56వ ప్రశ్న కులం అనే ప్రశ్నకు మాత్రం కచ్చితంగా బిసిలు సమాధానం చెప్పాలన్నారు. బిసిలురాజ్యాధికారం కైవసం చేసుకోవడానికి ఈ కుల గణన వజ్రాయుధం లాంటిదన్నారు. రాజకీయ నాయకులు ఎన్నికల ఆపడవిట్‌లో సమగ్ర వివరాలు రాసి బాం డ్ పేపర్ ఇవ్వాలి కానీ రాజకీయ నాయకులు సమర్పిం చే అఫిడవిట్‌లో వందల తప్పులు ఉంటాయని,అలాటిం ది బిసి బిడ్డల ఆత్మగౌరవం కోసం జరిగే వారి రిజర్వేషన్ కోసం జరిగే సర్వేకు సహకరించాలనీ కోరారు. 1992లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రి ఉన్నప్పుడు సుప్రీంకోర్టు కుల గణన చేయాలని ఆర్థిక, విద్య, ఉద్యో గ, రాజకీయ విషయాలు తెలుస్తాయని సర్వే చేపట్టాలని జడ్జిమెంట్ ఇచ్చిందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో బిసిలను చట్టసభలకు పంపడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు బిసిల అభివృద్ధి కోసం త్వరలో రథయాత్ర చేపడతామన్నారు. బిసిలు ఆత్మ గౌరవం కోసం పోరాటం చేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అంతకుముందు మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళుగా బిసిలు విపరీతమైన అణిచివేతకు గురయ్యారని ప్రతి రాజకీయ పార్టీలన్నీ బిసిలను వెన్ను పోటు పొడిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు దామోదర్, మల్లిఖార్జున్ గౌడ్, చింతల నర్సింలు, రామచందర్ గౌడ్, బీమారి శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మీ-సేవ కేంద్రం అనుమతి రద్దు

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో సయ్యద్ ముబారక్‌కు చెందిన మీసేవ కేంద్రం, ఆధార్ పిఇసి కేంద్రం అనుమతులు రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో దరఖాస్తుదారులకు రసీదు ఇవ్వకపోవడం, సేవలు నిర్ణీత ధరలకు అదనంగా వసూలు చేయడం, ధరల పట్టికను ప్రదర్శనలో ఉంచకపోవడం, ఇతర నిబంధనలు ఉల్లంఘించడం కారణంగా సమగ్ర విచారణ జరిపి మీ సేవా కేంద్రం, ఆధార్ పిఇసి అనుమతులు రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

## సర్వే తీరు పరిశీలన



**ప్రజాపక్షం/తలమడుగు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే తలమడుగు మండలంలోని ఆయా గ్రామ ప్రంచాయతీ పరిధిలో కొనసాగుతుంది.ఇందులో భాగంగా మండలంలోని సుండిడి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మంగళవారం పరిలశీలించారు.ఈ సందర్భంగా సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.వీరి వెంట పంచాయతీ సెక్రటరీ సచిన్,ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు.

# ప్రజా పాలన కళాయాత్ర ప్రారంభం

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** ప్రజా పాలన కళాయాత్ర సమాచార, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో వాహనాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేయగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ప్రజా విజయోత్సవాలు 19 నుంచి డిసెంబర్ వరకు 07 జిల్లాలోని మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలు, 21 మండలాల్లోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లపై ప్రచారం చేయనున్నారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో, ప్రతి మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కళాయాత్ర మెదక్ జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, ప్రజల జీవన విధానాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలలో తీసుకువెళ్లడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆర్‌టిసి ఉచిత ప్రయాణం ద్వారా ఒక కోటి 62 లక్షల మంది మహిళలు బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం పొందగా, 53 కోట్ల 24 లక్షల రూపాయలు లబ్ధి చేకూరిందన్నారు. గృహ జ్యోతి కార్యక్రమం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటు మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 01 లక్ష 25 వేల 737 మంది వినియోగదారులకు చేయడం జరిగిందని వివరించారు. 4359 మహిళా స్వయం సహాయక సంఘాలకు సుమారు 354 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని, స్త్రీ నిధి ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 28 కోట్ల రూపాయల రుణం, మైక్రో ఎంటర్ప్రైజెస్ లను 51 కోట్ల 20 లక్షలు రూపాయల వ్యయంతో పూర్తి చేయబడినవన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి పాలనయంత్రాంగం నిరంతర కృషి చేస్తుందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాల సమగ్ర కుటుంబ సర్వే 1, లక్ష 50 వేల కుటుంబాలు సర్వే పూర్తయిందని వివరించారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కే.రామచంద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌టిసి డిఎం సం బంధిత తెలంగాణ సాంస్కృతిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభు త్వం ఈనెల 19వ తేదీ నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం నుండి సంస్కృతిక కార్యక్రమాల వాహనాన్ని ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలలో ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే జిల్లా వ్యాప్తంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, మంగళవారం నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు 19 రోజుల పాటు జిల్లాలోని 15 మండల కేంద్రాలు, 57 గ్రామాలు, 2 మున్సిపాలిటీలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసిల్దార్లు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలో హైదరాబాద్ నుండి 80 మందితో కూడిన సాంస్కృతిక కళ బృందం ప్రత్యేక కార్యక్రమాలు ని ర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి వై.సంప త్ కుమార్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా 'గూడెంగడ్డ'

జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ గౌడ్

ఘనంగా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజకవర్గంలోని ప్లాస్టిక్ రహిత గ్రామలు గూడెం గడ్డ గ్రామాన్ని తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ గౌడ్ అన్నారు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ సందర్భంగా మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని గూడ గ్రామంలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ రహిత గ్రామముగా తీర్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, కుటుంబ పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి తెలియజేశారు. అంతేకాకుండా మరుగుదొడ్డి లేకుంటే బతుకులు ఆగమని మరుగుదొడ్డి ఉంటే బతుకంతా భోగం అనే సూక్తిని ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు 100 మద్యపానం నిషేధంకు కట్టుబడి ఉండాలని అలాగే 100 మరుగుదొడ్లు వినియోగం 100 టాక్సీ కలెక్షన్స్ 100 తడి పొడి చెత్త వేరు చేయడం 100 ప్లాస్టిక్ రహిత గ్రామముగా తీర్చిదిద్దుకోవడం అనేది గ్రామ ప్రజల యొక్క ధైర్య సాహసాలు కృషి నిరంతరం పర్యవేక్షణ పట్టుదల ఎంతో అనిర్వచ నీయమైనదని ఆయన కొనియాడారు. అదేవిధంగా గ్రామాలలోని వివిధ శుభకార్యాలకు ప్లాస్టిక్ గ్లాసులు ప్లాస్టిక్ ప్లేట్లు వినియోగించి క్యాన్సర్ బారిన పడకుండా ఉండడానికి ముందస్తు చర్యగా స్టీల్ బ్యాంకు ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ బ్యాంకు ద్వారా గ్రామంలో అవసరమున్న కుటుంబాలకు గ్లాసులు ప్లేట్లు మిగతా పాత్రలు గ్రామపంచాయతీ నుంచి ఇవ్వ డం జరుగుతుందన్నారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఒ ఎల్లయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాద య్య, ఆర్డిఓ మై హిపాల్ రెడ్డి తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ మధులత ఎపిఎం గౌరీ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు స్వప్న గ్రామ కార్యదర్శి నాగేష్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తా రా సింగ్, శేఖర్, ఐకెపి సిసిలు భాగ్య ప్రవీణ, ఆంజనేయులు, దేవి సింగ్, రవీందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల ముఖ్య కార్యదర్శి డిఎస్ చౌహాన్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** నిబంధనల మేరకు వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని, ఆలాగే రైతులకు ఇబ్బంది కాకుండా జనవరి చివరి వరకు కొనుగోలు చేపట్టాలని ఆదేశించినట్లు పౌరసరఫరాల ముఖ్య కార్యదర్శి డిఎస్ చౌహాన్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మనూ చౌదరితో కలిసి తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 8086 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యానికి రూ.500 బోనస్ వెంట వెంటనే వర్తింప జేస్తున్నట్లు చెప్పారు. కాగా సిద్దిపేట జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉండగా, ఇప్పటికే 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కార్యదర్శి జాన్ వెస్లీ పాల్గొన్నారు.

## సకాలంలో బిల్లుల చెల్లింపులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో ఓపిఎంఎస్ వివరాలను నమోదు చేసేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలన్నారు. మాక్లూర్ మండలం ఓడ్యాట్‌పల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం ఎంత రైస్‌మిల్లులకు ఎంత పరిమాణంలో ధాన్యం రవాణా చేశారు. బిల్లుల చెల్లింపులు ఏ మేరకు జరిగాయి తదితర వివరాలను నిర్వాహకులకు అడిగి తెలుసుకున్నారు. ఏఈఓ ధృవీకరణ పత్రాన్ని జతపరుస్తూ ఆన్‌లైన్‌లో సన్నధాన్యం వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, సరిపడా గన్నీ బ్యాగ్‌లను అందుబాటులో ఉంచుకోవాలని రతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు.కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీసీఓ శ్రీనివాస్ తదితరులున్నారు.



# పరిశుభ్రత పాటించడంతో వ్యాధులు దూరం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ హాజీపూర్/ మంచిర్యాల :** ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నివాస ప్రాంతాలు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను దూరంగా ఉంచవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని హాజీపూర్ మండల తహశిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహశిల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రభుత్వం పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు మంజూరైన ప్రొసీడింగ్స్ ను అందజేశారు. అనంతరం హాజీపూర్ మండల కేంద్రం, కర్ణమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో సన్నరకం, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు చెల్లించడం జరుగుతుంద ని, రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీ సుకువచ్చే సమయంలో నిబంధనలను తప్పనిసరి గా పాటించాలని, కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, త్రాగునీరు, నీడ, గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వ డం లేదనే కోపంతో సోంత కోడలినే(కొడుకు భార్యనే) హత్యాయత్నం చేయడానికి ప్రయత్నం చేసిన మామకి అసిస్టెంట్ సెషన్స్ న్యాయ మూర్తి జి.శ్రీనివాస్ మూడు సంవత్సరాల జైలు శిక్ష,1000 రూపాయల జరిమానా విధించినట్లు నిర్మల్ జిల్లా ఎస్‌సి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల ప్రకారం నర్సాపూర్ జికి చెందిన నేరస్తుడు బైండ్ల భోజన్న మద్యానికి బానిస అయి డబ్బులు ఇవ్వకపోయే సరికి కక్ష్య పెంచుకునీ తన కోడలితో డబ్బుల గురించి గొడవ పడి ఇనుప సాలకతో దాడి చేశాడు. నేరస్తుడి కోడలు బైండ్ల స్వాతి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై పాకాల గీత కేసు నమోదు చేసి నేరస్తుని రిమాండుకి తరలించి చార్జి షీట్ వెయ్యగా,మెజిస్ట్రేట్ నేరస్తుడికి మూడు సంవస్సరాల జైలు శిక్ష,1000 రూపాయల జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని, ప్రజలు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్‌పి తెలిపారు.పోలీసులు,ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ,న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.పై కేసులో నిందితులకి శిక్ష పడటం లో కృషి చేసిన వై.రమణ రావు,అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి పాకాల గీత,కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్‌ఐ దల్లు సింగ్,కోర్టు డ్యూటీ ఆఫీసర్ మహేందర్ సింగ్ కానిస్టేబుల్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఎఎంసి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/పిట్లం :** పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ మహోత్సవం మంగళవారం పిట్లం మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో ప్రజలే పాలకులుగా, రైతులే రాజులుగా వారి శ్రేయస్సు కొరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కష్టపడి పనిచేస్తున్నామన్నారు. ప్రతీ పని చాలా నిబద్ధతతో క్రమశిక్షణతో చేస్తున్నామని తెలిపారు. పిట్లం ఎఎంసి 1993లో ప్రారంభించడం జరిగిందన్నారు., 11 ఎకరాల విస్తీర్ణంలో ఆయా వసతులు కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంబిగె హన్మండ్లు, నిజాంసాగర్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిప్ప శివ, మైనార్టీ నాయకుడు, రెండు మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడ

## ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీ
# ఫైనల్‌కు భారత్

మహిళల ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీలో భారత్ ఫైనల్‌కు అర్హత సాధించింది. బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరిగిన సెమీఫైనల్లో విజయం సాధించింది. జపాన్‌తో 2–0 తేడాతో గెలుపొందింది. కాగా, లీగ్ దశలో వరుస విజయాలతో అజేయంగా ముందుకు సాగిన సలీమా టీమ్ సెమీ ఫైనల్‌లోనూ అదే దూకుడు కనబరిచి తుది పోరుకు దూసుకెళ్లింది. తొలి 3 క్వార్టర్స్‌లో ఇరు జట్ల మధ్య మ్యాచ్ నువ్వా నేనా అన్నేలా సాగింది. ఇరు జట్లు కూడా ఒక్క గోల్ కూడా చేయలేదు. అయితే, ఉత్కంఠంగా సాగిన ఈ నాలుగో క్వార్టర్‌లో ఒత్తిడిని చిత్తు చేస్తూ భారత్ మహిళల టీమ్ 2 గోల్స్ సాధించింది. ఇండియన్ వైస్ కెప్టెన్ నవనీత్ కౌర్ మొదట గోల్ చేయగా, లాల్‌రెమ్సియామి రెండో గోల్ కొట్టింది. మరోవైపు చైనా, మలేసియా టీమ్స్ మధ్య జరిగిన తొలి సెమీ ఫైనల్‌లో 3– తేడాతో డ్రాగన్ జట్టు జయకేతనం ఎగురవేసింది. దీంతో బుధవారం జరగబోయే ఫైనల్ మ్యాచ్‌లో చైనా, భారత్ జట్లు తలపడనున్నాయి.





## పాకిస్థాన్‌లో అంధుల టీ–20 ప్రపంచ కప్‌కు భారత్ దూరం!



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ వేదికగా నవంబర్ 23 నుంచి డిసెంబర్ 3 వరకు అంధుల టీ20 ప్రపంచ కప్ జరగనుంది. ఈ టోర్నీ నుంచి డిఫెండింగ్ ఛాంపియన్స్ భారత్ వైదొలగింది. భారత క్రికెట్ జట్టు పాక్‌లో పర్యటించడానికి భారత విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించింది. పాకిస్థాన్ వెళ్లడానికి అంధుల క్రికెట్ జట్టుకు క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) లభించింది. కానీ, భారత జట్టును అక్కడికి పంపడానికి విదేశాంగ శాఖ ఆమోదం తెలపలేదు. టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టు పాక్‌లో పర్యటించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిందని భారత అంధుల క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి శైలేంద్ర యాదవ్ తెలిపారు. దీంతో భారత జట్టు లేకుండా టోర్నీ జరగనుంది. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే, తమ జట్టు పాకిస్థాన్‌లో పర్యటించబోదని బిసిసిఐ ఐసిసికి తేల్చిచెప్పింది. టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించి భారత్ మ్యాచ్‌లను యుఎఇలో నిర్వహించాలని కోరింది. దీనికి పాక్ అంగీకరించడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో అంధుల ప్రపంచకప్ నుంచి భారత్ వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.

## ఆస్ట్రేలియాకు ఛాన్స్ ఇవ్వొద్దు





బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాను మట్టికరిపించాలంటే టీమ్ ఇండియా అత్యున్నత స్థాయి ఆటతీరును ప్రదర్శించాల్సిందే అని మాజీ కోచ్ రవిశాస్త్రి తేల్చి చెప్పాడు. ఓ ఆంగ్ల క్రీడా ఛానెల్‌తో ఆయన మాట్లాడుతూ భారత్ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించాడు. 'కొన్ని కఠినమైన విషయాలు చెబుతా. ఇక్కడ కోచ్‌గా మూడు పర్యటనలకు వచ్చిన అనుభవంతో చెబుతున్నాను.. ప్రతి ఆటగాడు అత్యున్నత స్థాయిలో ఆడాల్సిందే. ఆసీస్ చేసే తప్పిదాలను ఒడిసి పట్టుకోవడానికి మీరు పూర్తిస్థాయి సంసిద్ధతతో ఉండాలి. ప్రత్యర్థికి ఏ మాత్రం ఛాన్స్ ఇవ్వకుండా ఉండటమే ఏకైక మార్గం. అంతకు మించి మరో దారిలేదు. అదే సమయంలో ఆస్ట్రేలియా మీడియా నుంచి ఎలాంటి స్పందన వస్తుందో ముందే అంచనాకు రండి. అది పూర్తిగా ఆసీస్‌కు పక్షపాతంగా ఉంటుంది. కానీ, మీ కుర్రాళ్లతో కలిసి కఠిన సవాళ్లను విసిరి.. అద్భుతంగా ఆడితే.. మీడియా మిమ్మల్ని గౌరవిస్తుంది'' అని రవిశాస్త్రి వెల్లడించాడు. యశస్వి జైస్వాల్ ఈ పర్యటన ముగిసేనాటికి మరింత మెరుగైన బ్యాటర్‌గా అవతరిస్తాడని రవిశాస్త్రి అంచనావేశాడు. ''అతడు ప్రపంచ శ్రేణి ఆటగాడు. ఇంగ్లాండ్‌పై స్వేచ్ఛగా ఆడటం మీరు చూశారు. చాలా శ్రమించి ఆ స్థాయికి వచ్చాడు. పరుగుల దాహం.. ఆడాలన్న కసి అతడి కళ్లలో కనిపిస్తాయి. ఆటలో మమేకమైపోవాలనుకుంటాడు. పెర్త్ వంటి పిచ్‌లకు అలవాటు పడటం అంత తేలిక కాదు ఏ ఆటగాడికైనా సవాళ్లు విసురుతాయి. కానీ, ఒక్కసారి ఆకళింపు చేసుకొంటే.. తన ఆటతో యశస్వి రంజింప చేస్తాడు. అతడు ఇలాంటి పిచ్‌లను ఇష్టపడతాడు. ఈ తరహా వికెట్లపై మంచి స్కోర్లు సాధించగల సత్తా ఉన్న వారిలో అతడు కూడా ఒకడు'' అని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాలో 2018, 2021లో టీమ్ ఇండియా విజయాలు సాధించిన సమయంలో రవిశాస్త్రి జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. తాజాగా భారత్ ఆసీస్ టూర్‌లో మొత్తం ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటిల్లో నాలుగు విజయాలు సాధిస్తే కానీ.. సజావుగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు చేరగలదు.

# రీల్



## జపాన్ షూట్‌లో విశ్వంభర

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా యువ దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న భారీ విజువల్ ట్రీట్ చిత్రం విశ్వంభర కోసం తెలిసిందే. మరి చాలా కాలం తర్వాత చిరు చేస్తున్న ఫాంటసీ సినిమా ఇది కాగా హైప్ మెగా ఫ్యాన్స్ లో నెక్స్ట్ లెవెల్లో ఉంది. అయితే ఈ సినిమా టీజర్ కూడా రీసెంట్ గానే మొదలైంది. ఈ తర్వాత రిలీజ్ కూడా ఎలాగో వాయిదా పడేసరికి మేకర్స్ కి చిన్న బ్రేక్ దొరికింది. అయితే ఈ గ్యాప్ తర్వాత ఓ షెడ్యూల్ ని జపాన్ లో ప్లాన్ చేసినట్టుగా టాక్ వచ్చిన సంగతి తెలిసిందే. మరి దీనిపై మరో అప్డేట్ ఇపుడు వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ షూట్ లోనే హీరోయిన్ త్రిషతో మంచి డ్యూయెట్ ని ప్లాన్ చేస్తున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. మరి స్టాలిన్ తర్వాత మళ్ళీ త్రిష చిరు జోడి జత కట్టబోతుంది. మరి మళ్ళీ వీరి నడుమ కెమిస్ట్రీ ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ కీరవాణి సంగీతం అందించగా యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## ట్రైలర్ 2.0 రిలీజ్ చేసిన మెకానిక్ రాకీ




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా మీనాక్షి చౌదరి అలాగే శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్ గా దర్శకుడు రవితేజ ముళ్ళపూడి తెరకెక్కించిన సాలిడ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం మెకానిక్ రాకీ కోసం తెలిసిందే. మరి రీసెంట్ గానే సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా మేకర్స్ సక్సెస్ ఫుల్ గా చేశారు. అయితే ఇపుడు సినిమా నుంచి రెండో ట్రైలర్ ని మేకర్స్ ఇపుడు తీసుకొచ్చారు. కొన్నాళ్ల క్రితం వచ్చిన ట్రైలర్ 1.0 మంచి కామెడీ అండ్ మాస్ ఎలిమెంట్స్ తో కనిపించి మాస్ ఆడియెన్స్ ని ఎంటర్టైన్ చేసేలా కనిపిస్తే ఈసారి వచ్చిన ట్రైలర్ 2.0 మా త్రం వేరే కట్ అని చెప్పాలి. ఇందులో పూర్తిగా ఎమోషన్స్, యాక్షన్ ఎలి మెంట్స్ తో నింపేశారు అని చెప్పాలి. మరి విశ్వక్ సేన్ తన రోల్ లో పర్ఫె క్ట్ గా కనిపిస్తుండగా తన యాక్షన్ మూమెంట్స్ సాలిడ్ గా ఉన్నాయి. అలా గే ఎమోషన్స్ హీరోయిన్స్ పై సీన్స్ కూడా బాగున్నాయి. ఇంకా సునీల్ మరో సారి తన విలనిజాన్ని ఓ రేంజ్ లో చూపించినట్టుగా కనిపిస్తుంది. అలాగే విశ్వక్ తో ఫేస్ టు ఫేస్ సీన్స్ కూడా బాగుండేలా ఉన్నాయని చెప్పాలి. ఇంకా జేక్స్ ఇచ్చిన స్కోర్ కూడా ఇందులో బాగానే ఉంది. ఇక ఈ చిత్రాన్ని ఎస్ ఆర్ టి ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహించగా ఈ నవంబర్ 22న రిలీజ్ కి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే.

## రిలీజ్ డేట్ లాక్ చేసుకున్న 'బచ్చల మల్లి'




అల్లరి నరేశ్ కామెడీ హీరో నుండి సీరియస్ పాత్రల వరకు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆయన తాజాగా లీడ రోల్‌లో నటిస్తున్న మరో సీరియస్ మూవీ 'బచ్చల మల్లి' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు సుబ్బు మంగాదేవి డైరెక్ట్ చేస్తుండగా, ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్ర పోస్టర్స్ సినిమాపై మంచి బజ్‌ని క్రియేట్ చేశాయి. ఇక తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ లాక్ చేశారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న గ్రాండ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా అనౌన్స్ చేశారు. అల్లరి నరేశ్ మాస్ యాక్షన్ ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్తుందని చిత్ర యూనిట్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించి తాజాగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మేకర్స్ రివీల్ చేశారు. ఈ పోస్టర్‌లో రగ్‌డ లుక్‌లో అల్లరి నరేశ్ సినిమాపై అంచనాలను పెంచేస్తున్నాడు. ఇక ఈ సినిమాలో అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తుండగా విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నాడు. రోహిణి, రావు రమేశ్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను రాజేష్ దండ, బాలాజీ గుట్ట ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాయి)

అధికంగా చలి తీవ్రత ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముందని తెలిపారు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉన్నాయన్నారు. ఆదిలాబాద్‌లో 12.7 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయయి. రాబోయే రోజుల్లో ఇంకా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందన్నారు. రాబోయే 5 రోజుల పాటు ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. ఆదిలాబాద్, మెదక్, పటాన్‌చెరు ప్రాంతాల్లో సాధారణ కంటే ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందన్నారు. ఈశాన్య రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో నవంబరు నుంచి చలి తీవ్రత ఎక్కువ ఉందన్నారు. ఈ కారణంగానే ఈ నెల నుంచి మంచు కురుస్తున్నట్లు చెప్పారు. తూర్పు, ఈశాన్య ఈదురు గాలుల ప్రభావం కూడా రాష్ట్రంపై అధికంగా ఉందన్నారు. ఈ గాలిలో తేమ అధిక శాతం ఉంటున్న కారణంగా అవి ఉత్తర తెలంగాణలోకి ప్రవేశించగానే పొగ మంచు పడటం మొదలవుతుందన్నారు. ఈ పవనాలు దక్షిణ భారతం నుంచి మధ్య, ఉత్తర భారతం వైపుగా సాగుతాయన్నారు. శీతాకాలంలో చలి తీవ్రత ఉదయం 4.30గంటల నుంచి ఎక్కువగా ఉంటుందన్నారు. దట్టమైన పొగ మంచు కురుస్తూ ఉంటుందన్నారు. శీతాకాలంలో చిన్న పిల్లలు, వృద్ధులు వేడి పానీయాలు తీసుకోవాలని, ముదురు రంగు దుస్తులు ధరించాలని సూచించారు.

## ఢిల్లీలో కెటిఆర్ రాజకీయ డ్రామాలు: ఎంపి మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లగచర్లలో ప్రజలను రెచ్చగొట్టి అధికారులపై ఉసిగొల్పి, చేసేదంతా చేసి కెటిఆర్ ఢిల్లీలో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఎంపి మల్లురవి ఒక ప్రకటనలో విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలకు గిరిజనుల మీద ప్రేమ లేదని, 10 ఏళ్ల పాటు ఏనాడైనా దళిత, గిరిజన ప్రజల కోసం ఏమైనా చేసారా అని ఆయన ప్రశ్నించారు.లగచర్లలో జరిగిన గొడవలకు కెటిఆర్ కారణమని తేలడంతో ఢిల్లీలో కెటిఆర్ కొత్త నాటకాలకు తెరలేపాడన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ లు కలెక్టర్, అధికారులపై దాడులను సమర్థిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఏనాడైనా పైసా ప్రజలకు న్యాయం చేసారా అని పేర్కొన్నారు. దళిత, గిరిజన విద్యార్థుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే డైట్, కాస్మొటిక్ చార్జెస్ పెంచింది మీకు కనీసం అలాంటి ఆలోచన అయిన వచ్చిందా అని పేర్కొన్నారు.కొడంగల్ లో ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు అవుతున్నాయి అందులో మెజారిటీగా దళిత, గిరిజనులు లబ్ది పొందుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్ని కార్యక్రమాలలో దళిత, గిరిజనులకే అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉ న్నప్పుడు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ల లో ముంపు అయితే రైతుల నష్టపరహారం కోసం. అడిగితే ఎలా కొట్టించారో తెలంగాణ రాష్ట్ర ప్రజల కు తెలునన్నారు.ఇసుక మాఫియా మీద ఉద్యమం చేస్తే నెరేళ్లలో దళితులను ఎలా హింసించారో మర్చిపోయారా అని గుర్తు చేశారు. అన్ని విషయాలు మరిచిపోయి ఇలా ఢిల్లీలో నాటకాలు ఆడితే ప్రజలు నమ్ముతారా కెటిఆర్ అని ప్రశ్నించారు.

## అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వండి

### ప్రజాభవన్‌లో డిఎస్‌సి-2008 బాధితుల ఆవేదన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయ్యి 50 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వడం లేదని డిఎస్‌సి2008 అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 200 మందికిపైగా అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్ లోని ప్రజా భవన్ కు తరలివచ్చారు. 15 ఏండ్లుగా ఎదురు చూస్తున్న తమకు ఉద్యోగాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, ఇటీవల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తిచేయించిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, క్యాబినెట్ మంత్రులకు, విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం చొరవతో సెప్టెంబర్ మొదటి వారంలోనే తమకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1400 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నట్టు చెప్పారు. వెంటనే కౌన్సిలింగ్ షెడ్యూల్ ఇచ్చి, అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇస్తారని ఆశించామన్నారు. కానీ 50 రోజులు గడుస్తున్నా ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్న కారణంతో తమలో చాలా మంది ప్రైవేట్ ఉద్యోగాలు మానేయాల్సి వచ్చిందని చెప్పారు. దీంతో తమ కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. తమ వేదనను అర్థం చేసుకొని, కౌన్సిలింగ్ షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.


**అధికారులతో మాట్లాడిన ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి**


ప్రజాభవన్లో కూర్చున్న అభ్యర్థులతో ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి చర్చలు జరిపారు. అభ్యర్థుల నుంచి వివరాలు సేకరించారు. వెంటనే విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి, ఇతర అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. అభ్యర్థుల జాబితా రూపకల్పన ప్రక్రియ చివరి దశలో ఉన్నదని చెప్పారు. అధికారులతో తాను మరోసారి మాట్లాడుతానని, రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని అభ్యర్థులకు చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఎస్‌సి2008 సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, కార్యదర్శి మెరుగు భాస్కర్, ప్రమీల, మహేశ్వరి, పరమేశ్వరి, జ్యోతిర్మయి, భూపతి రెడ్డి, కర్ణ ప్రసాద్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.


## ఊచలు లెక్కించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

రాకుండా చిల్లర గాళ్లను రోడ్డుమీదికి వదిలారని, కేటిఆర్ మొదటి రోజు మాట్లాడితే, తెల్లారి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతారని అన్నారు. 2014 నుండి 2019 వరకు కెసిఆర్ ప్రభుత్వ కాలంలో ఒక్కరు కూడా మంత్రివర్గంలో మహిళలు లేరని, 2023 డిసెంబర్ 7వ తారీఖున అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి మంత్రివర్గంలో సీతక్క, కొండ సురేఖ, అదేవిధంగా ఎంపీగా డాక్టర్ కడియం కావ్య, వరంగల్ హనుమకొండ జిల్లా కలెక్టర్లు, నగర మేయర్ సుధారాణి, చీఫ్ సెక్రటరీ కూడా మహిళలే ఉన్నారి, మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. స్త్రీలు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, కేవలం టాటా, అంబానీ కాకుండా తెలంగాణ ఆడబిడ్డలను కూడా తీర్చిదిద్దడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ఆదర్శవంతమైన ఉద్యమానికి పుట్టినిల్లుగా పేర్కొనబడిన వరంగల్ జిల్లాలో అభివృద్ధి పథంలోనికి తీసుకుపోతానని ఇందులో భాగంగానే వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం సుమారు 6000 కోట్లను ఖర్చు చేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, విమానాశ్రయం , ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని దీని ద్వారా అనేక కంపెనీలు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందని వరంగల్లు అభివృద్ధి చేయడం నా ప్రధానమైన కర్తవ్యం అని ఆయన అన్నారు. ఇందిరాగాంధీ 157 జయంతి పురస్కరించుకొని మహిళలందరినీ అభివృద్ధి పథంలోనికి తీసుకుపోవడానికి ఈ కార్యక్రమాన్ని ఆడబిడ్డలకు అంకితం చేస్తున్నానని, ఈ అధికారం ఆడబిడ్డలు ఇచ్చిన అధికారమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే తండాలు గ్రామాలు ఇందిరమ్మ రాజ్యాన్ని చూస్తున్నాయని, మీరు ఇచ్చిన అధికారంతో నేను విజయవంతంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. కాకతీయులు పరిపాలించిన గొప్ప పరిపాలన నగరం వరంగల్ అని భద్రకాళి అమ్మవారి సాక్షిగా, రామప్ప టెంపుల్ ప్రపంచంలోనే గొప్ప కట్టడాలుగా గుర్తింపు పొందాయని కాబట్టి హైదరాబాద్ తో సమానంగా వరంగల్ ను కూడా అభివృద్ధి చేయాలని మీ జిల్లా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి నా వెంటపడి ఎయిర్ పోర్టు, మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం చేపట్టుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అన్నారు. ఉత్తర తెలంగాణలో వరంగల్ జిల్లా ఎంతో ప్రాధాన్యతగలదని, కాబట్టి నేను ఇటీవల మహారాష్ట్ర పోతే అక్కడ అనేక ప్రాంతాలలో విమానాశ్రయాలు ఉన్నాయని, ఇంతెందుకు ఆంధ్రప్రదేశ్లో కూడా అనేక జిల్లాలో విమానాశ్రయాలు ఉన్నాయన్నారు. ఉత్తర తెలంగాణలో కాకతీయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పరచడమే తన ప్రధాన ఉద్దేశం అని ఆయన అన్నారు. గత ప్రభుత్వ కాలంలో రైతు రుణమాఫీని లక్ష రూపాయలు పేరుతో నాలుగు సంవత్సరాలు చేశారని కానీ ఈ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారంగా 1800 కోట్ల రైతు రుణమాఫీ చేశామని అన్నారు ఇప్పటివరకు స్త్రీలకు 34 వేల కోట్లు వెచ్చించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి మహిళలను చైతన్య పరుస్తున్నామన్నారు. ప్రతి మహిళ స్వేచ్ఛగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కెసిఆర్ కు కనబడడం లేదా అని, తెలంగాణ రాష్ట్రాన్ని ఒక తాగుబోతు రాష్ట్రంగా తయారు చేసి ప్రతి పల్లె ప్రతి గ్రామం బెల్ట్ షాపులు పెట్టి విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయించాడని కేసీఆర్‌పు విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, రైతులకు రుణమాఫీ విషయంలో నూటికి నూరు శాతం ప్రతి ఒక్కరికి అమలు చేస్తామని ప్రతి నెల 7 లక్షల కోట్లు అప్పు కడుతున్నానని, ఇప్పుడు ప్రతి నెల 18 వేల, 500 కోట్లు ఆదాయం వస్తుందని, ఇందులో 6,500 కోట్లు జీతభత్యాలకు, 6,500 అప్పులకు కడుతున్నామన్నారు. మిగిలిన 5,500 కోట్లు కడుపు కట్టుకొని పైసా పైసా కూడా పెట్టి, రైతు రుణమాఫీ, వరికి మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. ప్రపంచ రికార్డు 66 లక్షల ఎకరాలలో వరి పండించారని ( ఇందులో ఒక కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించారని ఇది ప్రపంచ రికార్డు) అని రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకునే సొమ్ముతో అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని, కాళ్లలో కట్టెలు పెట్టి ఇబ్బందులు పెడితే దానికి ప్రతిఫలంగా ఊచలు లెక్కబెట్టవలసిన పరిస్థితులు వస్తాయని ఆయన అన్నారు, కెసిఆర్ నువ్వు అసెంబ్లీకి వచ్చి మాట్లాడు నువ్వు ఎప్పుడు వస్తే అప్పుడే అసెంబ్లీని ఏర్పాటు చేసి చేసిన అభివృద్ధి నేను చేసిన అభివృద్ధి మాట్లాడదామని అనేకసార్లు భిన్నవించానని, ఇప్పుడు కూడా ఈ వేదిక నుండి ప్రతిపాదన చేస్తున్న నువ్వు రా మాట్లాడదాం అని కెసిఆర్ కు రేవంత్ రెడ్డి సూచించాడు. బిర్లా, రంగాలు అనేక ఇబ్బందులు పెడుతున్నారని, మీరు చేసిన అభివృద్ధికి నేను చేసిన అభివృద్ధికి ప్రజలే తీర్పు ఇస్తారని, ఎవరైనా కాళ్లకు కట్టెలు పెట్టి ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదని, నేను కేసీఆర్ ను తొక్కుకుంటూ అధికారంలోనికి వచ్చానని, అడ్డం వస్తే తొలగించుకొని ముందుకు పోతానని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కిషన్ రెడ్డి గుజరాత్ లో ఒక నీతి ఇక్కడొక నీతి మూసి విషయంలో రెండు నాలుకల ధోరణి మాట్లాడవద్దని నీకు అసలు ఇక్కడ ఉండే అర్హత లేదని, నీకు అధికారం ఇచ్చింది మోడీ కాదని సికింద్రాబాద్ ప్రజలని, మూసీ నది అభివృద్ధి చేస్తూ ఉంటే అడ్డుపడతావా అని ఇది ఆత్మ గౌరవం కి దెబ్బతీస్తుందని మూట ముళ్ల చదువుకొని గుజరాత్ కు వెళ్ళిపో అని రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు.





**మహిళల ఎదుగుదలకు ఎంతైనా ఖర్చు చేస్తాం : భట్టి**

'మహిళలు ఆర్థికంగా బాగుపడితేనే ఈ రాష్ట్రం ఎదుగుతుంది అందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం మీది.. మీరు కోరుకున్న ప్రభుత్వం మీరు కోరుకున్న అన్నిటిని ఈ ప్రభుత్వం నెరవేరుస్తుందని అందుకే విజయవంతంగా ఏడాది పాలన పూర్తిచేసుకుని ధైర్యంగా సభ పెట్టామని తెలిపారు. వరంగల్ అంటేనే భావ స్వేచ్ఛ అనేక భావజాలాలకు ఈ పట్టణం నిలయమని పేర్కొన్నారు. అన్ని భావజాలాలను స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణాన్ని మా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. భావ స్వేచ్ఛ ను పునికిపుచ్చుకొని కాళోజీ దీవెనలతో మా ప్రభుత్వం ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మహిళా సంఘాల తో నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి నిర్ణయించి ముందుగా వారి నుంచి వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఈ నిర్ణయం దేశ చరిత్రలో చరిత్రాత్మకం ..భవిష్యత్తు లోనూ ఈ సాహసం ఎవరూ చేయలేరని అన్నారు. జనాభలోని సగం మంది ఉన్న మహిళలను మహాలక్ష్ములుగా కోటేశ్వరులుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని తెలిపారు. రాష్ట్రంలో మహిళ లకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని, ప్రత్యేక వడ్డీ లేని రుణాలు 25 వేల కోట్ల చొప్పున ఐదేళ్ల కాలంలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు రాష్ట్ర మహిళలకు ఇస్తాం అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న గత ప్రభుత్వం ఇందిరా క్రాంతి పథం పక్కన పెట్టింది, మహిళలకు వడ్డలేని రుణాలను వదిలేసింది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆరోపించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలే కాదు వారిని పారిశ్రామిక వేత్తలు గా తీర్చిదిద్దుతాం అన్నారు. వరంగల్లో జర్నలిస్ట్ కాలనీని కుర్చీ వేసుకుని కట్టిస్తా, జర్నలిస్టులు దావత్ ఇవ్వాలని చెప్పిన మనిషి జాడ లేకుండా పోయారని మాజీ సీఎం కేసీఆర్ ను పరోక్షంగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆరు నెలల కాలంలోనే కాళోజీ కళాక్షేత్రానికి నిధులు కేటాయించి పూర్తి చేశారని తెలిపారు. ఈ సభలో వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, జూపల్లి క్రిష్ణా రావు,ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ రాజకీయ సలహాదారు కె. కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్ రెడ్డి,ఎంపీలు బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మధుసూధనాచారి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి,మురళీనాయక్,రామచంద్రునాయక్,మాజీ ఎమ్మెల్సీ కొండ మురళి, తదితరులు పాల్గొన్నారు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com